

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 20-7-2025 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 134 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: దశమి మ.12:13 తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక రా.10:53 తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.11:45-1:14, దుర్ముహూర్తం: సా.5:05-5:57, అమృతఘడియలు: రా.8:39-10:08, రాహుకాలం: సా. 4:30-6:00, సూర్యోదయం: 5:54, సూర్యాస్తమయం: 6:48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చార్జిషీట్‌లో జగన్‌!



అభియోగ పత్రంలో పలుచోట్ల ఆయన పేరు

రూ. 3,500 కోట్ల స్కామ్‌పై తొలి చార్జిషీట్‌



చార్జిషీట్‌ ప్రతులను ట్రంకు పెట్టెల్లో కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

305 పేజీలు.. 70 వాల్యూమ్స్‌

మద్యం పాలసీ, జీవోలు.. ఎఫ్‌ఎస్‌ఎల్‌ నివేదికలు

268 వాంగ్మూలాలు.. నిందితుల స్టేట్‌మెంట్లు

తొలి చార్జిషీట్‌లో మిథున్‌రెడ్డి పేరూ!

కనిపించని ధనుంజయ్‌ రెడ్డి, కృష్ణమోహన్‌ రెడ్డి, బాలాజీ గోవిందప్ప పేర్లు

తదుపరి చార్జిషీట్లో చేరుస్తామంటున్న సిట్‌

20 రోజుల్లో మరో చార్జిషీట్‌ దాఖలు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేలకోట్ల మద్యం కుంభకోణం కేసులో తొలి చార్జిషీటు దాఖలైంది. పలు కోణాల్లో దర్యాప్తు జరిపి... అనేక సాంకేతిక, ఇతర ఆధారాలు సేకరించిన 'సిట్‌'... శనివారం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రాథమిక చార్జిషీటు దాఖలు చేసింది. ఈ కుంభకోణంలో 'అంతిమ లబ్ధిదారు' ఎవరో తేల్చే దిశగా వేగంగా దర్యాప్తు సాగిస్తున్న సిట్‌ అధికారులు... చార్జిషీట్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ పేరును పలు చోట్ల ప్రస్తావించినట్లు తెలిసింది. ఎవరి ఆదేశాలతో మద్యం విధానాన్ని మార్చారు? ముడుపులు ఎలా మూటకట్టారు? వాటిని ఎక్కడికి, ఎలా తరలించారు? ఇందులో కీలక పాత్ర ఎవరిది? అనే ప్రశ్నలకు సాక్షులు, నిందితులు తెలిపిన అంశాలు, సేకరించిన ఆధారాలతో చార్జిషీటును రూపొందించారు. ఇదే సందర్భంగా... పలుచోట్ల జగన్‌ ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. శనివారం అరెస్టు చేసిన వైసీపీ ఎంపీ మిథున్‌ రెడ్డి పేరును కూడా చార్జిషీటులో సిట్‌ ప్రస్తావించినట్టు సమాచారం. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్‌ రెడ్డి(ఏ-1) అప్పటి ఎక్సైజ్‌ అధికారులు, డిస్టిలరీల యజమానులతో కలిసి మిథున్‌రెడ్డి (ఏ-4) ఈ కుంభకోణాన్ని ఎలా నడిపించారనేది కోర్టుకు సిట్‌ వివరించింది. కాగా, సీఎం మాజీ కార్యదర్శి, రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి ధనుంజయ్‌ రెడ్డి, జగన్‌ మాజీ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌ రెడ్డి, భారతి సిమెంట్స్‌ శాశ్వత డైరెక్టర్‌ గోవిందప్ప బాలాజీ

మిగతా 11వ పేజీలో...

మిథున్‌రెడ్డి అరెస్టు



శనివారం సిట్‌ కార్యాలయానికి వెళ్తున్న వైసీపీ ఎంపీ మిథున్‌ రెడ్డి

మద్యం స్కామ్‌లో ఆయనే మాస్టర్‌ మైండ్‌

సిట్‌ ముందు విచారణకు హాజరు.. ఐదుగంటలపాటు ప్రశ్నల వర్షం

గతంలో మాదిరే సహాయ నిరాకరణ.. రాత్రి 8 గంటలకు అరెస్టు చేసిన 'సిట్‌'

వైసీపీ ఎంపీని నేడు కోర్టులో హాజరుపరచనున్న అధికారులు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో 'మాస్టర్‌ మైండ్‌'... 'అంతిమ లబ్ధిదారు' తర్వాతి స్థానంలో ఉన్న వ్యక్తిగా భావిస్తున్న వైసీపీ ఎంపీ మిథున్‌ రెడ్డిని ఎట్టకేలకు 'సిట్‌' అధికారులు అరెస్టు చేశారు. జగన్‌ హయాంలో జరిగిన వేలకోట్ల మద్యం కుంభకోణంలో మిథున్‌ రెడ్డి నాలుగో నిందితుడు (ఏ4)గా ఉన్నారు. అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో... ఆయన అరెస్టు శుక్రవారమే ఖరారైంది. 'సిట్‌' ఇచ్చిన నోటీసు మేరకు శనివారం మధ్యాహ్నం 12.40 గంటలకు మిథున్‌ రెడ్డి విజయవాడ పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనను

మిగతా 11వ పేజీలో...

ఇవీ సెక్షన్లు...

మిథున్‌ రెడ్డిని క్రైమ్‌ నంబర్‌ 21/2024లో అరెస్టు చేసినట్లు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఐపీసీ 420, 409, 384, 120(బి), 201 రెడ్‌ విత్‌ 34, 37... అవినీతి నిరోధక చట్టం సెక్షన్‌ 7, 7ఏ, 8, 12, 13(1) (బీ), 13(2) కింద మంగళగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెల్లడించారు.

40 కార్లతో బయలుదేరి.. చివరికి ఒక్క కారుతో సరి!

బలప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు.. ఇది నిలబడే కేసు కాదు: మిథున్‌

● ఇలా మొదలైంది...

- లిక్కర్‌ స్కామ్‌పై 2024 సెప్టెంబరు 23న కేసు నమోదైంది.
- ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడ నగర పోలీసు కమిషనర్‌ రాజశేఖర్‌ బాబు నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పడింది.
- ఏ1 రాజ్‌ కసిరెడ్డిని ఏప్రిల్‌ 22న శంషాబాద్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో ఇదే తొలి అరెస్టు.
- శనివారం మిథున్‌ రెడ్డి అరెస్టుతో... ఇప్పటిదాకా అరెస్టయిన వారి సంఖ్య 12కు చేరింది.
- రాజ్‌ కసిరెడ్డిని అరెస్టు చేసిన 88 రోజులకు సిట్‌ ప్రాథమిక చార్జిషీటును దాఖలు చేసింది.



బెజవాడలో..

చురుగ్గా 'నైరుతి' 12

నేడు, రేపు పలుచోట్ల భారీ వర్షాలు

24న బంగాళాఖాతంలో అల్పపీడనం

భారత్‌-పాక్‌ ఘర్షణలో..

5 యుద్ధ విమానాలు కూలిపోయాయి

మరోమారు ట్రంప్‌ సంచలన వ్యాఖ్యలు

ఆ విమానాలు ఏ దేశానివో చెప్పని ట్రంప్‌

మోదీపై మండిపడ్డ కాంగ్రెస్‌ నేతలు

పార్లమెంట్‌ సాక్షిగా స్పష్టతనివ్వాలని డిమాండ్‌ 2

రేపటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

ఆపరేషన్‌ సిందూర్‌ తర్వాత తొలిసారి

ఉభయసభల్లో వాడీవేడిగా సాగే అవకాశాలు

ప్రతిపక్షాలకు ఆయుధంగా ట్రంప్‌ వ్యాఖ్యలు

నేడు అఖిలపక్ష సమావేశం

నేరచరిత నేతలను ఊడ్చేయాలి

ఇంట్లోని చెత్తలా వారినీ తొలగించాలి

రాష్ట్రంలో రాజకీయాలు కలుషితం

హింసా రాజకీయాలు చేయను

అలా చేసేవారి గుండెల్లో నిద్రపోతా

సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తుంటే భగ్నం చేయాలని చూస్తున్నారు

సూపర్‌ సిక్స్‌ హామీలు అమలు చేస్తున్నాం

అన్నదాత సుఖీభవ నిధులు కేంద్రం ఇచ్చినప్పుడు ఏపీ వాటానూ జమ చేస్తాం

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్‌ ప్రయాణం

ఏడాదిలోనే 10 లక్షల కోట్ల ఎంఓయూలు

తిరుపతి ప్రజావేదికలో సీఎం చంద్రబాబు

> హింసా రాజకీయాలు చేయను. అలా చేసే వారి గుండెల్లో నిద్రపోతాను. నేర చరిత్ర గల నేతలు ప్రజల ఆస్తులు కబ్జా చేస్తున్నారు. ప్రజలకు కీడు చేస్తున్నారు. రాష్ట్రానికి ఇలాంటి నేర రాజకీయాలు అవసరమా? వాటిని అడ్డుకోలేమా?
> -చంద్రబాబు



తిరుపతిలోని కపిలతీర్థం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త ఊడుస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేరచరిత్ర గల నేతలు రాజకీయాల్లోకి వచ్చారని, రాజకీయాలు కలుషితమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇంట్లో చెత్తను తొలగించినట్టే, ఇలాంటి నేతలను కూడా ఊడ్చేయాలని పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. తాను తిరుపతిలోనే చదువుకుని ఎమ్మెల్యేగా గెలిచి, అంచెలంచెలుగా ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. 'ఏనాడైనా నేను నేరాలు చేశానా? ఎవరినైనా హత్య చేశానా?' అంటూ ప్రశ్నించారు. సీఎంగా ప్రజల ఆస్తులు

మిగతా 11వ పేజీలో...





ఆంధ్రతో మా ప్రయాణం ప్రారంభం

ఏపీలో అనేక అవకాశాలున్నాయి

ఆ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములం కావడం గర్వకారణం: ఆనంద్‌ మహీంద్ర

మీ వాహన తయారీ యూనిట్‌ను ఇక్కడ పెట్టండి: మంత్రి లోకేశ్‌

ఎక్స్‌ వేదికగా ఇరువురి సంభాషణ

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'మహీంద్ర వాహనాలకు ఏపీ చాలా పెద్ద మార్కెట్‌. మహీంద్ర వాహన తయారీ యూనిట్‌ను సన్‌రైజ్‌ స్టేట్‌... ఆంధ్రప్రదేశ్‌లో పెట్టే అంశాన్ని పరిశీలించండి' అని మంత్రి లోకేశ్‌ విజ్ఞప్తి చేశారు. మహీంద్ర సంస్థల ఛైర్మన్‌ ఆనంద్‌ మహీంద్ర తమ సంస్థకు సంబంధించిన తెలుగు ప్రకటనను ఎక్స్‌లో పోస్ట్‌ చేశారు. దానిపై మంత్రి లోకేశ్‌ స్పందిస్తూ...

మిగతా 8వ పేజీలో...

పెట్టుబడుల కోసం పోటీ పడతాం

ఆర్థికాభివృద్ధిలో సీఏలూ భాగం కావాలి

జనవరిలో క్వాంటమ్‌ వ్యాలీ ప్రారంభం 11

ఐసీఏఐ స్ఫూర్తి మెగా కాన్ఫరెన్స్‌లో లోకేశ్‌

ప్రేమకథ @1800

నేటికీ సాక్షిగా 'బందరు తాజ్‌మహల్‌'


ఓ ఆంగ్లేయ జంట ప్రేమకు చిహ్నం

పీటర్‌, అరబెల్లా అపురూప ప్రేమగాథ

పెళ్లి దాకా చేరకనే విషాదాంతం

ప్రియురాలికి గుర్తుగా బందర్‌ మహల్‌

గాజు పెట్టెలో పదిలంగా అరబెల్లా భౌతికకాయం



అరబెల్లా సమాధి ప్రాంగణం ఉన్న బందరు తాజ్‌మహల్‌

(విజయవాడ/మచిలీపట్నం టౌన్‌-ఆంధ్రజ్యోతి)

ఆ రోజుల్లో.. మొఘల్‌ చక్రవర్తి షాజహాన్‌.. ముంతాజ్‌ కోసం ఆగ్రాలో తాజ్‌మహల్‌ నిర్మించారు. ఇది జగమెరిగిన సత్యం! అంత అద్భుతమైన కట్టడం కాకపోయినా మన రాష్ట్రంలోనూ ఇలాంటి మహల్‌ ఒకటి ఉంది. రెండు శతాబ్దాల క్రితం బ్రిటీష్‌ పాలనలో మేజర్‌ జనరల్‌ పీటర్‌ తన ప్రియురాలు అరబెల్లా కోసం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఒక సుందరమైన మహల్‌ను నిర్మించారు. పీటర్‌ తమ ప్రేమకు చిహ్నంగా నిర్మించిన ఈ మహల్‌ ఇప్పుడు

మిగతా 12వ పేజీలో...

ఒక చిన్న మాత్ర.. శృంగార యాత్ర



సెక్స్‌లో విఫలమవుతున్న పురుషులకు స్వల్ప మోతాదులో వయాగ్రా సూచిస్తున్న వైద్యులు

ఏ లోపం లేకున్నా శృంగారంలో వైఫల్యం. 'పర్ఫార్మెన్స్‌ యాంగ్జైటీ డిజార్డర్‌'తోనే..

ఎక్కువసేపు శృంగారానికి తహతహ.. దీంతో అంగ స్తంభన, శీఘ్రస్కలన సమస్యలు

ఆందోళనతో వైద్యుల వద్దకు.. స్వల్ప మోతాదులో వయాగ్రా మేలంటున్న వైద్యులు

ఇదంతా విశ్వాసం పెంచేందుకు మాత్రమే.. అదే సమయంలో కౌన్సెలింగ్‌తో అవగాహన

నెలా, రెండు నెలలు ఓకే.. అంతకు మించితే ఇబ్బంది తలెత్తుతుందని హెచ్చరిక

కొత్తగా పెళ్లయిన ఓ అమ్మాయి భర్త నుంచి విడాకులకు సిద్ధమైంది. భర్త శృంగారంలో పాల్గొనడం లేదని, అతనికి ఆ సామర్థ్యం లేదంటూ సర్టిఫికెట్‌ ఇవ్వాలని వైద్యుడిని సంప్రదించింది. వైద్యుడు ఆమె భర్తకు పరీక్షలన్నీ చేసి పర్ఫార్మెన్స్‌ యాంగ్జైటీతో అంగ స్తంభన సమస్య తలెత్తిందని గుర్తించి.. ఫినైల్‌ రింగ్‌ (అంగ స్తంభన సమయంలో రక్తం త్వరగా వెనక్కి వెళ్లిపోకుండా ఆపే రింగ్‌) వాడాలని సలహా ఇచ్చారు. అలాగే 2 నెలల పాటు స్వల్ప మోతాదులో వయాగ్రా వాడాలని సూచించారు. కొన్నాళ్లకు ఆ జంట వైద్యుడిని కలిసి తాము సంతోషంగా ఉన్నామని చెప్పారు.

హైదరాబాద్‌ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి ముందు పురుషులు శృంగారంపై చాలా అంచనాలు వేసుకుంటుంటారు. ఎక్కువ సేపు శృంగారం చేయాలని, భార్యను సంతోషపెట్టాలని భావిస్తుంటారు. అమ్మాయిలు కూడా ఎన్నో ఊహల్లో ఉంటుంటారు. కానీ ఊహించుకున్న విధంగా పెళ్లి తర్వాత పరిస్థితులు కనిపించకపోవడంతో ఆందోళన పెరుగుతుంది. ఆరాటం, అవగాహన లేకపోవడంతో పురుషులు అత్యుత్సాహంతో వ్యవహరిస్తుంటారు. మొదట్లోనే ఏమాత్రం తేడా వచ్చినా కుంగిపోతుంటారు. తనలో లైంగిక సామర్థ్యం సరిగా లేదేమోనని అనుమానాలు, దాంతో భార్యకు దూరంగా ఉండటం, ఇతర ఒత్తిళ్లతో అంగస్తంభన లోపం, శీఘ్రస్కలనం వంటి సమస్యల బారినపడుతుంటారు. దీనిని 'పర్ఫార్మెన్స్‌ యాంగ్జైటీ డిజార్డర్‌'గా వ్యవహరిస్తారు. దీంతో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు వస్తున్నాయి. భర్తకు సామర్థ్యం

మిగతా 12వ పేజీలో...

బ్రాహ్మణ మహిళను ఇస్లాంలోకి తెస్తే రూ.16లక్షలు

- సిక్కు, క్షత్రియులైతే 12 లక్షలు, ఓబీసీ అయితే 10లక్షలు
- యూపీలో బయటపడ్డ అక్రమ మతమార్పిళ్ల రాకెట్
- ఛంగూర్ బాబా, అతని అనుచరుల అరెస్టు
- ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్తనని చెప్పుకొన్న ఛంగూర్ బాబా

న్యూఢిల్లీ, జూలై 19: పేదలు, నిస్సహాయులు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు, వితంతవులు, కష్టాల్లో ఉన్న వారు. మరీ ముఖ్యంగా హిందూ మహిళలు, మైనర్ బాలికలే లక్ష్యం.. ప్రేమ పేరుతోనో, మరో మార్గంలోనో వారికి దగ్గరవ్వడం.. భయపెట్టో, బెదిరించో, బ్రెయిన్ వాష్ చేసో.. ఏదో ఒక మార్గంలో వారిని ఇస్లాంలోకి మారేలా చేయడం.. ఇదీ అక్రమ మతమార్పిళ్ల వ్యవహారంలో అరెస్టయిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఛంగూర్ బాబా అలియాస్ జమాలుద్దీన్ అలియాస్ పీర్ బాబా చీకటి దందా. బ్రాహ్మణ మహిళని మతం మారిస్తే ఇంత ? వితంతువు అయితే ఇంత ? అని రేటు పెట్టి తన అనుచరులకు పెద్ద మొత్తంలో డబ్బు ఎర వేసి ఛంగూర్ బాబా వారితో మతమార్పిళ్లు చేయించేవాడు. ఒకప్పుడు సైకిల్‌పై తిరుగుతూ తాయత్తులు అమ్ముకున్న ఛంగూర్ బాబా ఈ అక్రమ మత మార్పిళ్ల దందాతో కోట్లకు పడగలెత్తాడు. అంతేనా, తన దందా గుట్టు బయటపడకూడదని ఆరెస్సెస్ పేరును వాడేశాడు. అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులను కలిసినప్పుడు తానో ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్తనని, నాగ్‌పూర్ కేంద్రంగా ఉన్న భారత్ ప్రతికార్త్ సేవా సంఘ్ అవధ్ విభాగం ప్రధాన కార్యదర్శినని చెప్పుకొనేవాడు. తన లెటర్‌హెడ్‌లపై ప్రధాని మోదీ ఫొటో కూడా ముద్రించాడు. **కాగా,** యూపీలోని బలరాంపూర్ జిల్లాలో అక్రమ మతమార్పిళ్ల రాకెట్‌ను ఛేదించిన ఆ రాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు ఛంగూర్ బాబా, అతని అనుచరులను జూలై 6న అరెస్టు చేశారు. మతమార్పిళ్ల కోసం తన అనుచరులకు ఛంగూర్ భారీగా నజరానాలు ఇచ్చినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. బ్రాహ్మణ మహిళలను ఇస్లాం మతంలోకి మారిస్తే రూ.16 లక్షలు, సిక్కు, క్షత్రియ మహిళలను మారిస్తే రూ.12లక్షలు, ఓబీసీ మహిళలను ఇస్లాంలోకి మారిస్తే రూ.10లక్షలు చొప్పున నజరానాలు ఇచ్చేవాడు. ఈ వ్యవహారంపై ఈడీ కూడా దృష్టి సారించింది. ఛంగూర్‌కు ఇంత డబ్బు ఎలా వచ్చిందని ఆరా తీయగా ఇస్లామిక్ దేశాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు ఛంగూర్ అతని అనుచరులకు అందినట్టు కనుగొన్నారు. 40 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.106 కోట్లు అక్రమంగా సంపాదించినట్టు గుర్తించారు. ఒకప్పుడు రెహ్రా మాఫీ అనే గ్రామ సర్పంచ్‌గా పని చేసిన ఛంగూర్.. ఆ గ్రామ శివారులోని దర్గా పక్కన నిబంధనలకు విరుద్ధంగా 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవంతిని కట్టాడు. అధికారులు దాన్ని కూల్చివేశారు. ఇక, విదేశాల నుంచి అందిన సొమ్ముతో ఛంగూర్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాన్ని కూడా నడిపినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం గమనార్హం.



ఛంగూర్ బాబా

మమత, హిమంత మాటల యుద్ధం





న్యూఢిల్లీ, జూలై 19: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మల మధ్య శనివారం మాటల మంటలు చెలరేగాయి. బెంగాలీ మాట్లాడే వారి పట్ల అస్సాంలో వివక్ష చూపుతున్నారని, బీజేపీ ప్రభుత్వం విభజన అజెండాను అమలు చేస్తోందని మమత విమర్శలు గుప్పించగా.. తమ సొంత ప్రజలపై తాము యుద్ధం చేయబోమని హిమంత అన్నారు. కానీ, అడ్డుఅదుపు లేని ముస్లింల చొరబాట్లను అడ్డుకుంటున్నామని చెప్పారు. సరిహద్దు రాష్ట్రం నుంచి పెరుగుతున్న చొరబాట్ల కారణంగా అస్సాంలో జనాభా లెక్కతప్పుతోందన్నారు. అస్సాంలోని అనేక జిల్లాల్లో హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. తొలుత ఎన్నార్సీకి వ్యతిరేకంగా బెంగాల్‌లోని సిలిగుడిలో శనివారం అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీటీయూసీ చేపట్టిన నిరసనను ఉద్దేశించి సీఎం మమత స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే పౌరులపై దాడులు జరుగుతున్నాయని, అస్సాంలో బెంగాలీ మాట్లాడేవాళ్లను వేధిస్తే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని అన్నారు. మమత ఆరోపణలపై హిమంత కూడా అంతే వేగంగా స్పందించారు. సరిహద్దులు, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకునే విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు.

మరాఠీ రాకపోతే చెంపదెబ్బలే: రాజ్ ఠాక్రే

ముంబై, జూలై 19: తమ రాష్ట్రంలో ఉంటూ మరాఠీ భాష రాని స్థానికేతరులకు మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే తాజాగా మరో వార్నింగ్ ఇచ్చారు. మరాఠీని అర్థం చేసుకోలేని వాళ్లకు గట్టి చెంపదెబ్బ తప్పదన్నారు. నేరుగా చెవిలో మాట్లాడినా మరాఠీని అర్థం చేసుకోలేకపోతే ఆ చెవి కిందే చెంప చెళ్లుమంటుందని ఆయన అన్నారు. ఇటీవల ముంబైలో మరాఠీ మాట్లాడని ఓ వ్యాపారస్తుడిపై తమ పార్టీ కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆయన సమర్థించారు. మీరా భయందర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ "ఆ వ్యాపారస్తుడి వైఖరి కారణంగానే అతడిపై దాడి జరిగింది. మిగతా వ్యాపారస్తులు షాపులు మూసివేతకు పిలుపునిచ్చారు. ఎంత కాలం మూసి ఉంచుతారు? అసలు మేం కొనకపోతే పరిస్థితి ఏంటి? ఇక్కడకు వచ్చిన మీరంతా బుద్ధిగా పని చేసుకోండి. మూర్ఖంగా ప్రవర్తిస్తే చెంపదెబ్బ గ్యారంటీ" అన్నారు.

చైనా విడిభాగాలను ఇక్కడ కలపడమే 'మేక్ ఇన్ ఇండియా'నా: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూలై 19: మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో సొంతంగా తయారుచేస్తున్నది తక్కువేనని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అన్నారు. టెలివిజన్‌కు సంబంధించిన 80% విడి భాగాలు 'మేక్ ఇన్ ఇండియా' పేరిట చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో ఐఫోన్, టీవీ తదితర వస్తువుల విడి భాగాలను కలిపే ప్రక్రియగా ఈ కార్యక్రమం మిగిలిపోయిందని రాహుల్ విమర్శించారు. దేశంలో తయారీ రంగం బలపడాలంటే క్షేత్రస్థాయిలో మార్పులు రావాల్సి ఉందని శనివారం 'ఎక్స్'లో ఆయన అభిప్రాయపడ్డారు. "జీడీపీలో తయారీరంగం వాటా 2014లో 15.3% ఉండగా, ఇప్పుడది 12.6 శాతానికి క్షీణించింది. ఇంత క్షీణత ఈ రంగంలో నమోదుకావడం గత అరవై ఏళ్లకాలంలో ఇదే తొలిసారి" అని రాహుల్ తెలిపారు.

అల్ట్రా.. మన భారీ బాంబర్!

అమెరికా బీ-21, రష్యా టీయూ-160 తరహా యుద్ధ విమానంపై భారత్ దృష్టి

- ఏకబిగిన 12 వేల కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం
- బ్రహ్మోస్-ఎన్‌జీ, అగ్ని పీ1 సహా కీలక క్షిపణులు, లేజర్ బాంబుల అనుసంధానానికి ప్రతిపాదన
- 2035 నాటికి ప్రొటోటైప్ సిద్ధం!



ఏఐతో రూపొందించిన చిత్రం

న్యూఢిల్లీ, జూలై 19: ఎక్కడో అమెరికాలోని మిస్సోరీ నుంచి వేలాది కిలోమీటర్లు ఎగిరివచ్చి ఇరాన్‌లో అణుకేంద్రాలపై చేసిన దాడులతో అమెరికా బీ-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు కలకలం రేపాయి. ప్రపంచమంతా వాటి గురించే చర్చ జరిగింది. అలాంటి బాంబర్లు మనకూ ఉంటే బాగుంటుందనే ఆశాభావమూ వ్యక్తమైంది. అయితే ఇప్పుడు కాకున్నా కొన్నేళ్లలో భారత్ వద్ద కూడా భారీ బాంబర్ విమానాలు ఉండబోతున్నాయి. దీనికి సంబంధించి 'అల్ట్రా లాంగ్ రేంజ్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్ (అల్ట్రా)' పేరిట ఆలోచన మొగ్గతొడిగినట్టు రక్షణ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి రష్యా, ఫ్రాన్స్‌లతో పలు సాంకేతికతల బదిలీకి సంబంధించి చర్చలు కూడా ప్రారంభమైనట్టు వివరిస్తున్నారు.

అమెరికా బాంబర్‌కు దీటుగా..?

ప్రస్తుతం అమెరికా బీ-2 స్పిరిట్ కన్నా సమర్థవంతమైన బీ-21 రైడర్ బాంబర్లను అభివృద్ధి చేసింది. వాటి ప్రయాణ సామర్థ్యం సుమారు 9,300 కిలోమీటర్లు. చైనా కూడా హెచ్-20 పేరిట 8 వేల కిలోమీటర్లపైన సామర్థ్యమున్న బాంబర్‌ను అభివృద్ధి చేస్తోంది. మరోవైపు రష్యా వద్ద ఉన్న టీయూ-160 బ్లాక్‌జాక్ బాంబర్ సామర్థ్యం 12,300 కిలోమీటర్లపైమాటే. అది ప్రపంచంలోనే వేగవంతమైన, భారీ సూపర్ సోనిక్ బాంబర్ కూడా. భారత్ దీని తరహాలోనే 'అల్ట్రా' బాంబర్లను ఏకబిగిన 12 వేల కిలోమీటర్ల సామర్థ్యం ఉండేలా అభివృద్ధి చేయాలని భావిస్తోందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. అంటే ఇక్కడ బయలుదేరితే నేరుగా అమెరికాలోని న్యూయార్క్ నగరం వరకు చేరుకుని దాడి చేయవచ్చు. ఇరుగుపొరుగు దేశాలే కాదు.. యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాలన్నింటికీ చేరుకోగలదు. ఈ బాంబర్‌ను 'స్వింగ్ వింగ్' మోడల్ రెక్కలు అమర్చాలన్న ప్రతిపాదన ఉన్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు. విమానం టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో రెక్కలు అడ్డంగా విప్పార్చుకుని సురక్షితంగా, సులువుగా దిగేందుకు, ఎగిరేందుకు అనువుగా ఉంటాయి. గాల్లో ప్రయాణిస్తున్నప్పుడు కాస్త వెనక్కి ముడుచుకుంటాయి. దీనితో విమానం తక్కువ ఇంధనంతో, ఎక్కువ వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. కొత్తగా అభివృద్ధి చేస్తున్న బ్రహ్మోస్ ఎన్‌జీతోపాటు ఇతర అత్యాధునిక క్షిపణులను, భారీ బాంబులను మోసుకెళ్లేలా అల్ట్రాను అభివృద్ధి చేయనున్నారు. "బ్రహ్మోస్ కొత్త వెర్షన్లతోపాటు అగ్ని 1పీ క్షిపణులు, లేజర్ బాంబులు, యాంటీ రేడియేషన్ క్షిపణులు కూడా ఉండాలన్నది మా ఆలోచన" అని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం.

అంత సులువేమీ కాదు!

భారీ బాంబర్ విమానాల తయారీ అంత సులువేమీ కాదని, ఇది సుదీర్ఘకాల లక్ష్యమని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. భారీ బాంబర్‌కు అవసరమైన ఎయిర్‌ఫ్రేమ్ నుంచి ఇంజన్ల దాకా ఎంతో శ్రమ, ఖర్చు, అత్యాధునిక సాంకేతికతల అవసరం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. బాంబర్ పరిశోధన, అభివృద్ధిలో డీఆర్‌డీవో, హాల్, ఎయిర్‌క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) తదితర సంస్థలన్నీ విస్తృతస్థాయిలో భాగస్వామ్యం కావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భారత్ ప్రయత్నాలు ఫలిస్తే 2035 నాటికి మొదటి ప్రొటోటైప్ సిద్ధం కావొచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తానికి 'మేం సిద్ధం' అని భారత్ ప్రపంచానికి చాటనుందని అంటున్నారు.

లోకం తీరు



బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్

- అరుణాచల్‌కు సమీపంలో నిర్మాణం

న్యూఢిల్లీ, జూలై 19: భారత్‌లోని కొన్ని రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్‌కు ఆయువుపట్టు బ్రహ్మపుత్ర నదిపై అతి భారీ డ్యామ్ నిర్మాణాన్ని చైనా తాజాగా ప్రారంభించింది. అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో టిబెట్‌లోని న్యింగ్‌చి ప్రాంతంలో ఈ డ్యామ్ నిర్మాణానికి చైనా ప్రధాన మంత్రి లి కియాంగ్ తాజాగా ప్రారంభోత్సవం చేసినట్టు చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. టిబెట్‌తోపాటు ఇతర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా.. డ్యామ్‌తోపాటు దానిపై ఐదు జల విద్యుత్ కేంద్రాలను రూ.14.4 లక్షల కోట్ల (167 బిలియన్ డాలర్లు)తో నిర్మిస్తున్నట్టు తెలిపింది. ప్రపంచంలోనే అతి పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు అయిన త్రీగోర్జెస్ డ్యామ్ కంటే కూడా.. ఈ కొత్త డ్యామ్‌తో ఎక్కువ జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా. చైనాలోని యాంగ్జె నదిపై ఉన్న త్రీగోర్జెస్ డ్యామ్ జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఏకంగా 22,400 మెగావాట్లు కావడం గమనార్హం. ఇప్పుడు బ్రహ్మపుత్ర (చైనాలో యార్లుంగ్ త్సాంగ్‌పోగా పిలుస్తారు)పై కడుతున్న కొత్త డ్యామ్‌లో భారీ స్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో.. దిగువన ఉన్న భారత్, బంగ్లాదేశ్‌లపై ప్రభావం పడుతుందనే ఆందోళన నెలకొంది. గత ఏడాది డిసెంబర్‌లో చైనా ఈ ప్రాజెక్టు నిర్మాణంపై నిర్ణయం తీసుకుంది. అప్పుడే భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. బ్రహ్మపుత్ర నది పరీవాహకంలో దిగువన ఉన్న దేశాల ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలని విదేశాంగ మంత్రి జైశంకర్ డిమాండ్ చేశారు.

'కర్ణాటక సుప్రీంకోర్టు' పేరుతో సొలిసిటర్ జనరల్ ఎక్స్ ఖాతా

తప్పుడు సమాచారం వ్యాప్తిని నిరూపించేందుకే

న్యూఢిల్లీ/బెంగళూరు, జూలై 19: సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'సుప్రీంకోర్ట్ ఆఫ్ కర్ణాటక' పేరిట నకిలీ 'ఎక్స్' ఖాతాను తెరిచారు. ఒక కోర్టు ఫొటోను కూడా దీనికి జతచేసి, అధికారిక ఖాతాలా కనిపించేలా చేశారు. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం ముప్పు ఎంత తీవ్రంగా ఉందో నిరూపించేందుకు ఈ ఖాతాను శుక్రవారం ఆయన కర్ణాటక హైకోర్టులో ప్రదర్శించారు. ఆయన ఫోన్‌ను జస్టిస్ నాగ ప్రసన్నకు అందజేసి, ఈ నకిలీ 'ఎక్స్' ఖాతాను చూపించారు. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని ఇంత సులువుగా వ్యాప్తి చేయొచ్చంటూ వాదించారు. 'ఇది ట్విటర్ వెరిఫై చేసిన ఖాతా. ఇప్పుడు నేను ఇందులో ఏమైనా పోస్టు చేయొచ్చు. వీటిని చూసిన లక్షలాదిమంది ఆ వివరాలన్నీ కర్ణాటక సుప్రీంకోర్టే చెప్పిందనుకుంటారు' అన్నారు. సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం తీవ్రంగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలను తెరిచిన అజ్ఞాత వ్యక్తులు వాటిలో చట్టవిరుద్ధమైన అంశాలను పోస్టు చేస్తే.. బాధిత పక్షం ఎవరిపై దావా వేస్తుందని తుషార్ మెహతా ప్రశ్నించారు. 'ఎక్స్' సంస్థ తరపున సీనియర్ న్యాయవాది కేజీ రాఘవన్ వాదిస్తూ.. అధికారికంగా నమోదు చేయకుండా నకిలీ ఖాతాలు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

రేపటి నుంచి పార్లమెంటు

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆ తదనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయి. ఈ సమావేశాలకు రెండ్రోజుల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్, పాక్ ఘర్షణలో 5 యుద్ధ విమానాలు నేలకూలాయని చేసిన వ్యాఖ్యలు ఇండియా కూటమి పక్షాలకు ఆయుధంగా మారనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాలపై ప్రతిపక్షాలు చర్చలకు పట్టుబట్టే అవకాశాలున్నాయి. ఆపరేషన్ సిందూర్ వివరాలు సమగ్రంగా దేశప్రజల ముందుంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేయనున్నాయి. కాల్పుల విరమణపై ఏకపక్షంగా ట్రంప్ ప్రకటన చేయడం, యుద్ధ నష్టాలపై మోదీ సర్కారును ఇరుకున పెట్టేలా ట్రంప్ వ్యాఖ్యలతో ఉభయసభలలో ప్రశ్నించేందుకు ఇండియా కూటమి సిద్ధం కావడంతో దీటుగా ఎదుర్కొనేందుకు మోదీ సర్కారు కూడా సమయాత్తమవుతోంది. కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఇటీవలే సమావేశమై ఉభయసభల్లో అనుసరించాల్సిన వ్యూహం, విపక్షాలను కట్టడి చేయడంపై చర్చించారు.

12 బిల్లుల ఆమోదం కోసం యత్నం

ఈ సమావేశాలలో 12 బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకోవాలని కేంద్రం భావిస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్నవి కాగా, 8 బిల్లులు కొత్తగా ప్రవేశపెట్టనున్నట్లు లోక్‌సభ వర్గాలు తెలిపాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా ఈ సమావేశాలలోనే పార్లమెంటు ముందుకు రానుంది. ఈ నెల 21న ఉభయసభలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 21న ముగుస్తాయి.

నేడు అఖిలపక్ష సమావేశం..

కేంద్ర ప్రభుత్వం నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. పార్లమెంటు భవన సముదాయంలోని ప్రధాన హాల్‌లో పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కేంద్ర మంత్రులతో పాటు, ప్రతిపక్షాలకు చెందిన పార్లమెంటరీ పార్టీ నేతలు హాజరవుతారు. ఉభయసభలు సజావుగా కొనసాగేందుకు సూచనలు తీసుకోవడం, ఉభయసభలలో చర్చించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో నిర్ణయించనున్నారు.

భారత్-పాక్ ఘర్షణలో.. 5 యుద్ధ విమానాలు కూలిపోయాయి

- మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 19: పహల్గాం ఉగ్రదాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్'తో భారత్.. దానికి ప్రతీకారంగా పాకిస్థాన్ చేసిన దాడుల్లో 5యుద్ధ విమానాలు కూలిపోయాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జోక్యంతోనే ఇరుదేశాల మధ్య వివాదం సమసిందని పునరుద్ఘాటించారు. ట్రంప్ జోక్యం వార్తలను భారత్ ఇదివరకే ఖండించిన విషయం తెలిసిందే! అయితే, తానే యుద్ధాన్ని ఆపానని, గడిచిన ఆర్నెల్లలో ఎన్నో ఘర్షణలను అడ్డుకున్నట్లు ట్రంప్ తాజాగా మళ్లీ ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కూలినట్లు చెబుతున్న ఐదు యుద్ధ విమానాలు ఏ దేశానికి చెందినవనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. శుక్రవారం రాత్రి ట్రంప్ తన అధికారిక నివాసం(వైట్‌హౌస్)లో రిపబ్లికన్ సెనేటర్లకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "భారత్-పాక్ ఘర్షణలో 4-5 యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఐదు అని నాకు గుర్తుంది. అవి రెండూ(భారత్, పాక్) అణ్వాయుధ దేశాలు. పరిస్థితి జటిలంగా మారుతుండడంతో మేం వాణిజ్యం ద్వారా సమస్యను పరిష్కరించాం" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. దీనిపై ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. "మోదీజీ.. ఆ ఐదు విమానాల సంగతేంటి?" అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "పార్లమెంట్ సమావేశాలకు రెండ్రోజుల ముందు.. మళ్లీ ట్రంప్ మిసైల్ పేలింది. ట్రంప్ ఈ అంశంపై మాట్లాడడం ఇది 24వ సారి" అని జైరామ్ అన్నారు.

కర్ణాటక హైకోర్టు సీజేగా జస్టిస్ విభు ప్రమాణం

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ విభు బఖ్రు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హైకోర్టు ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ జయంత్, జస్టిస్ దినేశ్‌కుమార్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.

వాల్‌స్ట్రీట్, రాయిటర్స్‌కు భారత పైలట్ల సమాఖ్య నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 19: ఎయిరిండియా విమాన ప్రమాదంపై నిరాధార కథనాలు ప్రచురించిన వాల్‌స్ట్రీట్, రాయిటర్స్ మీడియా సంస్థలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పైలెట్స్ (ఎఫ్ఐపీ) న్యాయపరమైన చర్యలకు సిద్ధమైంది. విమానం రెండు ఇంజన్లకు ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లను పైలట్ ఉద్దేశపూర్వకంగా షట్‌డౌన్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇటీవల కథనం ప్రచురించింది. అయితే, దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ఇటువంటి చర్యలు బాధ్యతారహితమైనవని ఎఫ్ఐపీ స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలూ లేకుండా తప్పుడు కథనాలు ప్రచురించినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈ రెండు సంస్థలకు నోటీసులు పంపింది. కాగా, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై విదేశీ మీడియాలో వస్తున్న వార్తాకథనాలు ఊహాజనితమైనవని అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) ఖండించింది.



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ శ్రీనివాసరెడ్డి

శ్రీవారి సేవలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి

తిరుమల, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వాదం, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

మల్లన్న సేవలో జస్టిస్ లక్ష్మణరావు



నంద్యాల కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ శ్రీనివాసరావు న్యాయమూర్తికి స్వామి, అమ్మవార్ల జ్ఞాపికతో పాటు ప్రసాదాలను అందజేశారు.

టీటీడీలో నలుగురు అన్యమత ఉద్యోగుల సస్పెన్షన్

తిరుమల, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేస్తున్న మరో నలుగురు అన్యమత ఉద్యోగులను సస్పెండ్ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఎలిజర్, బర్డ్ ఆస్పత్రి స్టాఫ్ నర్సు ఎస్.రోసీ, గ్రేడ్-1 ఫార్మసిస్ట్ ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో పనిచేస్తున్న జి.అసుంతను సస్పెండ్ చేస్తున్నట్టు టీటీడీ శనివారం ప్రకటించింది. టీటీడీలో పనిచేస్తూ వీరు క్రైస్తవమతాన్ని అనుసరిస్తున్నారనే ఆధారాలను విజిలెన్స్ విభాగం సేకరించింది. వీటిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎంఎస్ఎంఈలకు ఇన్సెంటివ్స్ విడుదల చేయాలి

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లను విడుదల చేయాలని పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఆర్థికాభివృద్ధి టాస్క్‌ఫోర్స్ చేసిన సూచనలను స్వాగతిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సుపారీ ఒకరి కోసం.. దాడి మరొకరిపై!

- అనకాపల్లి జిల్లాలో హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

ఎస్.రాయవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు వద్ద ఈ నెల 11న జరిగిన ఓ హత్యాయత్నం కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ మోహనరావు శనివారం తెలిపారు. అయితే సుపారీ ఒప్పందం ప్రకారం కాకుండా.. ఒకరి బదులు మరొక వ్యక్తిపై నిందితులు దాడి చేసినట్లు విచారణలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎస్.రాయవరానికి చెందిన మేడిశెట్టి నూకేశ్వరికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. మూడేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. భర్తతో గొడవల విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండేది. ఇందుకు నూకేశ్వరికి 6టీవీ విలేకరి రుద్రాచారి సహకరిస్తుండేవాడు. ఈ క్రమంలో తన వద్ద రుద్రాచారి కొంత సొమ్ము, ఆరున్నర తులాల బంగారం తీసుకున్నాడని.. అడిగితే తిరిగివ్వట్లేదని నూకేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో నూకేశ్వరి, తునికి చెందిన బర్రె పైడిరాజుకు వివాహేతర సంబంధం ఉందన్న ప్రచారం జరగడంతో రెండు కుటుంబాల్లో గొడవలు ప్రారంభమయ్యాయి. దీనికి కారణం రుద్రాచారి అని భావించిన నూకేశ్వరి, పైడిరాజు.. అతన్ని హతమార్చేందుకు తుని మండలానికి చెందిన శామ్యూల్, జానుప్రసాద్, రాజుకుమార్‌తో రూ.లక్ష ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ముగ్గురూ ఈ నెల 11న రాత్రి రుద్రాచారిని హత్య చేసేందుకు అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల శ్రీనివాస కల్యాణ మండపం వద్దకు వెళ్లారు. అక్కడ విలేకరి అనుకొని వాచ్‌మన్‌పై రాడ్డుతో దాడి చేశారు. అనంతరం వారు డబ్బు ఇవ్వాలని అడగ్గా.. మరొకరిపై దాడి చేసినందున డబ్బులు ఇవ్వనని, చెప్పిన వ్యక్తిని చంపితేనే ఇస్తానని నూకేశ్వరి చెప్పింది. వాచ్‌మన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.రాయవరం పోలీసులు.. అడ్డరోడ్డు సమీపంలో నిందితులను అరెస్టు చేశారు. అనంతరం విచారించగా అసలు విషయం బయటపడిందని డీఎస్పీ తెలిపారు. నూకేశ్వరి, పైడిరాజు, శామ్యూల్, జానుప్రసాద్, రాజుకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

జస్టిస్ జ్యోతిర్మయికి మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కారం



పురస్కారం అందుకున్న జస్టిస్ జ్యోతిర్మయి, శ్రీనివాసరావు దంపతులు

తెనాలి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని శనివారం తెనాలిలో ప్రదానం చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మొవ్వా సత్యనారాయణ ఆధ్వర్యంలో పురస్కార ప్రదానం నిర్వహించారు. ఏటా ఆమె పేరిట ఒక ప్రముఖునికి పురస్కారాన్ని అందించడంతో పాటు సేవా కార్యక్రమాన్ని సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పదవ తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు వంతున జస్టిస్ జ్యోతిర్మయి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విద్యార్థులు-భవిష్యత్ సవాలు అనే అంశంపై ఆమె మాట్లాడుతూ, ఏ పరిస్థితుల్లోనైనా ఆత్మ విశ్వాసం, మనోబలంతో విద్యార్థులు ముందుకు వెళ్లి విజయం అందుకోవాలన్నారు. యుక్త వయసులో ఎదురయ్యే ఆకర్షణలకు లోను కాకుండా వ్యక్తిత్వంతో ముందుకు సాగితేనే ఉన్నత స్థానం చేరుకుంటారని చెప్పారు. కాకినాడ జేఎన్‌టీయూ ఉపకులపతి చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు 80 శాతం పైగా ఉన్నత చదువులకు వెళుతున్నారని, మన దేశంలో 30 శాతం దాటడం లేదన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీ వరకు విద్యను అభ్యసిస్తేనే వికసిత భారత్‌గా మారి అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉంటామని తెలిపారు.

దేశాభివృద్ధిలో డిగ్రీలు కీలకం

- ఆచార్య జయంత్ ఎం.మోదక్
- గైట్ అటానమస్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



రాజానగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలు వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా దేశాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తాయని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)పూర్వ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య జయంత్ ఎం.మోదక్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీజీయూ ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఉన్నత విద్యనభ్యసించే వారి శాతాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు, ప్రో చాన్సలర్ కె.శశికిరణ్ వర్మ, ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల లెక్క తేల్చండి

- రెవెన్యూ శాఖ నియంత్రణలో ఎన్ని?
- ఆయా శాఖల పరిధిలో ఏ మేరకు?
- గ్రామాల వారీగా స్పష్టత ఇవ్వండి
- సమగ్ర సర్వేలో తొలి ప్రాధాన్యం వీటికే
- అధికారులకు రెవెన్యూ శాఖ ఆదేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వ భూములు ఎన్ని? రికార్డుల ప్రకారం 2014-19 కాలంలో ఏ మేరకు ఉన్నాయి? 2019-24లో వాటి పరిస్థితి ఏమిటి? ఇప్పుడు మొత్తం ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి? ఏ శాఖ పరిధిలో ఎంత భూమి ఉంది?.. వెంటనే స్పష్టమైన లెక్కలు తీయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల లెక్క తీయాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం చేపట్టిన భూముల సమగ్ర సర్వేలో తొలి ప్రాధాన్యం ప్రభుత్వ భూములకే ఇవ్వాలని రెవెన్యూ శాఖ ఆదేశించింది. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం కోటిన్నర సర్వే నంబర్ల పరిధిలో 3,40,23,510 ఎకరాల భూమి ఉంది. ఇదంతా వెబ్‌ల్యాండ్ ఆర్ఎస్ఆర్‌లో నమోదైంది. ఇందులో ప్రభుత్వ భూమి నికరంగా 55.78 లక్షల ఎకరాల మేర ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ, పోరంబోకు, కొండపోరంబోకు, చుక్కల భూములు, ఇనాం, ఎస్టేట్, గ్రామకంఠం భూములు ఇందులో ఉన్నాయి. ఇవికాకుండా దేవదాయ భూములు మరో 4.48 లక్షల ఎకరాలు ఉన్నాయి. గత జగన్ ప్రభుత్వం 2020 నుంచి 2024 వరకు భూముల సర్వే చేపట్టింది. అసైన్డ్ భూముల చట్టం(పీఓటీ)-1977ను సవరించి 20 ఏళ్ల గడువు తీరిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కుదారులకు శాశ్వత హక్కులు(ఫ్రీ హోల్డ్) కల్పించిన సంగతి తెలిసిందే. 13.5 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేస్తే అందులో 5.75 లక్షల ఎకరాలను చట్టవిరుద్ధంగా చేశారని గుర్తించారు. ఒక్క అసైన్డ్ భూముల విషయంలోనే ఇంతగా అక్రమాలు జరిగితే, రీ సర్వే పేరిట మరెన్ని తప్పులు జరిగి ఉంటాయోనని కూటమి ప్రభుత్వం అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో తొలుత ప్రభుత్వ భూముల లెక్క తీయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. 2014-19 కాలంలో, ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో, ఇప్పుడు మూడు విడతల్లో ఉన్న ప్రభుత్వ భూముల లెక్క తీసి గణాంకాలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. రెవెన్యూ శాఖ నియంత్రణలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూములు ఎన్ని? ఆయా శాఖల పరిధిలో ఉన్న భూమి ఎంతో లెక్క తీయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది. అలాగే, ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్న భూమి వివరాలపై సమగ్ర వివరాలు అందించాలని సంబంధిత అధికారులను రెవెన్యూ శాఖ లిఖితపూర్వకంగా కోరింది. ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల డేటాను తాజా పరచాలని సర్కారు భావిస్తోంది. తొలుత ప్రభుత్వ భూముల సర్వేను పూర్తి చేయాలని సర్వే శాఖ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలపై స్పష్టత వస్తే, ప్రైవేటు భూముల సర్వేను కొనసాగించనున్నారు. రెండో దశ రీ సర్వేలో ఇదే కీలకాంశం కానుంది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి వినియోగమార్పిడి చట్టం(నాలా)ను ప్రభుత్వం త్వరలో ఉపసంహరించనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములను కాపాడటం ఎలా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా, అక్రమ లే అవుట్‌లు వేసి అమ్మకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు వెబ్‌ల్యాండ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. గ్రామాల వారీగా లెక్క తేలిన ప్రభుత్వ భూములన్నింటిని రెడ్‌మార్కింగ్‌లో వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తారు. ఆ భూములపై లావాదేవీలను నిషేధిస్తారు. దీంతో ఆ భూముల రిజిస్ట్రేషన్‌లు జరగవు.

'స్నేహా మ్యాక్స్' కేసులో ఆరుగురి అరెస్టు

- ప్రధాన నిందితుడి కోసం పోలీసుల గాలింపు

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తానని ఆశ చూపి, కోట్లాది రూపాయల డిపాజిట్లు సేకరించి.. మూడేళ్ల క్రితమే బోర్డు తిప్పేసిన స్నేహా మ్యాక్స్‌కి చెందిన ఆరుగురిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2008లో విశాఖ ద్వారకా నగర్‌లో స్నేహా మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ (స్నేహా మ్యాక్స్) ఏర్పాటు చేశారు. 12 శాతం వడ్డీ ఇస్తానని 2,500 మంది నుంచి సుమారు రూ.100 కోట్లు సేకరించారు. కొన్నాళ్లపాటు సక్రమంగా వడ్డీలు చెల్లించి ఆ తర్వాత ముఖం చాటేశారు. ఖాతాదారులు 2022 ఏప్రిల్‌లో దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం.. సంస్థ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, డైరెక్టర్లు గూడూరు సీతామహాలక్ష్మి, ఉండవల్లి శ్రీనివాసరావు, ఎల్.విశ్వేశ్వరరావు, మేనేజర్ రంగారావు, అకౌంటెంట్ ధనలక్ష్మిలను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. శివభాగ్యారావు కోసం గాలిస్తున్నారు.

నేటి నుంచి ముస్సోరిలో 8 మంది ఐఏఎస్‌లకు శిక్షణ

- కృష్ణా, అనంత జేసీలకు ఇన్‌చార్జి కలెక్టర్లుగా బాధ్యతలు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రం నుంచి ఎనిమిది మంది సీనియర్ ఐఏఎస్‌లు ముస్సోరి బయలుదేరి వెళ్లారు. ఈ నెల 20 నుంచి ఆగస్టు 16 వరకు వారు లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీలో శిక్షణ తీసుకొనున్నారు. ఈ జాబితాలో కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా, బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ.మల్లికార్జున్, సోషల్ వెల్ఫేర్ స్కూల్ సెక్రటరీ వి.ప్రసన్న వెంకటేష్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జీలానీ, ఏపీజెన్కో ఎండీ చక్రధర్‌బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీశాతో పాటు కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, అనంత కలెక్టర్ వినోద్ కుమార్ ఉన్నారు. కృష్ణా, అనంతపురం కలెక్టర్ల స్థానంలో ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఇన్‌చార్జి కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

23 వరకు అన్నదాత -సుఖీభవ గ్రీవెన్స్

రైతు సేవా కేంద్రాల్లో ఉంచిన అన్నదాత-సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే.. ఈ నెల 23 లోగా అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద గ్రీవెన్స్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు సూచించారు. ఈ పథకానికి అర్హులెవరూ మిగిలిపోకూడదన్న సీఎం ఆకాంక్ష మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అన్నదాత-సుఖీభవ పథకంలో తమ అర్హత స్థితిని టోల్‌ఫ్రీ నంబరు 155251లో రైతు లు తెలుసుకోవచ్చని చెప్పారు. మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు తమ ఆధార్ నంబరును పంపి కూడా రైతు అర్హత వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం

- జగన్ బెదిరింపు భాష మార్చుకోవాలి: ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'సముద్రంలో వృథాగా కలసిపోతున్న సుమారు 3 టీఎంసీల మిగులు జలాలను బనకచర్ల లిఫ్ట్ ద్వారా మళ్లించి సద్వినియోగం చేసుకోవాలని, రాయలసీమను సస్యశ్యామలం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. దీనివల్ల తెలంగాణకు వచ్చిన నష్టం ఏమీలేదు' అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బనకచర్ల ప్రాజెక్టు గురించి జగన్మోహన్‌రెడ్డికి అంతా తెలుసు. అధికారంలోకి మళ్లీ వస్తాం... మీ అంతు చూస్తాం అంటూ అధికారులను బెదిరించే భాషను జగన్మోహన్‌రెడ్డి మానుకోవాలి. లేకుంటే సమాధానం చెప్పడానికి బీజేపీ సిద్ధంగా ఉంది' అని సోము వీర్రాజు మండిపడ్డారు.

25, 26 తేదీల్లో ఫ్యూజన్ ఏఐ సదస్సు

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై 'ఫ్యూజన్ ఏఐ సమ్మిట్' నిర్వహిస్తున్నట్టు ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ (ఏపీడీటీ) ప్రతినిధి శ్రీధర్ కొసరాజు శనివారం తెలిపారు. ఇది పూర్తిగా ఏఐపై నిర్వహిస్తున్న సదస్సు అని, సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ఐటీ మంత్రి నారా లోకేశ్, ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వస్తామని హామీ ఇచ్చారని శ్రీధర్ తెలిపారు.

తల్లిదండ్రులను నరికి చంపాడు!

- అల్లూరి జిల్లాలో దారుణం.. పోలీసుల అదుపులో నిందితుడు

మారేడుమిల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలో ఓ వ్యక్తి గొడ్డలితో విచక్షణారహితంగా తల్లిదండ్రులపై దాడి చేయడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. చావడికోట పంచాయతీ తుర్రవాడ గ్రామానికి చెందిన అందాల సన్యాసరెడ్డి (68), బోడమ్మ (62) గ్రామంలోనే పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మల్లురెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడిన మల్లురెడ్డి గొడ్డలితో వారిపై దాడి చేసి చంపేశాడు. శనివారం ఉదయం మృతదేహాలను గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో సీఐ గోపాలకృష్ణ, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా.. మల్లురెడ్డి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. మారేడుమిల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజల హక్కుల కోసం పోరాడితే అరెస్టులా?

- దేశ సంపద, ప్రజల సొమ్ము దోచుకుంటున్న వారే నిజమైన టెర్రరిస్టులు: జస్టిస్ చంద్రకుమార్



కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, వేదికపై సీపీఐ రామకృష్ణ


ఒంగోలు కార్పొరేషన్/కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయి. అధికారంలో ఉన్న నాయకులు ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. దేశ సంపదను, ప్రజల సొమ్మును దోచుకుంటున్న వారే నిజమైన టెర్రరిస్టులు' అని శాంతి చర్చల కమిటీ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రకుమార్ ధ్వజమెత్తారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సదస్సు శనివారం ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ 2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించడం దారుణమన్నారు. శాంతియుత చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపిన ఆయన.. అజిత్ పవార్ లాంటి బడా నేతలు రూ.70 వేల కోట్లు దోచుకుంటే ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌తో ఆదివాసీ సంపదను దోచుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మావోయిస్టులను నిర్మూలించాలని, హెచ్చరించడం దుర్మార్గమైన చర్య అని అభిప్రాయపడ్డారు. పేదరికంలేని సమాజాన్ని సాధించడం కోసం, ప్రజల హక్కులు, ఆదివాసీల కోసం ప్రశ్నించిన దుడ్డు ప్రభాకర్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాగు ప్రాజెక్టుల్లో 'ప్రైవేటు'ను సహించం: రామకృష్ణ

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులను నిర్మిస్తామని ఇరిగేషన్ మంత్రి చెప్పడాన్ని ఖండించారు. పోలవరం ప్రాజెక్టులో 45.75 అడుగుల ఎత్తున నీటి నిల్వ చేసుకునే అవకాశం కేంద్రం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం పోలవరం, బనకచర్లను తెరపైకి తెచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న దాని గురించి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.

భార్య చనిపోయిన భర్తకు పింఛన్ ఇప్పించరూ!

- ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి టీడీపీ కార్యకర్త చిత్రమైన వినతి



భార్య మృతిచెందిన తనకు పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరుతున్న టీడీపీ కార్యకర్త విజయ భాస్కర్ రెడ్డి

బుక్కరాయసముద్రం, జూలై 19(ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయిన మహిళకు ఇచ్చే వితంతు పింఛను మాదిరిగా భార్య చనిపోయిన భర్తకు కూడా పింఛను ఇవ్వాలంటూ.. టీడీపీ కార్యకర్త ఒకరు చిత్రమైన విన్నపం చేశారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా పుట్లూరు మండలం తక్కలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్‌లు ఇప్పించాలని పలువురు వితంతువులు ఎమ్మెల్యేకి విన్నవించారు. అదే సమయంలో టీడీపీ కార్యకర్త విజయ భాస్కర్ రెడ్డి, తన భార్య ఏడాది కిందటే మృతిచెందారని, తనకు కూడా పింఛన్ ఇప్పించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. 'మీ బాధ నాకు అర్థమైంది. భార్యలను కోల్పోయిన భర్తలకు పింఛన్ ఇచ్చే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతాను' అని హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపుపై హైకోర్టు ఆక్షేపణ

- షోకాజ్ ఇవ్వకుండా.. ఏకపక్షంగా తొలగించడం కుదరదు
- పిటిషనర్‌కు రూ.25 వేలు చెల్లించాలని ఆదేశం



అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఓ అంగన్‌వాడీ కార్యకర్తను అధికారులు ఏకపక్షంగా ఉద్యోగం నుంచి తొలగించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. పిటిషనర్ వన లక్ష్మిని ఉద్యోగం నుంచి తొలగించే విషయంలో అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కూడా తీసుకోలేదని ఆక్షేపించింది. పిటిషనర్‌ను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకుగాను నాలుగు వారాల్లో ఆమెకు ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం పొన్నంపేటకు చెందిన లక్ష్మి 2012 సెప్టెంబరులో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఎంపికయ్యారు. విధుల్లో చేరిన నాలుగు నెలల తర్వాత లక్ష్మి తమ గ్రామవాసి కాదని, ఆమె వయస్సు 35 ఏళ్లు దాటిందని పొన్నంపేటకు చెందిన జి.శ్యామల, ఎస్.త్రినాధమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా లక్ష్మిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఐసీడీఎస్ పీవో 2013 జనవరి 8న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ లక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ పిటిషనర్ పొన్నంపేటకు చెందినవారేనని తహశీల్దార్ ధృవీకరణపత్రం ఇచ్చారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చేనాటికి పిటిషనర్ వయస్సు 35ఏళ్లు నిండలేదని తెలిపారు. ఈ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. అధికారులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోకుండా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా లక్ష్మిని ఉద్యోగం నుంచి తొలగించారని ఆక్షేపించింది. పిటిషనర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

సామాజిక చింతనాశీలి గురుకుల మిత్రా

తెలుగుభాష, జాతి, చరిత్ర, సంస్కృతులని లోతుగా అధ్యయనం చేసిన ప్రజ్ఞాశాలి డాక్టర్ గురుకుల మిత్రా. సకల అభ్యుదయ శక్తుల్ని మిళితం చేసి 'సమసంఘం' సంస్థను రూపొందించినవాడు. బడుగు, బలహీనవర్గాల రాజ్యాధికారం కోసం ఒక శాస్త్రీయ దృక్పథాన్ని వెలువరించిన మిత్రా, దేశంలోని వామపక్ష, ప్రగతిశీల సంఘాలన్నింటినీ సమన్వయం చేసి, 'బహుజన వర్గాల సమాఖ్య' ఏర్పరిచాడు. దళిత బహుజన శ్రేణులు అన్నింటినీ ఒక్క తాటి పైకి తీసుకొని రావడానికి ప్రయత్నం చేశాడు. ఆనాడే కులగణన కోసం ఉద్యమం చేపట్టిన వ్యక్తి మిత్రా.

గుంటూరు జిల్లా రేపల్లెలో జూలై 21, 1933లో జన్మించిన మిత్రా, విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. గుడివాడలో హోమియో వైద్యం అభ్యసించాడు. రాడికల్ వామపక్ష ఉద్యమాలలో క్రియాశీలంగా పనిచేశాడు. పేదరికాన్ని అనుభవిస్తూనే అసాధారణ అధ్యయనం చేశాడు. కలకత్తాలో పీజీ చదివి, చైనా వెళ్ళి షాంఘై విశ్వవిద్యాలయంలో ఆక్యుపంక్చర్ ఎం.డి. చేశాడు. ఆధునిక పద్ధతులలో ఆ విధానాన్ని మెరుగుపరిచి, భారతదేశంలో ప్రత్యామ్నాయ ఆక్యుపంక్చర్ పద్ధతిని కనుగొన్నాడు. కొన్ని వందల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తే, ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సులు నడిపేదంటే, వాటికి ఉన్న ప్రజాదరణను ఊహించవచ్చు. ప్రత్యామ్నాయ వైద్యగ్రంథాలు రచించాడు. ఎందరో వైద్యుల్ని, ఆరోగ్య కార్యకర్తల్ని తయారు చేశాడు.



ఒకవైపు వైద్యుడిగా పనిచేస్తూనే, అన్నిరకాల భావోద్యమాల్లోనూ అవిశ్రాంతంగా కృషి చేశాడు. జాతి విముక్తి పోరాటాలు చేస్తున్న రాష్ట్రాలన్నింటిలో అధ్యయన పర్యటనలు చేయడమే కాక, అన్ని ప్రజాసంఘాలతో ఎల్లప్పుడూ చర్చిస్తూనే ఉండేవాడు. అక్రమ కేసుల్లో అనేకసార్లు అరెస్టయ్యాడు. ఒక దశలో మిత్రా మీద నిరంతరం రహస్య నిఘా ఉండేది. కొండపల్లి సీతారామయ్య మొదలుకుని వావిలాల గోపాలకృష్ణయ్య వరకు దేశంలోనూ, తెలుగు ప్రాంతంలో మిత్రాకి పరిచయం లేని బుద్ధిజీవులు లేరు. అటు వామపక్ష ప్రగతిశీల పార్టీల నుంచి, ఇటు నాస్తిక హేతువాద సంఘాల దాకా ప్రజాసంఘాలకి వెన్నుదన్నుగా నిలిచిన మేధావి మిత్రా. ఆ రోజుల్లో తాను దైవాంశ సంభూతుడినని ప్రచారం చేసుకుంటున్న ఒక ప్రఖ్యాత బాబా దగ్గర మారువేషంలో కొంత కాలం శిష్యుడిగా చేరి అక్కడి మోసాల్ని బట్టబయలు చేసి, మహిమలు లేవని నిరూపించిన వ్యక్తి.

భాష విషయంలోనూ మిత్రా తనదైన కృషి చేశాడు. సులువైన వర్ణ క్రమంతో తెలుగు అక్షరమాలని ఆయన ప్రతిపాదించాడు. తన కవితల్లో, రచనల్లో కూడా క్లిష్టమైన, గ్రాంథిక పదాల బదులు అందరికీ అర్థమయ్యే తేలికపాటి వాక్యాల్నే ఆయన ఉపయోగించేవాడు. రోజువారీ వ్యవహారాల్లో తెలుగు భాష ప్రాముఖ్యత గుర్తించాలని డిమాండ్‌తో మిత్రా అన్ని తెలుగు జిల్లాలలో సమావేశాలు నిర్వహించి, 'తెలుగు మహాసభ' స్థాపించాడు. ప్రజా పోరాటాలను నడిపాడు. "దైనందిన జనజీవన పాలనా విధానంలో, బోధనా రంగంలోనూ తెలుగు భాషనే వాడాలి" అంటూ నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఉత్తర్వులు జారీ చేయడంలో మిత్రా కృషి కూడా ఉంది.

అప్పటివరకూ కేవలం నినాదంగా ఉన్న బహుజన రాజ్యాధికారానికి స్పష్టమైన తాత్విక భూమికను మిత్రా రచించాడు. 'సామాజిక న్యాయం' అనే మౌలిక ప్రజాతంత్ర భావన ఆధారంగానే ప్రత్యామ్నాయ రాజకీయ స్రవంతులు ఉండాలని నిర్దేశించాడు. ఏ సామాజిక సిద్ధాంతానికైనా 'సమానతే' ప్రాతిపాదిక కావాలని ప్రకటించాడు. పీడిత కులాలు ఏకం కావాలని చెబుతూ, దామాషా ప్రకారం అవకాశాలు అన్ని కులాలకు ఉండాలి అంటాడు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ జనాభా ఉన్న తెలగ, బలిజ, మున్నూరు కాపు, తూర్పు కాపు వంటి ఉప కులాలన్నీ సమాఖ్యగా ఏర్పడి కాపు కులం చోదక శక్తిగా మారాలని ఆశించిన మిత్రా 'కాపునాడు' రూపకర్త. పీడిత తాడిత, దళిత బహుజన సబ్బండ కులాల ఐక్య సంఘటన ప్రాధాన్యతను ఎన్నడో చాటి చెప్పినవాడు.

సామాజిక మార్పు కోసం కృషి చేసిన మిత్రా ఏప్రిల్ 13, 2007న మరణించాడు. తన మరణానంతరం పార్థివ దేహాన్ని నిట్టనిలువుగా పూడ్చమనే చిత్రమైన కోరిక ఆయన కోరాడంటారు. మిత్రా అముద్రిత రచనలు, శాస్త్రీయ ఆక్యుపంక్చర్ గ్రంథాలు వెలికి తీయాల్సి ఉంది. భావజాల పరంగా మిత్రా ఆలోచనలకు నేడు మరింత ప్రాసంగికత ఉంది. వైద్యునిగా, సామాజిక చింతనాశీలిగా, సాంస్కృతిక దార్శనికుడిగా మిత్రా కృషి ప్రశంసనీయమైనది. జూలై 21న గురుకుల మిత్ర జయంతి. ఆయన ఆశయాల్ని మరింత ముందుకు తీసుకువెళ్ళడమే ఆయనకి ఇవ్వగలిగే క్రియాశీలక నివాళి.

○ గౌరవ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కచ్చాతీవు వలలో భారత జాలరి!

తమిళనాట శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ పొదిలో దాచిపెట్టిన ఆయుధాల తుప్పు వదిలించి, మళ్లీ పదునుపెట్టే ప్రక్రియ జోరందుకుంది. వాటిలో కీలకమైనది కచ్చాతీవు దీవి వివాదం. ఎప్పుడో శ్రీలంకకు ధారపోసిన ఆ దీవి– భారతీయ, ప్రత్యేకించి తమిళనాడుకు చెందిన మత్స్యకారుల పట్ల మరణశాసనం లిఖిస్తున్న నేపథ్యంలో– ఈ సమస్యకొక తార్కిక పరిష్కారం తప్పదన్న దృఢాభిప్రాయం వేళ్లూనుకుంటోంది. బాధ్యత ఎవరిదైనా, బాధితులు సామాన్య జాలర్లే. వలలో నుంచి వారిని విడిపించవలసిందే. కానీ ప్రతిసారీ ఎన్నికల వేళనే ఈ అంశం తెరమీదకు రావడం. తరువాత మరుగునపడిపోవడం పరిపాటైపోయింది. తాజాగా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మరోమారు కచ్చాతీవు అస్త్రాన్ని ప్రయోగించారు. కచ్చాతీవును తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ తమిళనాడు అసెంబ్లీ ఎప్పుడో తీర్మానం ఆమోదించినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంత మాత్రం పట్టించుకోవడం లేదంటూ బుధవారం విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో నేరుగా జోక్యం చేసుకుని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. అంత వరకు బాగానే ఉన్నా, చివరకు వివాదజలాల్లో ఓట్ల వేటగానే ఈ అంశం మిగిలిపోయే అవకాశాలే ఎక్కువ.

సంబంధిత పార్టీలు పుష్కలంగా రాజకీయ పంట పండించుకుంటున్న కచ్చాతీవు, వాస్తవంలో నిర్మానుష్య బంజరు దీవి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో తిష్ట వేసి బలోపేతం అయ్యే దిశలో చైనా దూకుడు, మరోవైపు తమ జలాల్లోకి దూసుకొస్తున్నారంటూ సముద్రంలో వేటకు వెళుతున్న తమిళనాడు జాలర్లను శ్రీలంక తీర రక్షక దళాలు అరెస్టులు చేయడం, వారి మర పడవలను స్వాధీనం చేసుకోవడం నిత్యకృత్యంగా మారింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడీ దీవి చుట్టూ అల్లుకున్న వివాదం అగ్నిపర్వతమై పేలుతోంది. ఆ రాష్ట్రంలోని... ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం, తంజావూరు, పుదుకొట్టాయ్‌లకు చెందిన నాలుగువేల మందికి పైగా జాలర్లను శ్రీలంక నేవీ గత పదేళ్లలో అరెస్టు చేసింది. వారికి చెందిన 600కు పైగా బోట్లను స్వాధీనపరచుకుంది. తమిళనాడు జాలర్ల మీద కాల్పులు జరిపిన సందర్భాలు, ఆ కాల్పుల్లో వారు దుర్మరణం పాలైన ఘటనలు ఎన్నో! అందుకే ఇది చిన్న సమస్య ఏమీ కాదు. కచ్చాతీవు దీవిని అప్పనంగా శ్రీలంకకు అప్పగించి, సముద్ర జలాల్లో సరిహద్దు గీతలు గీయడం ద్వారా ఈ సంక్షోభానికి నాటి కాంగ్రెస్–డీఎంకే ప్రభుత్వాలు కారణమయ్యాయని, ఈ అరాచకానికి మొత్తం బాధ్యత వాటిదేనని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆనాటి ఒప్పందాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుండగా, అందులో భాగస్వామి అయిన డీఎంకే మాత్రం తమకేమీ తెలియదని, తమ పాపమేదీ లేదని అంటోంది. ఇంతకీ తప్పొప్పులు ఎవరివి?

భారత్, శ్రీలంక మధ్య పాక్ జలసంధిలో ఉన్న 285 ఎకరాల చిన్న దీవి ఇది. దీని పొడవు 1.6 కిలోమీటర్లు. వెడల్పు 300 మీటర్లు. ఇది, రామేశ్వరానికి దాదాపు 33 కిలోమీటర్ల ఈశాన్యంలో ఉంది. హిందూ మహాసాగరం మధ్యలో ఉందన్నమాటే కానీ, తాగడానికి గుక్కెడు మంచి నీళ్లు కూడా దొరకవు. సెయింట్ ఆంటోనీ చర్చిని మినహాయిస్తే, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలూ లేవు. అడపాదడపా పర్యాటకులు వచ్చి పోవడమే తప్ప, ఇది జనావాస ప్రాంతమే కాదు. వార్షికోత్సవం మినహాయిస్తే ఆ చర్చి సైతం ఏడాది పొడవునా దాదాపు మూతపడే ఉంటుంది. 17వ శతాబ్దంలో జాఫ్నా సంస్థానం పరిధిలో ఉన్న ఈ కచ్చాతీవు దీవి, తర్వాతి కాలంలో రామనాథపురంలోని రాజారామనాథ సేతుపతి జమీందార్ చేతుల్లోకి చేరింది. బ్రిటిష్ వారి పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం జమీందారీల వ్యవస్థ రద్దు తర్వాత, తమిళనాడు ప్రభుత్వం అధీనంలోకి వచ్చింది. ఈ



దీవి ప్రాంతంలో చేపల వేట విషయంలో భారత్, శ్రీలంక 1921 నుంచి తగాదా పడుతూనే ఉన్నాయి. ఇరుగు–పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంపొందించుకునే ప్రక్రియలో భాగంగా 1974 జూన్‌లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, నాటి శ్రీలంక ప్రధాని సిరిమావో బండారనాయకేతో దీనిపై అంగీకారం కుదుర్చుకున్నారు. ఆడమ్స్ బ్రిడ్జి వరకు గల సముద్ర జలాల్లో సరిహద్దు రేఖ గీస్తూ, ఈ దీవి మీద సర్వాధికారాలను శ్రీలంకకు కట్టబెడుతూ ఆనాడు నాయకులు ఇద్దరూ ఒప్పందంపై సంతకాలు చేశారు. రెండేళ్ల తర్వాత, 1976లో అది అమల్లోకి వచ్చింది. అప్పట్లో తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న డీఎంకే అధినేత కరుణానిధి ఎరుకతోనే ఒప్పందం కుదిరిందని, రాజకీయ కారణాలతో ఆయన దానికి బహిరంగ మద్దతు మాత్రం ప్రకటించలేదని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యవేత్తగా పనిచేసిన ఆర్. కన్నన్ తన పుస్తకం... 'డీఎంకే ఇయర్స్: అసెంట్, డిసెంట్, సర్వైవల్‌'లో స్పష్టం చేశారు. అదేమీ తనకు తెలియనట్లే ఇప్పుడు స్టాలిన్ వ్యవహరిస్తుండటం ఆశ్చర్యకరం.

ఆనాటి ఒప్పందం ప్రకారం... తమిళనాడుకు చెందిన జాలర్లు చేపల వేట సందర్భంగా విశ్రాంతి తీసుకోవడానికి, వలలను ఆరబెట్టుకోవడానికి మాత్రమే కచ్చాతీవును ఉపయోగించుకోవాలి. సెయింట్ ఆంటోనీ చర్చి కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకోవచ్చు. దీవి వద్ద మత్స్య సంపద మీద వారికి ఎలాంటి హక్కూ లేదు. అదంతా శ్రీలంక సర్కారుకు ధారాదత్తం. ఈ నిబంధనలే తమిళనాడు జాలర్ల పాలిట శాపంగా మారాయి. సముద్రంపై గీత, వారి తలరాతనే తిరగరాసింది. వారి జీవనాధారాన్ని చెరిపివేసింది. వేటలో పడి జాలర్లు ఏ మాత్రం ముందుకు వెళ్లినా.. అంతర్జాతీయ జల సరిహద్దుల అతిక్రమణ పేరిట శ్రీలంకలో జైళ్ల పాలవుతున్నారు. పరిస్థితి తీవ్రతను తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత అప్పట్లోనే గ్రహించారు. రాజ్యాంగ సవరణ చేయకుండా ఒక దేశం మరో దేశానికి ఎలాంటి భూభాగాన్నీ బదిలీ చేయడానికి వీలులేదని, అందువల్ల కచ్చాతీవు భారత్‌కే చెందుతుందని ప్రకటించాలని కోరుతూ.. 2008లో ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవంలో, భూబదిలీని అప్పటి కేంద్ర క్యాబినెట్ కానీ, పార్లమెంట్ కానీ ఆమోదించిన దాఖలాలు సైతం లేవు. తమిళనాడు సర్కారు తరఫున ఆనాడు జయలలిత దాఖలు చేసిన పిటిషన్ మీద సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టు విచారణ జరపనుండటం ఈ సందర్భంగా కీలకాంశం. ఉభయ దేశాల మధ్య ఒప్పందం అంటూ కుదిరాక.. అది అంతర్జాతీయ చట్టాల పరిధిలోకి వచ్చేసినట్టే. అందువల్ల దీనిపైన సుప్రీంకోర్టు కూడా చేసేదేమీ ఉండదు. ఇది ముగిసిన అధ్యాయమని, కచ్చా తీవును తిరిగి పొందాలంటే శ్రీలంకతో యుద్ధం అవసరమవుతుందని 2014 ఆగస్టులో అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులోనే స్పష్టం చేశారు. అలాగని ఆశలన్నీ వదిలేసుకోవాల్సిన పని కూడా లేదు. సమస్యను ఉభయతారకంగా పరిష్కరించుకోవడానికి కొన్ని మార్గాలు ఇప్పటికీ ఉన్నాయి. కచ్చాతీవును శ్రీలంకకు అప్పగించడానికి ముందు వరకు తమిళనాడు జాలర్లు ఆ ప్రాంతంలో 24 నాటికల్ మైళ్ల దూరం వరకు వెళ్లి, చేపలు వేటాడేవారు. ఒప్పందం తర్వాత అది 12 నాటికల్ మైళ్లకు కుదించుకు పోయింది. ఏ మాత్రం గీటు దాటినా, వారు శ్రీలంక నేవీ వలకు చిక్కి, చేపల్లా గిలగిల లాడుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఇదివరకటిలాగే 24 నాటికల్ మైళ్ల దూరం వరకు చేపల వేటకు అనుమతించాలన్న తమిళనాడు జాలర్ల డిమాండ్ సమంజసమైనదే. దీనిపై శ్రీలంక ప్రభుత్వంతో మోదీ సర్కారు చర్చించాలి.

కచ్చాతీవు దీవి ప్రాంతంలో చేపల వేట విషయమై భారత్–శ్రీలంక 1921 నుంచి తగాదా పడుతూనే ఉన్నాయి. ఈ దీవి మీద సర్వాధికారాలను శ్రీలంకకు కట్టబెడుతూ 1974లో ఇరు దేశాల ప్రధానులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో నిబంధనలే తమిళనాడు జాలర్ల పాలిట శాపంగా మారాయి. సాగర జలాల్లో వివాదాల వేటను మాని, ఇరు దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తే, దశాబ్దాల సమస్య నుంచి జాలర్లు బయటపడతారు.

మరో దారి ఉంది... పాక్ జలసంధిలో మూడు రోజుల పాటు శ్రీలంక జాలర్లకు, మరో మూడు రోజులపాటు భారత జాలర్లకు చేపల వేటకు అనుమతించవచ్చు. ఒక రోజు సెలవు ప్రకటించవచ్చు. ఇంకో దారీ లేకపోలేదు. ఉభయ దేశాల జాలర్లతో సహకార సంఘాలు ఏర్పాటు చేయాలి. సాగర జీవావరణ– పర్యావరణాలకు ఎలాంటి హాని కలగని రీతిలో, ఆధునిక పద్ధతుల్లో, పరస్పర సమన్వయంతో చేపల వేట సాగించే మార్గాలు అన్వేషించాలి. ఇలాంటి చర్యల వల్ల ఏ పక్షమూ కోల్పోయేదేమీ ఉండదు. సాగర జలాల్లో వివాదాల వేటను మాని, రెండు దేశాల ప్రభుత్వాలు ఈ దిశలో చిత్తశుద్ధితో కృషి చేస్తే... దశాబ్దాల సమస్యల వలలో నుంచి జాలర్లు సురక్షితంగా బయటపడతారు.

■ పి.దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

అంబేడ్కరిస్టు సాహిత్యానికి దారిదీపం!

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రతిపాదించిన సాంఘీక ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం, ప్రత్యామ్నాయ సంస్కృతి, రాజ్యాంగ నైతికత తదితర అంశాల గురించి నేడు విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ ఆలోచనా విధానం, జై భీమ్ నినాదం వర్తమాన కాలానికి నూతన కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. ఆధునిక తెలుగు కవిత్వంలో ఈ విధమైన దృష్టికి మార్గదర్శకంగా నిలిచిన కవి చోడగిరి చంద్రరావు. ఆరున్నర దశాబ్దాల క్రితమే అంబేడ్కర్ బహుముఖీన ఔన్నత్యాన్ని, మూర్తిమత్వాన్ని స్ఫూర్తిదాయకంగా కవిత్వంలో చాటి చెప్పిన కవి చంద్రరావు. డెబ్భయ్యో దశకంలో అరుణారుణ సృజన ప్రభంజనానికి ఎదురొడ్డినిలిచి, తన అస్తిత్వ చైతన్యంతో 'భీమైక' ఎరుకతో ప్రభావశీలమైన పద్య కవిత్వం రాసిన చంద్రరావు గురించి సాహిత్యంలో పెద్దగా చర్చ జరగలేదు.

'మధురకవి' చోడగిరి చంద్రరావు గోదావరి తీరంలో కోరుమిల్లి గ్రామంలో నిరుపేద మాల కుటుంబంలో 1932, జూలై 15న జన్మించాడు. రామచంద్రపురం జాతీయ ఉన్నత పాఠశాల, కాకినాడ పి.ఆర్. కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి, మైసూర్ శాండిల్ కంపెనీలో కొంతకాలం ఉద్యోగం చేసి, ఆ తరువాత రైల్వే శాఖలో సూపర్ వైజర్‌గా పదవీ విరమణ చేశాడు. హృదయవీణ (1968), భీమ శతకం(1972), చంద్రరావు గీతాలు (1974), చంద్రరావు కవిత (1977), అన్వేషణ (1981), భీమ శతకం రెండవభాగం (1989) వంటి కృతులు వెలువరించాడు. శతకం, ఖండకావ్యం, వచన కవిత, పాట తదితర సాహిత్య ప్రక్రియల్లో విలువైన రచనలు చేసిన చంద్రరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జ్ఞానానంద కవి, సి. నారాయణరెడ్డి వంటి కవుల మన్ననలు పొందాడు. తన గురువు, సుప్రసిద్ధ పద్యకవి వేదుల సత్యనారాయణశాస్త్రి ప్రోత్సాహంతో విద్యార్థిగా ఉన్నప్పుడే చంద్రరావు కవిత్వరచన ప్రారంభించాడు. 'వేకువ' (1950) పద్యసంపుటిని వేదులకు అంకితమిచ్చాడు. వేదుల సత్యనారాయణశాస్త్రి చంద్రరావును గుండెలకు హత్తుకొని ఆదరించాడు. 'అంటరానివాడిని ఎందుకు ఇంటికి తీసుకొస్తావు' అని బంధువులు మందలించినా లెక్కచేయకుండా తుదిశ్వాస విడిచేవరకు చంద్రరావును ప్రాణప్రదంగా ప్రేమించాడు. వేమన, వేదుల సత్యనారాయణశాస్త్రి, జాషువ, బోయి భీమన్నలను చంద్రరావు తన సాహిత్య గురువులుగా భావించాడు. ఈ నలుగురు కవనమూర్తుల ఉమ్మడి ప్రభావం వీరి కవిత్వంలో కనిపిస్తుంది.

కవిత్వంపట్ల, కవిత్వప్రయోజనం పట్ల చంద్రరావు స్పష్టమైన అభిప్రాయాలను ప్రకటించాడు. పీడితుల దుఃఖ విముక్తికి దోహదపడేదే ఉత్తమ కవిత్వమని సూత్రీకరించాడు. ప్రారంభ దశలో ఈ కవి 'నన్ను కన్నభూమి, నా అన్నదమ్ములన్/ చిత్రహింస జేసి చితుల ద్రోయ/ ప్రేమ కవిత నేను ఏ మొగమ్మున వ్రాతు?' అని ఆత్మవిమర్శ చేసుకొని తన జాతిజనుల బతుకువెతలను ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. ఆకలి తెలిసిన, లోకం తెలిసిన సామాన్యుడే సర్వజ్ఞుడు అని నిర్ధారించాడు. సామాన్యుడు సుఖపడితే అది స్వర్గమని, దుఃఖపడితే అది నరకమని సగటు మనిషి కేంద్రంగా స్వర్గనరకాలను పునర్నిర్వచించాడు.



కవితా రచన చేయడానికి స్పష్టమైన తాత్త్విక మార్గం అవసరం. 1944లో ఆంధ్రా పర్యటనలో భాగంగా అంబేడ్కర్ కాకినాడ వచ్చినపుడు చంద్రరావు ఆయనను చూసి భావోద్వేగబంధాన్ని ఏర్పరచుకున్నాడు. ప్రముఖ అంబేడ్కరిస్టు, బౌద్ధ ఉపాసకులు శ్రీరాములు, మారెళ్ల కేశవరావులతో కలిసి కాకినాడలో చంద్రరావు అంబేడ్కర్ జయంతి సభలు, సాహిత్య సభలు నిర్వహించేవాడు. కుసుమ ధర్మన్న, రావూరి ఏకాంబరం ప్రేరణతో అంబేడ్కర్ భావాలను, ఆశయాలను అందిపుచ్చుకున్నాడు. అంబేడ్కర్ గురించి తెలుగులో తొలి స్తుతిగీతం (1956) రాసింది కూడా చంద్రరావే. 'నీ జీవితమును ఆదర్శముగ నిడుకొని బ్రతికెదమయ్యా/ నీ ఆశయములు నెరవేరగ నిరతము పోరెదమయ్యా/ నీ నవయానమును మేలగు పథముగ నెంచి/ నీవు నడిచిన పథమును విడువగా లేము' అంటూ అంబేడ్కర్‌కు అక్షర జోహారులు ప్రకటించాడు. హార్మోనియం వాయిస్తూ చంద్రరావు స్వయంగా స్వరపరిచిన ఈ పాట పాడుతుంటే గోదావరి జిల్లాల్లో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యేవారు. దేశంలో మార్క్సిస్టు సాహిత్యం వెల్లువెత్తుతున్న దశలో 1960ల ప్రాంతంలో మరాఠీలో కూడా 'భీమ్ సాహిత్యం' అనే పేరు లేనప్పుడు ఎంతో దార్శనిక దృష్టితో చంద్రరావు కాకినాడలో 'భీమ్ సాహితీ స్రవంతి' అనే సంస్థను స్థాపించి అంబేడ్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు. 'భీమ కవిని' నేను అని సగర్వంగా చెప్పుకున్నాడు. 'ఏమి సెప్పనయ్య! భీమ రాయ!' అనే మకుటంతో రెండు భాగాలుగా భీమశతకం రచించాడు. చంద్రరావు రచనల్లో భీమ శతకం అత్యంత విశిష్టమైనది. ఈ శతకం ఆధునిక సాహిత్యంలో అంబేడ్కర్ ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. తెలుగులో అంబేడ్కరిస్టు సాహిత్యానికి చంద్రరావు దారిదీపంలా కనబడతాడు. 'కవిత నీవు, నాకు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి సెప్పనయ్య భీమరాయ' అంటూ చంద్రరావు అసామాన్యమైన అంబేడ్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు. మనువాదాన్ని, సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలను చంద్రరావు తన కవిత్వం ద్వారా ఖండించాడు. 'అంటరానితనము అంతరించని యెడ/ భరత జాతిచరిత భ్రష్టమగును' అని కులనిర్మూలనాతత్త్వాన్ని ప్రబోధించాడు. 'భీమకవి'గా కోనసీమ ప్రజల నీరజనాలందుకున్న ఈ కవి 1997 అక్టోబర్ 8న మరణించాడు.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ గురించి విశ్వవ్యాప్తంగా సమాలోచనలు జరుగుతున్న సందర్భంలో భీమ దృక్పథాన్ని సమర్థవంతంగా చాటిచెప్పిన చోడగిరి చంద్రరావు కవిత్వంపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగాలి. సమున్నత మానవీయ విలువలకు, రాజ్యాంగ నైతికతకు ఆలవాలమైన వీరి కవితలను పాఠ్యాంశాలుగా ఎంపిక చేయాలి.

◆ డాక్టర్ కోయి కోటేశ్వరరావు
(నేడు కాకినాడలో చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ)

బాలాజీ పీష్వా: శివాజీ స్వరాజ్య స్వప్నసాధకుడు

"మరాఠా గొప్ప యోధులందరినీ ఛత్రపతి సాహు పక్షాన కూడగట్టి, ధమాజీ, ధోరాట్ లాంటి బందిపోట్ల ముఠాలను బలప్రయోగంతో అణిచివేసి, రాజ్యంలో శాంతి స్థిరత్వాలను మెరుగుపరిచాక బాలాజీ పీష్వా మొగలులపై దృష్టి పెట్టాడు. అతని కొడుకు బాజీరావు నిజామును పాల్‌కేడ్‌లోను, ఆ తర్వాత భోపాల్‌లోను చిత్తుగా ఓడించాడు. సిద్దిలు, పోర్చుగీసు వారు ఆక్రమించిన మరాఠా ప్రాంతాలను కూడా విముక్తం చేశాడు. రాజపుత్రుల సహాయంతో ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా జయించాడు."

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెల 4వ తేదీన పూనేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో బాజీరావు పీష్వా విగ్రహాన్ని ఆవిష్కరించి, బాజీరావు యుద్ధ కౌశలాన్ని ఘనంగా కీర్తించారు. ఛత్రపతి శివాజీ స్వరాజ్యకాంక్షను పీష్వాలు వందేళ్ళపాటు కొనసాగించకుంటే, భారతదేశ మౌలిక నిర్మాణం అంతరించిపోయి ఉండేదన్నారు అమిత్‌షా.

"ఛత్రపతి శివాజీ, శంభాజీల మరణం తర్వాత ఏమి జరిగింది?"

శంభాజీ మరణానంతరం మరాఠా సామ్రాజ్యానికి ఆయన భార్య ఏసుబాయి తన ఏడేళ్ల కుమారుడిని కాకుండా, తన మరిది, శంభాజీ తమ్ముడైన రాజారామ్‌ను సింహాసనాధిష్ఠుణ్ణి చేసింది. శంభాజీని గెలిచాను కదా, ఇక మరాఠా సామ్రాజ్యం తన వశమైనట్లేనని ఔరంగజేబు కన్న కల మళ్ళీ వక్రీకరించి, ఆయన ఢిల్లీకి వెళ్లకుండా దక్షిణ భారతంలోనే మళ్లీ యుద్ధంలో కూరుకుపోయాడు. మరాఠాలు వారికే ప్రత్యేకమైన గెరిల్లా యుద్ధ తంత్రంతో ఆ పశ్చిమ కనుమల్లో ఔరంగజేబు సైన్యాల్ని చికాకుపరిచి ఓడించారు.

ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఛత్రపతి రాజారామ్ ఉంటున్న జింజికోటను ముట్టడించిన మొగల్ సైన్యానికి రాజారామ్ చిక్కలేదు. పైగా, 1698లో సతారను కూటమి కేంద్ర స్థానంగా చేసుకుని మొగలులపై యుద్ధం సాగించాడు. ఆయన చేసిన యుద్ధాల్లో ఎంతో సహకరించి కీలకమైన గెలుపులకు కారణమైన సేనాపతి శాంతాజీ గోర్పడే, ధనాజీ జాదవ్‌ల ప్రతాపాన్ని ఇక్కడ చెప్పుకోవాల్సిందే. శాంతాజీ పేరు చెబితే మొగల్ సైన్యం ఎలా హడలిపోయేదో మొగల్‌ల సమకాలికుడైన పర్షియన్ చరిత్రకారుడు 'ఖాఫిఖాన్' ఏమి చెప్పాడో చూడండి. "మరాఠాల సైన్యాధిపతి శాంతాజీని ఎదుర్కొనే ప్రతివాడూ చావనైనా చచ్చేవాడు, లేక బందీగానైనా చిక్కేవాడు, మొగల్ చక్రవర్తి కొలువులో ఏ సర్దార్‌కూ అతనిని నిరోధించేందుకు ధైర్యం చాలేది కాదు." 1699 డిసెంబర్ 22న రాజారామ్ రాసిన ఈ లేఖను చూస్తే మొగలులపై ఆయన సాధించిన కీలక విజయం మనకు అర్థమవుతుంది. "మేము ఔరంగాజేబు సైనిక శిబిరంపై దాడి చేసి ఆయన కుమార్తెనే బందీగా చేసుకున్నాం.. త్వరలోనే ఔరంగాజేబును పూర్తిగా ఓడిస్తాం." 1700 మార్చి 2న పిన్న వయసులోనే రాజారామ్ జబ్బుపడి, ఆకస్మికంగా మరణించాడు.

అనంతరం రాజారామ్ భార్య తారాబాయి తన సైనిక వ్యూహాలతో మొగల్‌లపై పోరాటాన్ని ఒక ప్రజాయుద్ధంగా మార్చివేసింది! దీంతో మరాఠాలకు ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. మరాఠాల విజయ పరంపరతో మొగలుల సైన్యం నానాటికీ క్షీణించింది. మరాఠాలపై విజయం ఎండమావిగా మారడంతో ఔరంగజేబు మనోవేదనతో కృంగి కృశించి తన 88వ యేట అహ్మద్ నగర్‌లో చనిపోయాడు.

మొగల్ పాలకులు అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు దశాబ్దాల పాటు రాజ్యం పాలించగా, ఔరంగజేబు మరణానంతరం గద్దె నెక్కిన మొగల్ బాదుషాలు పట్టుమని ఐదేళ్లు కూడా కొనసాగలేదు. ఒక్కో సంవత్సరంలో అయితే ఇద్దరు గద్దె నెక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. తండ్రి ఎప్పుడు కాలం చేస్తాడా, తను ఎప్పుడు గద్దె నెక్కాలా! అని ఎదురు చూసిన ఔరంగజేబు కుమారుడు 'మువాజం', తండ్రి మరణానంతరం గద్దెనెక్కాడు. అటు తర్వాత ఐదు సంవత్సరాలకే 1712లో చనిపోయాడు.



'మువాజం' మరణానంతరం ఢిల్లీ సింహాసనం సార్వభౌమత్వాన్ని కోల్పోయి దర్బార్‌లో ఉన్న సర్దార్ల చేతిలోకి వెళ్లిపోయింది! అటు తర్వాత వరుసగా ఆ గద్దెనెక్కిన మొగల్ బాదుషాలు కాస్తా, సర్దార్ల చేతిలో కీలుబొమ్మగా మారిపోయారు. మొగలుల మంత్రి జుల్ఫికర్ అలీ ఖాన్, మువాజంకు పుట్టిన ముగ్గురు కుమారుల్లో పెద్దవాడైన జహందర్ షాను చేరదీసి, మిగతా వాళ్ళని చంపివేశాడు. తరువాత అతడిని ఢిల్లీ సింహాసనం మీద ఒక సంవత్సరం మాత్రమే కూర్చోబెట్టాడు.

ఇక ఇక్కడ మరాఠాల విషయానికొస్తే ఛత్రపతి శివాజీ మనవడైన 'సాహూ', మరాఠా సామ్రాజ్యానికి ఛత్రపతిగా 1708 జనవరిలో సింహాసనమెక్కాడు. ఉమ్మడి శత్రువైన మొగల్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నమై నానాటికీ కుంచించుకుపోయాక.. మరాఠా యోధులలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారయ్యారు. వాళ్ళలో వాళ్లే తగవులు పడి చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. ఈ సందర్భంలోనే జాతీయ స్వరాజ్య యవనికపై ముందుకు వచ్చాడు బాలాజీ పీష్వా. పీష్వా అంటే ఛత్రపతి యొక్క ప్రధానమంత్రి. ఈయన కింద పనిచేసే అష్ట ప్రధానులనే మంత్రులు ఉంటారు. ఈ బాలాజీ పీష్వానే మరాఠా సామ్రాజ్యంలో అత్యంత బలవంతుడైన 'కన్హోజీ ఆంగ్రే'ను ఛత్రపతికి ఎదురు తిరిగిన సందర్భంలో ఒప్పించి, జాతీయవాద స్వరాజ్య పోరాటంలో ఆయనను భాగం చేశాడు. అసంతృప్తితో ఉన్న మిగతా మరాఠా సర్దార్లను అందరినీ కలిపి శత్రువుకు వ్యతిరేకంగా పరస్పర సహకార పద్ధతిలో మరాఠా మహా మండల్ స్థాపించాడు. దాంతో మొగలులు ఆశించినట్టుగా మరాఠాలు విడిపోకుండా మహా మండల్ పేరుతో వాళ్లంతా ఐక్యమయ్యారు.

"మహా మండల్ తర్వాత నూరేళ్లపాటు దేశం మొత్తాన్ని మరాఠాలు నియంత్రించారు. అటు గుజరాత్ నుంచి ఇటు దక్షిణాన కర్ణాటక వరకు వాళ్లదే సామ్రాజ్యం. చివరికి ఢిల్లీ దర్బార్‌ను కూడా వారే నియంత్రించారు. వారి ప్రయోజనాలకు తగ్గట్టుగానే ఢిల్లీ దర్బారులో ఉన్న పాదుషాలను తమ చేతిలో కీలుబొమ్మలుగా చేసుకొని ఆడించారు. బేసన్ నుంచి పోర్చుగీసు వారిని ఓడించి తరిమేశారు. ఇంగ్లీష్ వారితో సమాన స్థాయిలో రెండు యుద్ధాలు చేశారు. పానిపట్ యుద్ధంలో ఘోర పరాజయాన్ని కూడా తట్టుకొని ఢిల్లీలోనూ, ఉత్తర భారతంలోనూ తమ స్వరాజ్యాన్ని స్థాపించగలిగారు.

మరాఠా గొప్ప యోధులందరినీ ఛత్రపతి సాహు పక్షాన కూడగట్టి, ధమాజీ, ధోరాట్ లాంటి బందిపోట్ల ముఠాలను బల ప్రయోగంతో అణిచివేసి, రాజ్యంలో శాంతి స్థిరత్వాలను మెరుగుపరిచాక బాలాజీ పీష్వా మొగలులపై దృష్టి పెట్టాడు. మొగల్ రాజ్యంలో భాగాలైన ఔరంగాబాద్, బేరార్, ఖాన్దేశ్, బీదర్, గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలలో వసూలయ్యే 'చౌథ్' పన్నులను తమకే చెల్లించాలని అప్పటి ఢిల్లీ గద్దెపై ఉన్న మొగల్ కీలుబొమ్మ బాదుషా 'ఫారుక్ షియార్'ని కోరాడు. 1713లో జహందర్ షా మరణానంతరం ఆయన వారసుడిగా ఈ ఫారూక్ షియార్‌ను సయ్యద్ సోదరులని పిలవబడే మొఘల్ సర్దార్లు ఢిల్లీ గద్దె నెక్కించారు. అప్పటికే మొగల్ సామ్రాజ్యం కేవలం ఢిల్లీ నగరానికి మాత్రమే పరితమైంది.

బాలాజీ పీష్వా పెట్టిన ప్రతిపాదనను ఈ ఫారూఖ్ షియార్ ఒప్పుకోక, మరాఠాలతో యుద్ధానికి సిద్ధపడ్డాడు. 50వేల సైన్యంతో ఢిల్లీని ముట్టడించిన బాలాజీ పీష్వా, ఫారుక్ షియార్‌ని ఓడించాడు.. గద్దెనెక్కించిన సయ్యద్ సోదరులే షియార్‌ను ఖైదులో చంపివేశారు. మరో కీలుబొమ్మ ప్రభువైన మహమ్మద్ షాను ఢిల్లీ గద్దెపై మొగల్ ప్రభువుగా కూర్చోబెట్టారు.

ఈ మహమ్మద్ షానే దక్షిణ భారతదేశంలో వసూలయ్యే పన్నును మరాఠాలకే సమర్పిస్తానని ఒప్పందానికి వచ్చాడు. అంటే ఈ ఒప్పందంతో మొగలులు మారాఠాలకు సామంతులుగా మారారని అర్థం! శివాజీ కలలు కన్న నిజమైన స్వరాజ్యాన్ని బాలాజీ పీష్వా ఇలా సాకారం చేశాడు. దీని తర్వాతనే మరాఠాలైన పీష్వాలు ఛత్రపతుల స్థానంలో స్వరాజ్య స్థాపకులుగా మారారు. తర్వాత బాలాజీ పీష్వా కుమారుడైన బాజీరావు, ఛత్రపతి "సాహు" కొలువులో పీష్వాగా నియమించబడ్డాడు. రాజసభ మందిరంలో పైకప్పును దాదాపుగా తాకే నిలువెత్తు విగ్రహం, స్పష్టంగా ఖంగున మోగే గొంతు, ధైర్యం, పౌరుషం ఉట్టిపడే ముఖ కవళికలు, దర్పంతో ఆకట్టుకునే నల్లటి కళ్ళు, అన్నిటికీ మించి అనర్గళ వాగ్ధాటి... 'నేను మరాఠా పతాకాన్ని సింధూ నది తీరాన ప్రతిష్ఠిస్తాను' అని ఛత్రపతి సాహు వైపు చూస్తూ గంభీరంగా పలికాడు.

బాజీరావు మొగలుల దక్కన్ సుబేదారైన నిజామును పాల్‌కేడ్‌లోను ఆ తర్వాత భోపాల్‌లోను చిత్తుగా ఓడించాడు. సిద్దిలు, పోర్చుగీసు వారు ఆక్రమించిన మరాఠా ప్రాంతాలను కూడా విముక్తం చేశాడు. రాజపుత్రుల సహాయంతో ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా జయించి, మొగలుల మహా సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేశాడు. ఇదీ, సంక్షిప్తంగా గ్రేట్ మారాఠాల చరిత్ర... అంటే.. మన చరిత్ర!

● డా. అంబటి శ్రీనివాస్‌రాజు
('మన కాకతీయులు' గ్రంథకర్త)



మగోడు



డిప్రెషన్‌లో పెళ్లికాని ప్రసాద్‌లు

- అమ్మాయిల ఆలోచనల్లో మార్పులతో తిప్పలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉండాలంటోన్న యువతులు
- ఐదు అంకెల జీతం ఉంటేనే మూడుముళ్లకు సిద్ధం
- స్వయంవరంలో సంప్రదాయ కులవృత్తుల యువత ఓటమి

పెళ్లి.. పురుషుడికి పగటి కలగా మారుతోంది. అబ్బాయిలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉంటేనే అమ్మాయిలు పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. ఐదు అంకెల జీతం అందుకున్న వారితోనే మూడుముళ్లు వేయించుకుంటున్నారు. కొంతమంది అబ్బాయిలకు పెళ్లి చూపులు.. ఎదురు చూపులుగా మారుతున్నాయి. సంప్రదాయ కులవృత్తులు చేసుకునే వారు, వ్యవసాయం, ఇతర పనులపై ఆధారపడే వారు, చిరు జీత గాళ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే యువకులు వివాహ బంధానికి నోచుకోవడం లేదు. తల్లిదండ్రులకు అండగా గ్రామాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో ఉంటూ ఏదో ఒక పని చేసుకునే వారు కూడా మూడుముళ్ల బంధాన్ని మరిచి పోవాల్సి వస్తోంది. దీంతో పెళ్లీడుకు వచ్చిన మగపిల్లలు అనేక మంది డిప్రెషన్‌కు గురవుతున్న సందర్భాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి.

సండే స్పెషల్

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇలా ఒక సంబంధం విషయంలో అయితే పర్వాలేదు.. డజన్ల కొద్దీ సంబంధాలదీ ఇదే పరిస్థితి. సమాజంలో పురుష, స్త్రీ నిష్పత్తిలో వ్యత్యాసాలు రావడంతో అది పెళ్లిళ్లపై పడింది. దీంతో వివాహానికి సంబంధించి గతంలో ప్రాధాన్యాలు అబ్బాయిలకు ఉండగా ఇప్పుడు ఆ అవకాశం అమ్మాయిలు చేజిక్కించుకున్నారు. సంప్రదాయ వృత్తులైన వ్యవసాయం, వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, మంగలి, పౌరోహిత్యం తదితర వృత్తులు చేసుకునే యువకులు పెళ్లి పగటి కలలా మారింది. బేల్దారి, టైలరింగ్, ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూనో.. స్థానికంగా చిరు జీతాలతో ఉద్యోగం చేసుకుంటూనో.. గ్రామాల్లో ఉంటూ వ్యవసాయంపై ఆధారపడే వారు.. కూలి పనులు చేసుకునే వారికి కూడా పెళ్లి సంబంధాలు రావడం లేదు. యుక్త వయసుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెళ్లంటే ఎంతో ఆశగా మారింది.



● మూడు పదులు దాటినా..

సహజంగా జీవితంలో స్థిరపడ్డాక పెళ్లికి అబ్బాయిలు సిద్ధపడతారు. అయితే గత కొన్నేళ్లుగా ఇలాంటి వారికి సంబంధాలు కుదరడం కష్టంగా మారింది. మూడు పదులు దాటినా పెళ్లి కాని పరిస్థితి మగవాళ్లకు ఎదురవుతోంది. కుల, చేతి వృత్తులపై ఆధారపడిన యువకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారికి సంబంధాలు చూడడం, వెదకడమే కష్టంగా మారిపోయింది. వారి పెళ్లి ఊసెత్తగానే అయినవాళ్లు కూడా ముఖం చాటేస్తున్నారు. దూరపు బంధువులు ముఖం మీదే కాదని చెప్పేస్తున్నారు. సంప్రదాయ వృత్తుల్లో ఉండేవారిపై ఆడపిల్లల కుటుంబాల్లో ఆసక్తి తగ్గిపోవడంతో పెళ్లిళ్ల మధ్యవర్తులు కూడా పక్కకు తప్పుకుంటున్నారు. వాళ్ల కనీసం అబ్బాయి ఫొటో, బయోడేటా కూడా తీసుకోవడానికి సుముఖంగా ఉండడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, వ్యాపార ప్రముఖులు అయితేనో, రూ.కోట్లలో ఆస్తులు ఉంటేనో.. మధ్యవర్తులు సంబంధాలు చూస్తున్నారు.

● ఆడపిల్లల కుటుంబాల్లో విపరీత ధోరణులు

మారిన పరిస్థితుల రీత్యా పెళ్లి కావాల్సిన ఆడపిల్లలకు డిమాండు పెరిగింది. దీంతో ఆడపిల్లల కుటుంబాల ఆలోచనా ధోరణిలో విపరీత మార్పులు కనిపిస్తున్నాయి. సాదా, సీదా సంబంధాలను వారు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆడపిల్లలు విద్యావంతులు కావడంతో వారి ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. గతంలోలా కాకుండా తమ అభిరుచులకు తగినవారైతేనే సంబంధానికి ఓకే చెబుతున్నారు. ఆర్థికంగా మెరుగైన, సుభిక్షమైన జీవితాన్ని కోరుకుంటూ అందుకనుగుణంగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. దీంతో సాదా, సీదా ఉద్యోగాలు చేసే వారికి, సంప్రదాయ, కుల వృత్తులను నమ్ముకున్నవారికి పెళ్లిళ్లు గగనమైపోయాయి.

● మంగళగిరికి చెందిన ఓ యువకుడు సంప్రదాయంగా వచ్చిన వృత్తిని స్వీకరించాడు. అతడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాడు. పదేళ్లుగా సంబంధాలు చూస్తున్నా పెళ్లిచూపులకు కూడా అతడు నోచుకోవడంలేదు. అతడు చేసే వృత్తి గురించి చెప్పగానే ఉద్యోగం లేదా అంటూ అవతలి వైపు నుంచి పెళ్లి ప్రస్తావన ఆగిపోతోంది.

● తెనాలికి చెందిన ఓ యువకుడు బంగారపు పని చేస్తూ నెలకు 70 వేల వరకు సంపాదిస్తాడు. ఇల్లు ఉంది. అయినా పెళ్లి కుదరడం లేదు. బంగారపు పనిచేసుకునే వారికి ఇవ్వం అని అమ్మాయి తరపు వారు తెగేసి చెబుతున్నారు.

● ఓ యువకుడు కార్పెంటర్ పని చేస్తూ నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు సంపాదిస్తున్నాడు. కానీ అతడికి 30 దాటినా పెళ్లి కల నెరవేరలేదు. అతడు చేసే పని చెప్పగానే సంబంధాలు వెనక్కి వెళ్లిపోతున్నాయి.

● డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు ఓ కంపెనీలో రూ.20 వేల జీతానికి ఉద్యోగం చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా రెండు డజన్లకు పైగా సంబంధాలు వచ్చినా అతడికి వచ్చే జీతం చూసి తిరుగుటపాలో వెళ్లిపోతున్నాయి.



చార్టర్డ్ అకౌంటెంట్లకు గుంటూరు హబ్ కావాలి

- అత్యుత్తమ ప్రతిభతో సీఏల తయారీకి ప్రభుత్వం కృషి
- విద్యార్థులకు అవగాహనా సదస్సులో మంత్రి లోకేశ్

గుంటూరు(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేసే హబ్‌గా గుంటూరు కావాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు. గుంటూరులో వైద్యం, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికంటే సీఏ అభ్య సించేవారే ఎక్కువగా ఉన్నారన్నారు. సీఏ చదివేందుకు ఏటా 10 వేల మంది గుంటూరు రావడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణతా శాతంతో, సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేయాలని, ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భారతదేశం గర్వపడేలా గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రతిభ చాటుతున్నారన్నారు. ఇష్టపడి చదివితే సీఏ కోర్సులు పూర్తి చేయడం కష్టతరం కాదన్నా రు. కష్టతరమైనా యువతను సీఏ ఉన్నత శిఖరాల్లో నిలబెడుతుందన్నారు. ఈ సమా వేశంలో గుంటూరు పశ్చిమ, తాడికొండ ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డీ ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సీ) వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి చైర్మన్ ఎన్ రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్ఐసీఏఎస్ఏ) గుంటూరు బ్రాంచ్ చైర్మన్ చింతా రఘునందన్, వైస్‌చైర్మన్ బీ ఝాన్సీలక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వీ నరేశ్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్ వేదికపై ఎమ్మెల్యే మాధవి, తదితరులు

రాజధాని పనులు వేగవంతం చేయాలి

అధికారులతో ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి



రోడ్డు నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఏడీసీ చైర్‌పర్సన్ డి.లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో రహదార్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి ఆదేశించారు. మేఘా ఆధ్వర్యంలో జరుగుతున్న రహదార్ల నిర్మాణ పనుల్ని శనివారం ఆమె పరిశీలించారు. విజయవాడ పశ్చిమ బైపాస్‌కు అనుసంధానంగా పనులు జరుగుతున్న ఎన్-6 ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించారు. అనంతవరం నుంచి ఉండవల్లి వరకు నిర్మాణంలోని ఈ-4, నిడమర్రు నుంచి మంగళగిరి వరకు జరుగుతున్న ఈ-14, నీరుకొండ నుంచి పెనుమాక వరకు జరుగుతున్న ఈ-11 రహదారుల పనులను పరిశీలించారు. నిర్మాణ సంస్థ క్యాంపు, మెటీరియల్ స్టాక్ పాయింట్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు.

పర్యాటక కేంద్రంగా శాఖమూరు రిజర్వాయర్

అమరావతిలోని శాఖమూరు రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆమె సూచించారు. ఎన్-11 రహదారిపై ప్రయాణించే వారికి గొప్ప సుందర దృశ్యంగా ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసి ల్యాండ్‌స్కేపింగ్ జాగ్రత్తగా చేపట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఏడీసీ ఉద్యాన వన నిపుణులు వీఎస్ ధర్మజ, పీ విశ్వప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఆర్ గోపాలకృష్ణారెడ్డి, ఎస్ఈలు నరసింహామూర్తి, వీ శ్రీనివాస్, ఈఈ బసవేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే నెలలోనే సాగునీరు

- ఆగస్టు తొలి వారంలో కుడి కాల్వకు విడుదల
- వరి సాగు తగ్గించి.. ఉద్యాన విస్తీర్ణం పెంచాలి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయాలు

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేయాలని సాగునీటి సలహా మండలి నిర్ణయించింది. జోన్-1కు తొలి దశలో నీటి సరఫరాకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. పల్నాడు కలెక్టరేట్‌లో శనివారం జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ అధ్యక్షతన సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి హాజరయ్యారు. ఖరీఫ్ పంటల సాగుపై ప్రధానంగా చర్చించారు. వరి సాగు తగ్గించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని పలువురు సూచించారు. పొగాకు కంపెనీల నుంచి అనుమతి పత్రాలు ఉంటేనే బర్లీ పొగాకు సాగు చేయాలని రైతులకు సూచించారు.



సమావేశంలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు యరపతినేని, అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన, పీసీ చైర్మన్ పులుకూరి, వైస్ చైర్మన్ చక్రపాణి, తదితరులు

పోస్టులను భర్తీ చేయాలి

సాగర్ కుడి కాల్వ పరిధిలో ఉద్యోగుల కొరత ఉందని, లస్కర్, ఏఈ, జేఈ పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరారు. 3,500 ఎకరాలు ఉన్న బుగ్గవాగు ఆక్రమణలకు గురై.. రెండు వేల ఎకరాలకు తగ్గిందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 30 శాతం మాత్రమే కాల్వల ఆధునికీకరణ పూర్తయిందని, చివరి భూములకు నీరు అందడం లేదని పీసీ వైస్ చైర్మన్ చక్రపాణి తెలిపారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు.

కార్యాలయానికి శంకుస్థాపన

కలెక్టరేట్ సమీపంలో కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ కార్యాలయ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో భవనం నిర్మించనున్నారు.



ఆర్వోబీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్

నందివెలుగు ఆర్వోబీకి అబ్దుల్‌కలాం పేరు

- ఆరు నెలల్లో రివైజ్డ్, ఎస్టిమేట్ టెండర్ల ప్రక్రియ పూర్తి
- పనుల పునఃప్రారంభంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'నందివెలుగు ఆర్వోబీ.. గుంటూరు అభివృద్ధికి పునాది. ప్రజల నమ్మకానికి, నాయకుల పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం. అలాంటి ఆర్వోబీకి ప్రజల నుంచి ఎనలేని మన్ననలు గౌరవం పొందిన అబ్దుల్‌కలాం నందివెలుగు బ్రిడ్జిగా నామకరణం చేస్తున్నాం.' అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. బ్రిడ్జి పునర్నిర్మాణ పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే నజీర్‌తో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014లో రూ.31 కోట్లతో నందివెలుగు ఆర్వోబీకి టీడీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అయితే 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా రూ.8 కోట్లు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఎంపీ గెలిచి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ ఆర్వోబీ అంశంపై ప్రతీ వారం అధికారులతో సమీక్షలు నిర్వహించామన్నారు. పాత కాంట్రాక్టర్‌కు రూ.10 కోట్లు చెల్లించడంతో పాటు, కొత్త ఎస్టిమేట్లను కేంద్రానికి సమర్పించి ఆరు నెలల్లో టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశామన్నారు. ఇది ప్రభుత్వపు వేగవంతమైన పనితనానికి ఉదాహరణ అని అన్నారు. కేంద్రాన్ని ఒప్పించి ఆర్వోబీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయించామన్నారు. గుంటూరుకు ఇన్నర్ రింగ్‌రోడ్డు, మంగళగిరి ఎయిమ్స్‌కు తాగునీటి పథకంలా ఈ ఆర్వోబీ కూడా ప్రజల కోసం చేస్తున్న మరో నిస్వార్థ ప్రయత్నమని చెప్పారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణానికి ఐదేళ్ల పాలనలో ఒక్క ఇటుక కూడా పెట్టని వైసీపీ నేతలను ప్రజలు నిలదీయాలన్నారు. వేలాది మంది ప్రజల ట్రాఫిక్ బాధలకు బ్రిడ్జి నిర్మాణం శాశ్వత పరిష్కారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ డేగల ప్రభాకర్, టీడీపీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెనాలిని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

- మున్సిపల్ కార్మికుల సమావేశంలో మంత్రి మనోహర్



నగరదీపికలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'పచ్చదనం, పరిశుభ్రతలకు మారుపేరుగా తెనాలిని తీర్చిదిద్దాలి. అందుకు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కలిసికట్టుగా పనిచేయాలి..' అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్థానిక శ్రీరామకృష్ణ కవికళాక్షేత్రంలో మున్సిపల్ శానిటరీ అధికారులు, పారిశుధ్య కార్మికులు, నగరదీపికలతో శనివారం మంత్రి మనోహర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాప్యారిస్ పేరుకు తగ్గట్లుగా తెనాలి పట్టణాన్ని పారిశుధ్య నిర్వహణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో అంకిత భావంతో పనిచేయాలన్నారు. 307 మంది కార్మికులకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సొంత నిధులతో అక్టోబరు 1కి ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఇన్‌ఛార్జ్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతిరావు, ఎంఈ శ్రీకాంత్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యేసుబాబు, ఏసీపీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఆర్ టెర్మినల్‌గా కేసీజే

- సరుకు రవాణాలో కీలకంగా ప్రాజెక్టు
- గుంటూరులోని పారిశ్రామికవాడలకు కనెక్టివిటీ
- వేగం పుంజుకోనున్న ఇన్‌వర్డు, అవుట్‌వర్డు సరుకు రవాణా

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా కెనాల్ జంక్షన్(కేసీజే) ఇప్పుడు ఎక్స్‌టెన్‌డెడ్ కంటైనర్ రైల్(ఈసీఆర్) టెర్మినల్ కానున్నది. దేశ వ్యాప్తంగా 23 ఈసీఆర్‌టీలను అభివృద్ధి చేసేందుకు కాన్‌కోర్ ఏరియా-3 దక్షిణ సంస్థ ప్రకటించింది. అందులో కేసీసీకి చోటు లభించింది. దీంతో ఈ రీజియన్‌లో మల్టీమోడల్ కార్గో మూవ్‌మెంట్‌లో ఇదొక కీలక మైలురాయి అవుతుందని ఆ సంస్థ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా సరుకు రవాణాలో ఆంధ్రప్రదేశ్‌కి ఇదొక గేమ్‌ఛేంజర్ అవుతుందని చెబుతున్నాయి. రైలు, సముద్ర మార్గాల్లో సరుకులను రవాణా చేయడానికి ఎక్కువగా కంటైనర్లను వినియోగిస్తున్నారు. గుంటూరు మిర్చి ఎగుమతిదారుల నుంచి ఏటా 20 వేల కంటైనర్లకు పైగా రోడ్డు/రైలు మార్గాల్లో చెన్నై పోర్టుకి, అక్కడి నుంచి చైనా, థాయ్‌ల్యాండ్, ఇండోనేషియా వంటి దేశాలకు రవాణా అవుతాయి. అలానే ఇతర ప్రాంతాల నుంచి సరుకులను తీసుకుని కంటైనర్లు ఇక్కడికి వస్తుంటాయి. ఇప్పుడు కృష్ణాకెనాల్ జంక్షన్‌లో ఈసీఆర్‌టీ ఏర్పాటు చేయడం వల్ల పారిశ్రామికవేత్తలకు అనేక ప్రయోజనాలు సమకూరుతాయి. ఈసీఆర్‌టీ కోసం సువిశాలమైన స్థలం కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నది. ఈసీఆర్‌టీ ఏర్పాటుతో గుంటూరు, విజయవాడ పరిసరాల్లో ఉన్న పారిశ్రామిక వాడలకు నేరుగా రైలు కనెక్టివిటీ పెరుగుతుంది. దీని వల్ల ఆయా పారిశ్రామిక వాడలకే గూడ్స్ రైళ్లు వెళ్లి కంటైనర్లను రవాణా చేసే అవకాశం కలుగుతోంది. కంటైనర్ల వల్ల సరుకు రవాణా సులభతరంగా జరుగుతుంది. అలానే వేగవంతంగా, సురక్షితంగా సరుకులు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. అలానే రద్దీగా ఉండే టెర్మినల్స్‌పై ఒత్తిడిని తగ్గిస్తాయి. అలానే ఖర్చులు కూడా తగ్గుతాయి. సర్వీసు ప్రామాణికత, ఆపరేషనల్ సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతాయి. అమరావతి రాజధానిలోనే కృష్ణాకెనాల్ జంక్షన్ ఉన్నందున భవిష్యత్తులో ఇక్కడికి సరుకు దిగుమతి, ఈ ప్రాంతం నుంచి ఎగుమతి చేయడానికి ఎంతో సులభతరం అవుతుంది.



విద్యార్థి దశ సద్వినియోగంతోనే ఉజ్వల భవిష్యత్తు

● జస్టిస్ జ్యోతిర్మయికి విజయలక్ష్మి స్మారక పురస్కారం

6

పసుపు రైతులకు పరిహారం గర్వకారణం : పెమ్మసాని

విద్యార్థి దశ సద్వినియోగంతోనే ఉజ్వల భవిష్యత్తు

● జస్టిస్ జ్యోతిర్మయికి విజయలక్ష్మి స్మారక పురస్కారం



జస్టిస్ జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి పురస్కారంతో సత్కరిస్తున్న వీసీలు శివరామకృష్ణ, కృపాచారి, సత్యనారాయణ

తెనాలి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాప పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో.. జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై న్యాయ మూర్తి మాట్లాడారు. ఓటమి అనేది శత్రువుల వల్ల రాదని, మనసులో భయం ఉంటేనే వస్తుందన్నారు. జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ ప్రసంగించారు. పదవ తరగతి పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈదర వెంకటపూర్ణచంద్, ప్రసాద్, నాగభూషణం, తాతాజీ, ఈశ్వర్‌చంద్, జగదీశ్వరి, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

పెట్రోల్ దాడి కేసులో నిందితుడికి రిమాండ్

నూజెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మహిళ మృతికి కారణమైన నిందితుడికి కోర్టు శనివారం రిమాండ్ విధించింది. వివరాల మేరకు.. ఐన వోలు గ్రామంలో ఈ నెల 16న ఆరుబయట నిద్రిస్తున్న దంపతులపై నీలబోయిన యలమంద పెట్రోల్ పోసి నిప్పంటిం చాడు. ఈ ఘటనలో నీలబోయిన మంగమ్మ మృతి చెందింది. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి మృతి

పిట్టలవానిపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి శని వారం మృతి చెందారు. పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన వేగేశన వెంకటేశ్వరరాజు (77) ద్విచక్ర వాహనంపై జీఎస్‌పాలెం గ్రామంలో ఓ శుభ కార్యాయానికి వెళ్లి వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొంది. వెంకటేశ్వర రాజు గతంలో విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి, 2006లో ఉద్యోగ విరమణ పొందారు. చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు రైతులకు పరిహారం గర్వకారణం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ● శుభం కోల్ట్ స్టోరేజీ బాధిత రైతులకు పరిహారం పంపిణీ



బాధిత రైతులకు నగదు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బాధిత పసుపు రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించడం గర్వకారణంగా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంత్రి పెమ్మసాని, జేసీ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలె క్టర్ సంజనా సింహతో కలిసి దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు బీమా కంపెనీ మంజూ రు చేసిన నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ 2024 జనవరిలో జరిగిన అగ్నిప్రమా దంలో 294 మంది రైతులు, 14 మంది ట్రేడర్ల 1.23 లక్షల పసుపు బస్తాలు బూడిదయ్యాయని తెలిపారు. దీంతో సుమారు రూ.45 కోట్లు నష్టం జరిగిందన్నారు. అగ్నిప్రమాదం జరి గిన వెంటనే, సమస్యను చంద్రబాబు నాయుడు ప్రతిపక్షనేతగా అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. అదే ఆర్థిక సంవత్సరంలో చర్యలు తీసుకోక పోవడం వల్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రక్రియ క్లిష్టంగా మారిందన్నారు. మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గంలో జరిగిందని, ఆయనే మొదటి నుంచి ఫాలోఅప్ చేస్తూ రైతులకు న్యాయం జరిగేలా చొరవ చూపించారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నానాయుడు ప్రత్యే చొరవ తీసుకున్నారన్నారు. బీమా కంపెనీతో నిరంతర చర్చల కారణంగా రూ. 36 కోట్లకు పైగా క్లెయిమ్‌లు తెప్పించగ లిగామని పెమ్మసాని వెల్లడించారు. ఈ మొత్తం బీమా పరిహారంలో రూ. 20 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్లగా, రూ. 4.75 కోట్లు ట్రేడర్లకు, మరో రూ. 10 కోట్లు శుభం కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి విడుదలయ్యా యని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యాజ మాన్యం ఆ మొత్తాన్ని కూడా రైతు లకే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, లేకపో తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు క్వింటాల్ రూ.7 వేలు చొప్పున నష్టాన్ని అంచనా వేసి, ఆ దిశగా చర్యలు ప్రారంభిం చామని, మొదటి విడతగా ఈ రోజు చెక్కులను అందిస్తున్నామన్నారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ పసుపు రైతులకు కొంత భాగం నగదు మాత్రమే అందిస్తున్నామని, త్వరలోనే పూర్తి స్థాయిలో మిగిలిన నష్ట పరిహారం అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలి, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యన్నారాయణ చౌదరి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



ప్లాస్టిక్ బాటిళ్లు తొలగిస్తున్న చైర్మన్ మక్కెన, జంగా తదితరులు

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లా స్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొ న్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీ ఆర్ సహకార భవన్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యోగులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మానవ హారం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ మక్కెనతో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, బ్యాంకు మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లుతో కలిసి ఉద్యోగులు బ్యాంకులోని ప్లాస్టిక్ బాటిల్స్ ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. చైర్మన్ మక్కెన మాట్లాడుతూ పరిపాలన కార్యాలయంలో ఉద్యోగులందరికి తన ఖర్చుతో స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేస్తానని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో అజయ్‌కిషోర్, జీఎంలు కృష్ణవేణి, ఫణికుమార్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర బ్యాంక్ నోడల్ అధికారులు మాధవి, కె.బాలాజీ ప్రసాద్ తదితరులున్నారు.

అందరి కృషితోనే..పర్యావరణ పరిరక్షణ

● జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం



బహుమతులు పొందిన విద్యార్థులతో నజీనా బేగం, స్టెప్ సీఈవో చంద్రముని తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాలుష్య నియంత్రణ మండలి, ప్రభుత్వ మహిళా కళాశాల, స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా కళాశాల ఆవరణలో 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ గ్లోబల్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వం తీసుకొచ్చిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే త్రిసూత్రాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచిం చారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణపై విద్యార్థుల నుంచి మరిన్ని ప్రయోగాలు రావాల్సిన అవసరముందని స్టెప్ సీఈవో చంద్రముని అభిప్రాయపడ్డారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర జిల్లా సమన్వయకర్త సంతోషకుమారి, పర్యావరణ విద్యా సమన్వయకర్త తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజం కోసం స్వచ్ఛాంధ్ర

జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



గుడ్డ సంచులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసిందని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పేర్కొన్నారు. శనివారం జడ్పీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఐటీసీ సంస్థ అందజేసిన గుడ్డ సంచులు పంపిణీ చేశారు. సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 565.00 అడుగులు ఉంది. ఇది 244.14 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 67,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	113, 121, 132
చికెన్ విత్ స్కిన్(కిలో)	216.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	226.00

'ఆర్వీఆర్‌జేసీ' ప్రాజెక్ట్‌కు బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు(విద్య), జూలై 19(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పోటీల్లో ఆర్వీఆర్ జేసీ విద్యార్థికి ప్రతిష్టాత్మక అవార్డు లభించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ గణాంక శాఖ, మై గర్నమెంట్ సంయుక్తంగా డేటా ఎనలైజ్ హ్యాకథాన్ ఆన్‌లైన్ పోటీల్లో 2,650 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన 30 ప్రాజెక్ట్‌ల్లో కళాశాల డేటా సైన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థి పి. జయంత్ ప్రాజెక్టు నాలుగవ స్థానంలో నిలిచిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు, రూ.20 వేల నగదు అందుకున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడవిక్‌డైరెక్టర్లు అభినందనలు తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పు లిచింతల ప్రాజెక్టులో శనివారం 13.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,622 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.


కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ని సందర్శిస్తున్న జేసీ భార్గవ తేజ

ఈవీఎం గోడౌన్లపై నిరంతరం నిఘా ఉంచాలి

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోడౌన్ల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ తేజ ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం నెలవారీ తనిఖీలో భాగంగా ఈ నెలకు సంబంధించి కలెక్టరేట్ ఆవరణలోని గోడౌన్‌ను ఆయన శనివారం ఉదయం ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లీశ్వరితో కలిసి సందర్శించారు. ఈవీఎం గోడౌన్ వద్దకు వెళ్లి సీసీ టీవీ పని తీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రత చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బీ (సివిల్) ఈఈ హజరత్తయ్య, ఆర్ అండ్ బీ ఎలక్ట్రికల్ ఏఈ శ్రీరామమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాల్‌పై ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నాం

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

● రూ.71.50 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార సమయంలో రజక కమ్యూనిటీ హాలు నిర్మిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. గుంటూరు 45వ డివిజన్‌లో రజక కమ్యూనిటీ హాల్‌కు, రూ.20 లక్షలతో కొరిటెపాడు మహాప్రస్థానం నుండి ముత్యాల రెడ్డి నగర్ మెయిన్ రోడ్ వరకు దెబ్బతిన్న భాగానికి ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్, సీసీ రోడ్డు, రూ.21.50 లక్షలతో గౌతమి నగర్ ఆర్ లైన్‌లో రజక కాలనీ కమ్యూనిటీ హాల్ భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే గల్లా మాధవి శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో రూ.71.50 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, ఎన్నికల సమయంలో వాటికి సంబంధించిన హామీ ఇచ్చామని వాటిని నెరవేర్చామని చెప్పారు. కొరిటెపాడు మహా ప్రస్థానం నుంచి ముత్యాల రెడ్డి నగర్ మెయిన్ రోడ్డు వరకు రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, దానికి పరిష్కారం చూపామని చెప్పారు. కార్యక్రమంలో మద్దాలి వెంకటేశ్వరరావు, నూహన్ నజీర్, దుడిపి సాంబయ్య, షేక్ రఫీ, నాగులు మీరా,శంకర్,రామారావు, నాగరాజు, సంజీవ్ రావు, గుర్రం ప్రసాద్, మొవ్వ వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.


రజక కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళామాధవి

వీధి వ్యాపారులు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూలై 19(ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో వీధి వ్యాపారులు ప్రతి ఒక్కరూ నగర పాలక సంస్థ జారీ చేసే గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, గుర్తింపు కార్డు లేనిచో వీధి వ్యాపారానికి అనుమతించబడదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆఖరి అవకాశంగా నూతన గుర్తింపు కార్డుల దరఖాస్తుల స్వీకరణకు నేటి నుండి ఈ నెల 25 వరకు నగర నగర పాలక సంస్థ ప్రధాన, సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేనివారు నిర్దేశిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటికే గుర్తింపు కార్డుల సర్వే నగర పాలక సంస్థ నిర్వహించిందని, వీధి వ్యాపారాలు నిర్వహించే వ్యాపార సముదాయాల వద్దకు మెప్మా, సచివాలయ సిబ్బంది వచ్చి తప్పనిసరిగా సర్వే చేసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఆ విధంగా సర్వే కాని ప్రతి ఒక్క వీధి వ్యాపారి నగర పాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గుర్తింపు కార్డు పొందాలన్నారు.

ఉన్నత లక్ష్యాలతో భావి ఉపాధ్యాయులు ముందుకు సాగాలి

ఆర్వీఆర్ బీఈడీ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి

గుంటూరు (విద్య) జూలై 19 (ఆంధ్రజ్యోతి): భావి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని బీఈడీ కళాశాలలో బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన బోధనా అందించడంతో పాటు వారిని భావిభారత పౌరులుగా తయారు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య రవికుమార్, మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఈడీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.


విద్యార్థులతో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం

● మేయర్ రవీంద్ర ● నగరంలో ర్యాలీ, మానవహారం


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుంటూరులో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మునిసిపల్‌స్టేడియం నుంచి లాడ్జి సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ, స్టేడియంలో క్లాత్ వెండింగ్ మెషిన్ ప్రారంభ కార్యక్రమాల్లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) సుధేష్ణ సేన్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల విచ్చలవిడి వినియోగం వలన డ్రెయిన్లలో అడ్డుపడి మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడి ప్రజారోగ్యానికి భంగం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ సంచులను అందించే వెండింగ్ మెషిన్లను గాంధీ పార్క్, ఎన్టీఆర్ స్టేడియంల దగ్గర ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో 23 సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్‌ల్లో గుంటూరు నగరం స్థానం దక్కించుకోవడం ద్వారా నగరంలో స్వచ్ఛత పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. నగర సుందరీకరణ, స్వచ్ఛత సాధన ద్వారా నగర ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో కృషి చేసిన వారికి ఈనెల 21న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసే సభలో స్వచ్ఛ అచీవర్స్ పేరుతో పురస్కారాలు అందిస్తామన్నారు. డీఆర్ఎం సుధేష్ణసేన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఆ స్ఫూర్తితో గుంటూరు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో కూడా స్వచ్ఛతకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా, పర్యావరణ హిత వస్తువుల వినియోగానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. నగరంలో హరిత వాతావరణం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర సాధించుకోవచ్చని తెలిపారు.

తొలుత ఎన్టీఆర్‌స్టేడియంలో ఎమ్మెల్యే మాధవి జీఎంసీ ఏర్పాటు చేసిన రూ.20కే క్లాత్ బ్యాగ్ ఇచ్చే వెండింగ్ మెషిన్‌ని, అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లాడ్జి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, ప్రజలకు ఐటీసీ, మానవత సంస్థల సహకారంతో క్లాత్ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏడీఆర్ఎం రమేష్ కుమార్, సీనియర్ డీపీవో షహబాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో...

గుంటూరు మెడికల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి స్వచ్ఛ ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయ వినియోగంపై ఆరోగ్య సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డీపీవో సైమన్ రాజు, ఏవో కృష్ణకుమారి పాల్గొన్నారు. అదేవిధంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఓపీ విభాగంలో నిర్వహించిన స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, వైద్య సిబ్బంది చేత ప్రమాణం చేయించారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా జనపనారతో చేసిన సంచులు వాడాలని ఆయన ప్రజలను కోరారు.


ప్రమాణం చేయిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

● గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలో వ్యర్థాలను తొలగించారు. ఉద్యోగులతో కలిసి పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఇతర వ్యర్థాలను ఎక్కడికక్కడ తొలగించేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతగా గుర్తెరగాలని కోరారు. కార్యక్రమంలో డిపోలోని ఉద్యోగులు హాజరయ్యారు.

ఘనంగా కనపర్తి జన్మదిన వేడుకలు


కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, కూటమి నేతల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. టీడీపీ నేతలు, కార్యకర్తలు సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అధికా రంలో లేని అయిదు సంవత్సరాలు పార్టీ కోసం కనపర్తి ఎంతో కష్టపడ్డారని, అందుకు తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ఏ ఒక్కరినీ తాను నిర్లక్ష్యం చేయనని హామీ ఇస్తున్నానని అన్నారు. జిల్లా, నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు రోజుకి 18 గంటలు కష్ట పడుతుంటే, దాన్ని అడ్డుకునేందుకు జగన్ రెడ్డి 24 గంటలు ప్రయత్నిస్తున్నాడని మండి పడ్డారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ధైర్యంగా పోరాడటమే కాకుండా, కార్యకర్తలకు అండగా నిలిచిన వ్యక్తి కనపర్తి అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు మద్దిరాల మ్యానీ, వడ్రాణం హరిబాబు, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, ఎల్లావుల అశోక్ యాదవ్, కొమ్మినేని కోటేశ్వరరావు, నుకవరపు బాలాజి, ఆళ్ల హరి, పఠాన్ అస్మతుల్లా, షేక్ రహీం, నైజాం బాబు, ఖరీమా, పూసల శ్రీనివాస్, చంద్రగిరి బాబు, తదితర నేతలు కనపర్తిని అభినందించారు.

ఉద్యోగ కల్పనలో కూటమి ప్రభుత్వం అడుగులు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్


డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు యువతకు ఉద్యోగ కల్పనలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, యువతకు లక్షలాది ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించాలనే ధ్యేయంతో ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. దీని వలన రాష్ట్రంలోని చదువుకున్న యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరికి స్వయం ఉపాధి కల్పించి తమ కాళ్ళపై తాము నిలబడేలా కూటమి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో యువతకు ఉద్యోగ కల్పన చేయలేదని విమర్శించారు. ఏ ఒక్కరికి ఉద్యోగ కల్పన లేదన్నారు. నేటి కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల అమలుతో పాటు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తుందని చెప్పారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని తెలిపారు.

పది గంటల పని విధానాన్ని వ్యతిరేకించాలి : చల్లా

గుంటూరు(తూర్పు), జూలై 19(ఆంధ్రజ్యోతి): పది గంటల పని విధా నం అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని కార్మికులు వ్యతిరేకించాలని సీపీఐ సీనియర్ నాయకుడు చల్లా చిన ఆంజనేయులు అన్నారు. స్థానిక పాతగుంటూరులో శనివారం జరిగిన సీపీఐ సివిల్ శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికుల వ్యతిరేఖ విధానాలను ప్రభుత్వా లు వీడనాడాలని సూచించారు. నాయకులు కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, సురేష్ బాబు మాట్లాడుతూ 24న శారదా కాలనీలో నిర్వహించే సీపీఐ 25వ నగర మహాసభల్లో పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దానం, డేవిడ్, కేశనపల్లి కాంతారావు, సురేష్, బుజ్జి, నాగరాజు, పెద్దకోటేష్, జాన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేయర్ కోవెలమూడి రవీంద్ర, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరై పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో ఆయా విభాగాల్లో దాదాపు 400 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాయపాటి రంగబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ చంద్ర, శ్రీమాన్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, చందు, కసుకుర్తి హనుమంతురావు, కార్పొరేటర్ వరప్రసాదు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.600 కోట్ల బకాయిలు విడుదల చేస్తూ వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసిందని గుర్తు చేసుకున్నారు. నేటి వరకు ఏ విద్యార్థికి ఒక్క రూపాయి జమ కాలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యశ్వంత్, ప్రణీత్, అజయ్, శివ, గోపి పాల్గొన్నారు.

ఓబీసీ విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వర్తింపజేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం వర్తింపజేయాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక బ్రాడీపేట, ఓహోటల్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభలల్లో ఒబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆగస్టు 4, 5వ తేదీలలో నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సుజాను సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే శాసనసభ సమావేశాలలో బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లు 34 నుంచి 42 శాతంకు పెంచుతూ తీర్మానాన్ని ఆమోదించాలన్నారు. అనంతరం ఓబీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాసుల రాజా శ్రీధర్‌కు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోవిందు, సంజయ్ పాల్గొన్నారు.

'రంగ తరంగాలు' గేయాల సంపుటి ఆవిష్కరణ

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు రచించిన రంగ తరంగాలు గేయాల సంపుటిని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థలో ఎంతో మంది సాహితీ వేత్తలను ప్రోత్సహించటంపై ఆయన రంగారావును అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రావి అరుణ, యర్రగుంట్ల పాణిరావు, ఎస్.కనకదుర్గ, లంకా మాధవి, పెద్ది సాంబశివరావు, గడల శివప్రసాద్, పింగళి భాగ్యలక్ష్మి, ధనంజయరెడ్డి తదితరులున్నారు.

నిరర్థక ఆస్తులతో బ్యాంకుల ఆదాయం ఆవిరి

గుంటూరు(తూర్పు), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నిరర్థక ఆస్తులతో బ్యాంకుల ఆదాయం, లాభాలు ఆవిరైపోతున్నాయని జిల్లా ఉద్యోగ సంఘాల కార్యదర్శి బాషా అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ జాతీయం చేసి 56 వసంతాలు పూర్తైన సందర్భంగా స్థానిక హిందూ కళాశాల, యూనియన్ బ్యాంకు వద్ద శనివారం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జెండాను ఉద్యోగ సంఘ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ సలహాదారు కిషోర్ మాట్లాడుతూ బ్యాంకులను 1969న ఇదే రోజున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జాతీయం చేశారని గుర్తు చేసుకున్నారు. బ్యాంకుల ప్రైవేటీకరణతో దేశ ఆర్థిక భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ నాయకులు మురళి, షరీఫ్, పృథ్వీ, క్రాంతి, పి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మెక్కిన సొమ్మంతా కక్కిస్తాం!

▸ బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు: నిమ్మల



చోడవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో అక్రమాలతో జగన్ అండ్ కో లూటీ చేసిన రూ.40 వేల కోట్ల ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం కక్కించకుండా వదిలిపెట్టబోదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం అనకాపల్లి జిల్లా చోడవరానికి వచ్చిన ఆయన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇసుక, ఖనిజాలు, వనరుల దోపిడీతో పాటు, మద్యం వ్యాపారంలో కోట్లాది రూపాయలు స్వాహా చేసిన జగన్.. ఆ తప్పులకు శిక్ష తప్పదన్న భయంతోనే రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బనకచర్ల వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ ఉండదని తెలంగాణలోని రాజకీయ నాయకులు, మేధావులు, రైతులు, నీటి పారుదల రంగ నిపుణులు, జర్నలిస్టులు.. అందరికీ తెలుసన్నారు. అక్కడి రాజకీయ పార్టీల ఆధిపత్య పోరులో భాగంగానే బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలో ఏడాది పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని నిమ్మల తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 2027 డిసెంబరు నెలాఖరుకల్లా పోలవరాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం

▸ ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తెచ్చారు: మంత్రి గుమ్మడి

కొయ్యలగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది. ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఐదేళ్లు రాష్ట్రం అన్నింటా వెనుకబడింది' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో శనివారం ఆమె పాల్గొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ 'టీడీపీ ప్రభుత్వం వచ్చాక రూ.1,300 కోట్లతో రోడ్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాలను డోలి లేని ప్రాంతాలుగా చేయాలనే లక్ష్యంతో మరో రూ.1,000 కోట్లతో రోడ్లు నిర్మిస్తాం. రూ.146 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నాం' అని పేర్కొన్నారు.

జగన్‌వి విలువల్లేని రాజకీయాలు: అనిత

విజయనగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జగన్ 2019 నుంచి 2024 వరకు విలువల్లేని రాజకీయాలు చేయడం వల్లే అధఃపాతాళానికి వెళ్లారని హోంమంత్రి అనిత అన్నారు. గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజును శనివారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, అయ్యన్న, అశోక్ గజపతిరాజు వంటి వారిని లక్ష్యంగా చేసుకుని జగన్ కుతంత్రాలు చేశారన్నారు.

ఆంధ్రతో మా ప్రయాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

'తెలుగు ప్రకటన అద్భుతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ మీ వాహనాలకు అతిపెద్ద మార్కెట్. ఈ ప్రకటనను కూడా ప్రజలు తప్పకుండా ఇష్టపడతారు. అత్యాధునిక ఆటోమోటివ్ వ్యవస్థ, అతి పెద్ద మార్కెను ఉపయోగించుకోవడానికి మా రాష్ట్రంలో వాహన తయారీ పరిశ్రమ స్థాపనకున్న అవకాశాలను పరిశీలించండి. మీ బృందాన్ని స్వాగతించడానికి, మా వద్దనున్న అవధులులేని అవకాశాలను వివరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. లోకేశ్ సందేశానికి ఆనంద్ మహీంద్ర స్పందిస్తూ... 'ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఏపీ ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణం. ఇప్పటికే మా బృందాలు పలు రంగాలు.. సౌరవిద్యుత్, మైక్రో ఇరిగేషన్, పర్యాటకంలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాయి. మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది... ముందు ఏమి ఉందో చూద్దాం..!' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

తక్కువ ఖర్చుతోనే గ్రీన్ హైడ్రోజన్

ఏపీలో మూడు పరిశోధన క్లస్టర్లు.. ఏపీ అసోసియేషన్ ఏర్పాటవ్వాలి

▸ అమరావతి సమ్మిట్ డిక్లరేషన్

▸ రేపు ప్రభుత్వానికి నివేదన

▸ ఏపీలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన మరో సంస్థ



గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ ముగింపు రోజున చర్చల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిపుణులు

గుంటూరు/మంగళగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడానికి విస్తృతంగా పరిశోధనలు జరగాలని గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ అభిప్రాయపడింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజులు జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ శనివారం ముగిసింది. రెండో రోజు మేధావులు పలు అంశాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి, జాతీయ స్థాయిలో వలే గ్రీన్ హైడ్రోజన్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌ను నెలకొల్పడానికి, హరిత ఉదజని ఉత్పత్తి ఖర్చును సగానికి తగ్గించేందుకు నిరంతరం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు రాష్ట్రంలో కొనసాగించడానికి ఈ సదస్సులో డిక్లరేషన్ రూపొందించారు. ఆ డిక్లరేషన్‌ని సోమవారం ప్రభుత్వానికి నివేదించనున్నారు. సదస్సులో చర్చించిన అంశాలను ఎస్ఆర్ఎం గ్రూపు సంస్థల రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణ రావు వివరించారు. తొలి రోజు సీఎం సమక్షంలో జరిగిన రూ. 51 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలతో పాటు అమెరికాకు చెందిన సినర్‌జెన్ సీఈవో ప్రణవ్ తాంతి ఆంధ్రప్రదేశ్‌లో మరో 40 వేల టన్నుల సామర్థ్యం గల గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం తెలిపారని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చుని రూ. 400 నుంచి రూ. 200కు తగ్గించాలని, వచ్చే రెండు, మూడేళ్లలో హైడ్రోజన్‌తో నడిచే కారు, రైలుని వినియోగంలోకి తీసుకురావాలని డిక్లరేషన్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ-వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్‌కుమార్, నెడ్‌క్యాప్ ఏపీ ఎండీ కమలాకర్‌బాబు, సుజిత్ ఎంఎన్ఆర్ఈ నుంచి డాక్టర్ సుజిత్ పిళ్లై, మారం పార్థసారథి, సుజిత్ కల్లూరి పాల్గొన్నారు.

అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ



అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటుపై రెండో రోజు డిక్లరేషన్ ప్రవేశపెట్టడం జరిగింది. రెండు రోజుల సమ్మిట్‌లో ప్రముఖుల అభిప్రాయాలు, చర్చకు వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని డిక్లరేషన్‌ను రూపొందించాం. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆర్ అండ్ డీ ప్రతినిధులు, వివిధ సంస్థలు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు సమ్మిట్‌కు హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధి, వివిధ పాలసీలపై చర్చించారు. అమరావతికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ వస్తే రాజధాని ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

-డాక్టర్ పార్థసారథి (సమ్మిట్ కన్వీనర్, ఎస్ఆర్ఎం)

భవిష్యత్తులో శిలాజ ఇంధనాల కొరత



ప్రస్తుతం మనం వినియోగిస్తున్న శిలాజ ఇంధనాలు భవిష్యత్తులో దొరక్కపోవచ్చు. ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసుకోవాలి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, టెక్నాలజీ అభివృద్ధి, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. పంట వ్యర్థాలతో స్థిరమైన ఇంధన శక్తిని ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

- డాక్టర్ మల్లికార్జునరావు (సీఈవో, శక్తి ఫోటాన్ సొల్యూషన్స్)

కార్బన్ రహిత సమాజానికి దోహదం



కార్బన్ రహిత సమాజానికి గ్రీన్ హైడ్రోజన్ ఒక ఆశాజనకమైన మార్గం. గ్లోబల్ వార్మింగ్ విపత్తు నుంచి బయట పడాలంటే హైడ్రోజన్ ఇంధన వనరులను గణనీయంగా ఉత్పత్తి చేయాలి. ఇప్పుడున్న టెక్నాలజీతో గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకుంది. దాని స్టోరేజీ, ట్రాన్స్‌పోర్టేషన్, వనరుల వినియోగం కూడా ప్రధానం. ఈ అంశాలపై సదస్సులో నిపుణులు చర్చించారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. విశాఖపట్నం, కాకినాడలో త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.

- అనిల్‌కుమార్ (ఆర్ అండ్ డీ డీన్, తిరుపతి ఐఐటీ)

మున్సిపల్ కమిషనర్ పేరుతో వసూళ్లు!

వ్యాపారులకు క్యూఆర్ కోడ్ పంపి డబ్బులు స్వాహా

తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కేసులు నమోదు

నెల్లూరులో అరెస్టు చేసిన దర్గామిట్ట పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 19(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు, దోపిడీలతో రిస్కు అనుకున్నాడో ఏమో... కాలు కదల్చకుండా దర్జాగా నగదు దోచుకోవడానికి ప్రణాళిక వేశాడో ఓ ప్రబుద్ధుడు. ఏకంగా మున్సిపల్ కమిషనర్ అవతారం ఎత్తి, పన్ను బకాయిలు చెల్లించాలంటూ వ్యాపారులను బెదిరించి, దోచుకోవడం మొదలుపెట్టాడు. ఈ కేటుగాడిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్ఆర్ కడప జిల్లా బీ కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్‌చేసి వాణిజ్య పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసేవాడు. వారి మొబైల్ ఫోన్లకు తన బ్యాంకు ఖాతా క్యూఆర్ కోడ్ పంపి అందులో డబ్బులు వేయించుకునేవాడు. నెల్లూరుకు చెందిన ఫైర్‌ర్స్ యజమాని రియాజ్ బాషాకు గతనెల 17న నిందితుడు ఫోన్ చేశాడు. వారి సంస్థ పేరుపై రూ.2,100 మున్సిపాలిటీకి బకాయి ఉందని, వెంటనే తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి నగదు చెల్లించాలని ఆదేశించాడు. ట్రేడ్ లైసెన్స్ చెల్లించామని రియాజ్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో ఆయన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు చెల్లించారు. కొద్దిసేపటి తర్వాత నిందితుడు మళ్లీ ఫోన్ చేసి మరో రూ.1,200 చెల్లించాలని కోరాడు. దీంతో అనుమానం వచ్చిన రియాజ్ నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నెల్లూరులోని పొదలకూరు రోడ్డు వద్ద నిందితుడు బిల్లా నాగేశ్వరరావును అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రోశయ్య చెప్పారు. కాగా, నిందితుడిపై బీ కోడూరు, బద్వేలు, కడప, గుంతకల్, తెలంగాణలోని గద్వాలలో కేసులు నమోదయ్యాయి.

అతనికి బెయిల్ ఇవ్వలేం!


▸ యజమాని భార్యను హత్య చేసి.. శవంతో వాంఛ తీర్చుకున్న వ్యక్తి

▸ బెయిల్ నిరాకరించిన హైకోర్టు

▸ మృగంలా వ్యవహరించాడని వ్యాఖ్య

▸ బెయిల్ ఇస్తే సమాజంపై ప్రతికూల

▸ ప్రభావం పడుతుందన్న న్యాయస్థానం



అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఆసుపత్రి యజమాని భార్యను హత్య చేసి, అనంతరం ఆమె మృతదేహంతో లైంగిక వాంఛ తీర్చుకున్న వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి కేసులో బెయిల్ మంజూరు చేస్తే సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. యజమాని భార్యపై లైంగిక వ్యామోహంతో నిందితుడు మృగంలా వ్యవహరించాడని, ఆమె ప్రతిఘటించడంతో విషయం బయట పడుతుందని దారుణంగా హత్య చేశాడని కోర్టు తెలిపింది. అనంతరం, మృతదేహంతో కామవాంఛ తీర్చుకున్నాడని పేర్కొంది. దీనికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, వాస్తవాలను ట్రయల్ కోర్టు తేలుస్తుందని తెలిపింది. చాలాకాలం నుంచి జైలులో ఉన్నాడనే కారణంతో ఇలాంటి తీవ్రమైన కేసులో బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని తేల్చి చెప్పింది. నేరానికి పాల్పడిన విధానం, నేర తీవ్రత, సమాజంపై చూపించే ప్రభావం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు జిల్లా కావలిలో ఓ వైద్యుడు 15 ఏళ్లుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నిందితుడు నయన్ బిస్వాస్ ఈ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా చేరారు. యజమాని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న అతను 2024, డిసెంబరు 31 తెల్లవారు జామున యజమాని భార్యపై లైంగిక వాంఛ తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వాంఛ తీర్చుకున్నాడు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కావలి వన్‌టౌన్ పోలీసులు నయన్ బిస్వాస్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి ప్రాథమిక చార్జిషీట్ దాఖలు చేశారు. కారాగారంలో ఉన్న నిందితుడు బిస్వాస్ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

కూటమి ప్రభుత్వ కృషిని

ప్రజల్లోకి తీసుకెళ్లండి

▸ మాధవ్‌కు జేపీ నడ్డా దిశానిర్దేశం

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పీవీఎన్ మాధవ్‌కు దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మాధవ్, నడ్డాతో శనివారం ఢిల్లీలో భేటీ అయ్యారు. క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్ఠం చేయడం, రాష్ట్రాభివృద్ధికి కూటమి సర్కారు నిరంతరం శ్రమిస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని నడ్డా సూచించారు. సమష్టి కృషితో పార్టీని మరింత పటిష్ఠం చేస్తానని మాధవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కేరళలో పాట చిత్రీకరణ



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా157-వర్కింగ్ టైటిల్)' షూటింగ్ కేరళలో శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం కేరళలోని అందమైన లోకేషన్లలో చిరంజీవి, నయనతారపై పెళ్లి నేపథ్యంలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. 'కొన్ని కీలకమైన ఘట్టాలను కూడా ఈ షెడ్యూల్‌లో షూట్ చేస్తున్నాం, ఈనెల 23 నాటికి ఈ షెడ్యూల్ పూర్తవుతుంద'ని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

గాయపడిన షారుక్..

షూటింగ్‌కు బ్రేక్



సినిమా కోసం చెమటోడ్చే హీరోల్లో షారుక్ ఖాన్ ముందుంటారు. ప్రేక్షకులను అలరించడానికి మూడు దశాబ్దాలుగా ఆయన కృషి చేస్తూనే ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తెరపై షారుక్ చేసే సాహసాలు అబ్బురపరుస్తూంటాయి. డూప్ లేకుండా యాక్షన్ సీన్లలో పాల్గొనే షారుక్ తాజాగా 'కింగ్' చిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. ముంబైలోని గోల్డెన్ టుబాకో స్టూడియోలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ తీస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అయితే ఇది తీవ్రమైన గాయం కాదు, కండరానికి సంబంధించింది కనుక చికిత్స అవసరం అని అమెరికాకు ఆయన్ని తీసుకెళ్లారు. నెల రోజుల పాటు షారుక్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు వెల్లడించారు. దీంతో ఆగస్టు నెల వరకూ ఏకధాటిగా జరగాల్సిన 'కింగ్' షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చారు. షారుక్ కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత సెప్టెంబర్‌లో కానీ అక్టోబర్‌లో కానీ మళ్లీ షూటింగ్‌ను ప్రారంభిస్తామని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇండియాతో పాటు యూరప్‌లో కూడా 'కింగ్' షూటింగ్ జరపాలని ప్లాన్ చేశారు. షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ప్రధాన పాత్ర పోషిస్తున్న 'కింగ్' చిత్రాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు.



ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రం

- నిర్మాత ఏ.ఎం.రత్నం



'మొఘల్ సామ్రాజ్య చక్రవర్తుల కాలంనాటి కథే 'హరిహర వీరమల్లు'. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లాము. హరిహర అంటే విష్ణువు, శివుడు కలయిక. ఆ రెండు పేర్లు సూచించేలా వీరమల్లు అని పెట్టాము. 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప చిత్రం అవుతుంది' అని అన్నారు నిర్మాత ఏ.ఎం. రత్నం. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'హరిహర వీరమల్లు' ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తవడానికి బాగా ఆలస్యమవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్ విడుదలతో వారి అనుమానాలు పటాపంచలు అయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెబుతున్నా... 'హరిహర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది.
- సినిమాను మొదట రెండు భాగాలు అని అనుకోలేదు. సినిమా వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన సినిమాలు అలాగే ఉంటాయి. చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే..ఎక్కువ మందికి చేరువవుతుందని భావించాము. అలా చర్చలో కథ విస్తృతి పెరిగింది.
- 'ఖుషి, 'బంగారం' తర్వాత పవన్ కల్యాణ్‌తో చేసిన మూడో చిత్రమిది. పేరుకు మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 ఏళ్ల అనుబంధం ఉంది. పవన్ కల్యాణ్‌ని దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా.. ఓ నటుడిగా కంటే కూడా మంచి ఆశయాలున్న మనిషిగా ఆయనను నేను ఎక్కువగా ఇష్టపడతాను.
- మా అబ్బాయి అని చెప్పడం కాదు గానీ.. జ్యోతికృష్ణ దర్శకత్వ ప్రతిభ చూసి ఆశ్చర్యపోయాను. మేమందరం చూడని ఓ కొత్త కోణంలో ఈ కథని సిద్ధం చేశాడు. మన చరిత్రను ముడిపెడుతూ ఈ తరానికి చేరువయ్యేలా 'ఇండియానా జోన్స్' తరహాలో సినిమాని గొప్పగా మలిచాడు.

ఏపీలో 'హరిహర వీరమల్లు' టికెట్ ధర పెంపు

● 14 రోజులు అడిగిన మేకర్స్.. పది రోజులకే అనుమతి..

'హరిహర వీరమల్లు' టికెట్ ధరలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 24న థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమాకు 14 రోజుల పాటు అదనపు రేట్లకు అనుమతించాలని ప్రభుత్వానికి మేకర్స్ విన్నవించారు. పరిశీలించి పది రోజుల పాటు పెంపునకు అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 23 రాత్రి 9.30 గంటలకు సెకండ్ షో, 24వేకువ జామున 4గంటలకు బెనిఫిట్ షోలకు అనుమతి పెండింగ్‌లో పెట్టింది. పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక విడుదలవుతోన్న మొదటి సినిమా కావడంతో అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దిగువ తరగతి రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్ రూ.200 అదనంగా పెంచుకోవడానికి అనుమతి లభించడంతో సినిమా టిక్కెట్ల ధరలు సింగిల్ స్ర్కీన్‌లో బాల్కనీ రూ.250, మధ్య తరగతి రూ.150-190, మల్టీప్లెక్స్‌లలో రూ.350దాకా ఉండబోతున్నాయి.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

సందేశంతో రాజు గాని సవాల్



లెలిజాల రవీందర్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'రాజు గాని సవాల్'. రితికా చక్రవర్తి కథానాయిక. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మీ పిక్చర్స్ ద్వారా విడుదలకు సిద్ధమవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'నా జీవితంలో జరిగిన కొన్ని నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమిది' అని తెలిపారు. నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా టీజర్ చూశాం చాలా బావుంది. ఇప్పుడు ట్రైలర్ కూడా ఆకట్టుకుంటోంది. రవీందర్ కొత్తతరహా కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు.

సామ్రాజ్య టైటిల్‌తో



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ నెల 31న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. శనివారం చిత్ర బృందం హిందీ టైటిల్‌ను ప్రకటించింది. అక్కడ ఈ చిత్రాన్ని 'సామ్రాజ్య' పేరుతో హిందీలో విడుదల చేస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సంగీతం: అనిరుధ్




ఎస్. జే సూర్య కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. వీసీ ప్రవీణ్, బైజు గోపాలన్ కలసి నిర్మిస్తున్నారు. ప్రీతి అస్రాని కథానాయిక. ఇటీవలే చిత్రీకరణ మొదలైంది. శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గన్ పట్టుకొని, ప్రీతి అస్రానీని భుజాన ఎత్తుకున్న లుక్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఫిష్ వెంకట్‌కు ప్రముఖుల నివాళి




నటుడు ఫిష్ వెంకట్ శుక్రవారం రాత్రి మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి. పద్మారావు గౌడ్, నటి కరాటే కల్యాణి, కమెడియన్ రచ్చ రవి తదితరులు శనివారం ఉదయం అడ్డగుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అడ్డగుట్ట (ఆంధ్రజ్యోతి)







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మండల మర్డర్స్	హిందీ చిత్రం	జూలై 25
అమెజాన్ ప్రైమ్		
జస్టిస్ ఆన్ ట్రయల్	వెబ్‌సిరీస్	జూలై 21
టిన్ సోల్జర్	హాలీవుడ్ మూవీ	జూలై 23
రంగీన్	హిందీ సిరీస్	జూలై 25
జియో హాట్‌స్టార్		
సర్జామీన్	హిందీ చిత్రం	జూలై 25



ఈమధ్య కాలంలో రకరకాల వివాదాల్లో చిక్కుకున్న నటుల్లో రాజ్‌తరుణ్ ఒకరు. ఈ వివాదాలను పట్టించుకోకుండా ఆయన తన కెరీర్‌పైనే శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటు ఓటీటీల్లో, అటు సినిమాల్లో బిజీగా ఉంటున్నారు. గతంలో హిట్ అయిన ఆయన సినిమా 'కుమారి 21 ఎఫ్' ఇటీవల రీ-రిలీజై... మంచి కలెక్షన్లు రాబట్టింది. ఈ నేపథ్యంలో ఆయనతో 'నవ్య' ముఖాముఖి.

నిజ జీవితంలో చాలా ఇంట్రావర్ట్‌ని...

ఎలా ఉన్నారు? అన్ని గొడవల నుంచి బయటకు వచ్చినట్లేనా?


అన్నింటినుంచి బయటకు వచ్చేసా. ఈ మధ్య హైదరాబాద్ సుదర్శన్ థియేటర్‌లో 'కుమారి 21 ఎఫ్' చూడటానికి వెళ్లాను. ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తుంటే చాలా తృప్తిగా అనిపించింది. ఈ మధ్యకాలంలో నేను ఎక్కువగా బయటకు వెళ్లటం లేదు. ఈ తరహా అనుభవం కొత్తగా అనిపించింది.

మీరు ఎదుర్కొన్న గొడవలన్నింటిలో మీకు బాసటగా నిలిచిందెవరు?

అమ్మానాన్నలు, నా స్నేహితులతోపాటు సినిమాల పట్ల నాకున్న ప్రేమ నన్ను నడిపించింది. గొడవల వల్ల నేను, నా తల్లిదండ్రులు, స్నేహితులు... అందరం బాగా ఎఫెక్ట్ అయ్యాం. సినీనటుల జీవితంపై అందరికీ ఆసక్తి ఉంటుంది. వారి గురించి ఎలాంటి అపవాదు వచ్చినా వెంటనే నమ్మేస్తారు. నిజం బయటకు వచ్చే సమయానికి జరిగాల్సిన డ్యామేజి జరిగిపోతుంది. నా విషయంలోను అదే జరిగింది. అయితే నేను మీడియాలో రాసిన న్యూస్ చదవలేదు. టీవీల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు చూడలేదు. నా స్నేహితులే వాటిని చూసేవారు. ఏం జరుగుతోందో చెప్పేవారు. వాస్తవానికి నిజ జీవితంలో కూడా నేను చాలా ఇంట్రావర్ట్‌ని. షూటింగ్ లొకేషన్‌కు వెళ్లిన వెంటనే ఎక్స్ట్రావర్ట్‌గా మారిపోతా. నాకు సంబంధించిన గొడవల విషయంలో నేను ఇంట్రావర్ట్‌గానే ఉండిపోయాను.

మన వాళ్లు ఓటీటీకి తగినట్లుగా సినిమాలు తీస్తున్నారా?

ఇంకా ఓటీటీ లాంగ్వేజ్ పూర్తిగా తెలియలేదు. 'ఓటీటీలలో బూతులు వాడచ్చు. శృంగారం చూపించవచ్చు' అనుకొని సినిమాలు తీసేవాళ్లు ఉంటారు. మన దగ్గర హాలీవుడ్ డైరక్టర్ల మాదిరిగా నేరుగా ఓటీటీకి సినిమాలు తీసే వారు తక్కువ. పెద్ద డైరక్టర్లు ఓటీటీ కోసం సినిమాలు తీయటం మొదలుపెడితే చాలా మార్పులు వస్తాయి.



గొడవల ప్రభావం సినిమాలపై ఉందా? ఇప్పుడు ఏ ప్రాజెక్టులు చేస్తున్నారు?

ప్రభావం అస్సలు లేదండి. నేను నా సినిమాల బిజీలోనే ఉన్నాను. 'రామ్‌భజ రంగ్' అనే సినిమా పాటలు తప్ప మిగిలినదంతా పూర్తయిపోయింది. 'పాంచ్ మినార్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఒక ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం 'చిరంజీవ' అనే డైరెక్ట్ ఫిల్మ్ చేశాను. అది కూడా విడుదల కు సిద్ధంగా ఉంది. 'కూర్మావతారం' అనే సినిమా జరుగుతోంది. వీటితో పాటుగా తమిళ్‌లో... ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నా. ఇలా ప్రస్తుతం ఈ సినిమాల బిజీలో ఉన్నా.

ఓటీటీ వల్ల ప్రేక్షకుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందా?

కచ్చితంగా వచ్చింది. ఒకప్పుడు సినిమా చూడాలంటే డబ్బులు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. నా చిన్నప్పుడు డీవీడీలు రెంట్‌కు తీసుకొని చూసేవాళ్లం. ఒక్క రోజు లేట్ అయినా అదనంగా డబ్బులు కట్టాల్సి వచ్చేది. అందువల్ల దీక్ష పట్టినట్లు సినిమాను చూసేసేవాళ్లం. ఓటీటీ వచ్చిన తర్వాత ఇలాంటి సమస్యలు తప్పాయి. ప్రపంచంలోని రకరకాల సినిమాల మన ముందుకే వస్తున్నాయి. దీనివల్ల ప్రేక్షకుల జడ్జిమెంట్‌లో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా నటీ నటులకు ఇది ఒక అగ్నిపరీక్ష లాంటిది. ఈ మధ్య 'టూరిస్ట్ ఫ్యామిలీ' అనే సినిమా చూశాను. అద్భుతమైన ఎమోషన్స్ ఉన్న సినిమా. ఓటీటీలో చూసి, మళ్లీ థియేటర్‌లో కూడా చూశా. మా అమ్మానాన్నలను తీసుకువెళ్లి చూపించా.

ఓటీటీల వల్ల థియేటర్లకు రావటం లేదనే వాదన నిజమంటారా?

అలా ఉండదు. నా ఉద్దేశంలో సినిమా బావుంటే చూడటానికి వస్తారు. లేకపోతే రారు. అయితే ఒకప్పుడు సినిమా యావరేజ్‌గా ఉన్నా చూసేసేవారు. కానీ ఇప్పుడు సినిమా చాలా బావుంటే తప్ప థియేటర్‌లో చూడటం లేదు. అంతేకాదు... ఓటీటీకి, మామూలు సినిమాకు మధ్య తేడా ఉంది. ఓటీటీలో ఇంటర్వెల్ ఉండదు. దీనివల్ల దర్శకుడి మీద ఒత్తిడి ఉండదు. కథను తనకు నచ్చినట్లు చెప్పగలుగుతాడు. సినిమాలో అయితే మొదటి సీన్ నుంచి దర్శకుడు ప్రేక్షకులను ఇంప్రెస్ చేయటానికి ప్రయత్నించాలి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఒకప్పుడు వేడి వేడి ఫిల్టర్ కాఫీ తాగితే ఆ మజానే వేరు అనుకొనేవారు. ఇప్పుడు ఆ ఫిల్టర్ కాఫీ మాత్రమే కాదు.. రకరకాల చల్లటి కాఫీలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. ఈ కాఫీలను తయారుచేయటానికి అనువైన కాఫీ గింజలు కూడా మన దేశంలో లభిస్తున్నాయి. కాఫీ ప్రేమికుల కోసం ప్రపంచంలో ఉన్న రకరకాల కాఫీలను అందించటానికి దక్షిణభారత దేశంలో తొలిసారి స్టార్‌బక్స్ హైదరాబాద్‌లో ఒక ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ప్రారంభించింది. ఇక్కడ దొరికే కొన్ని రకాల కాఫీల తయారీ ప్రక్రియలో చెఫ్ నిఖిత కూడా పాలుపంచుకున్నారు. తాను తయారుచేసిన కాఫీల వెనకున్న కథను ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

రుచులు మారుతున్నాయి





కాఫీ అంటే చాలా మందికి ఫిల్టర్ కాఫీనే కదా... ఇలా రకరకాల కాఫీల ఆలోచన ఎలా వచ్చింది?

తరాలు మారుతున్న కొలది రుచులు మారతాయి. ఒక పదార్థాన్ని మనం వండేటప్పుడు అనుసరించే ప్రక్రియలు మారతాయి. కాఫీనే ఒక ఉదాహరణగా తీసుకుందాం. మొదట్లో కాఫీ గింజలను గుండగా చేసి.. దానిని వేడి నీళ్లలో ఉడికించి తాగేవారు. ఆ తర్వాతి కాలంలో పాలు, పంచదార కలిపి తాగటం మొదలుపెట్టారు. ఇప్పుడు రకరకాల పాలను కలుపుతున్నారు. అంటే కాఫీని తయారుచేసే ప్రక్రియలోను.. దానిని తాగే తీరులో మార్పు వచ్చినట్లే కదా! ఒకప్పుడు కాఫీని వేడిగా మాత్రమే తాగేవారు. ఇప్పుడు కోల్డ్ కాఫీ కూడా తాగుతున్నారు. ఇలాంటి మార్పులు జరుగుతున్న సమయంలో ఈ కాఫీకి అదనపు రుచులు చేరిస్తే బావుంటుందనే ఆలోచనతో కొత్త తరహా కాఫీలు తయారుచేశాం. ఇప్పటి దాకా మేము చేసిన ప్రయత్నాలకు మంచి ఆదరణ లభించింది. కొత్త కాఫీలకు ఆదరణ లభిస్తుందనే నమ్మకం కూడా ఉంది.

బెల్లం, జామకాయ, మిరపకాయ, షికెన్‌జీ... ఈ రుచుల్లో కాఫీ బావుంటుందా?

మీరు చెప్పినవన్నీ మన చిన్ననాటి జ్ఞాపకాలు. జామకాయను కారం, ఉప్పు వేసుకొని తినని పిల్లలు ఉండరు. ఉత్తరభారత దేశంలో షికన్‌జీని ఇంటికి వచ్చిన వారందరికీ షర్బత్ రూపంలో ఇస్తారు. కర్ణాటకలో పానకం చాలా ఫేమస్. వీటికి కాఫీ టేస్ట్ చేరిస్తే ఎలా ఉంటుందనేదే ఆలోచన. వీటిని కొత్త తరం వారు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం నాకు ఉంది. కాలంతో పాటుగా రుచులు మారుతున్నాయి. మన వాళ్లు ఇతర దేశాలకు వెళ్లి అక్కడి రుచులను ఆదరిస్తున్నారు. ఉదాహరణకు కోల్డ్ కాఫీనే తీసుకుందాం. గతంలో మన దగ్గర కోల్డ్ కాఫీ తాగే వారు తక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి ఒక కారణం- చాలా మంది విదేశాలకు వెళ్లి అక్కడ కోల్డ్ కాఫీని తాగటం. అయితే ఇప్పటికీ ఫిల్టర్ కాఫీని ఆస్వాదించేవారు ఎంతో మంది ఉన్నారు. వారికి కాఫీ ఒక జ్ఞాపకం. ఎవరిదాకానో ఎందుకు.. మా అమ్మ వేడి ఫిల్టర్ కాఫీనే తాగుతుంది. చల్లారితే తాగదు. నేను శీతాకాలంలో వేడి కాఫీ తాగుతా! వేసవిలో చల్లటి కాఫీ తాగుతా. పైగా కొంత తాగి కొంత దాచుకుంటా! వేడి కాఫీ తాగేవారికి ఈ సౌలభ్యం ఉండదు.

చెఫ్‌గా మీ అనుభవాలేమిటి?

చెఫ్ జీవితం అంత సులభం కాదు. ప్రతి రోజు కొత్తదనం కోసం ఆలోచించాలి. అదే సమయంలో కస్టమర్ల రుచి కూడా మనకు చాలా ముఖ్యం. చాలా సందర్భాలలో మనకు నచ్చింది..కస్టమర్లకు నచ్చాల్సిన అవసరం లేదు. అందువల్ల కస్టమర్లకు ఎలా ఇష్టమో అలాగే వండాలి. నేను పేస్ట్రీ చెఫ్‌ను. అంటే కేక్‌లు, డిజర్ట్ తయారుచేస్తారు. మనకు పాశ్చాత్యులే కేకుల తయారీని నేర్పారు. రకరకాల మిఠాయిల తయారీ మనకు ఎప్పటి నుంచో తెలుసు. ఈ మధ్యకాలంలో ఈ మిఠాయిలను కూడా సృజనాత్మకంగా తయారుచేస్తున్నారు. ఈ విధంగానే కేక్‌ల విషయంలో మేము సృజనాత్మకంగా ఉండాలి.

మొక్కలు ఆరోగ్యంగా ఇలా...

మనం సాధారణంగా నర్సరీల నుంచి మొక్కలు తెచ్చుకుని కుండీల్లో నాటుకుంటూ ఉంటాం. మొదట బాగానే ఉన్నప్పటికీ క్రమంగా మొక్కలు వాడిపోవడం, ఎండిపోవడం చూస్తూ ఉంటాం. అలా జరగడానికి కారణాలతోపాటు మొక్కలను జాగ్రత్తగా ఎలా కాపాడుకోవాలో తెలుసుకుందాం...



- వర్షాకాలంలో మొక్కలకు ఎక్కువగా తెగుళ్లు, చీడలు పడుతూ ఉంటాయి. అందుకే తరచూ మొక్కలను గమనిస్తూ ఉండాలి. ఆకుల మీద రంధ్రాలు, గుడ్లు, కొమ్మలపై పురుగులు, గూళ్లు కనిపిస్తే ఆ భాగాలను వెంటనే కత్తిరించాలి. నీళ్లలో వేప నూనె లేదా బేకింగ్ సోడా కలిపి పిచికారీ చేయాలి. మొక్కలకు బాగా ఎండ తగిలేలా చూసుకోవాలి.
- మొక్క సరిగా ఎదగక పోయినా, ఆకులు వెంట వెంటనే పసుపు రంగులోకి మారిపోతున్నా తగిన పరిమాణంలో నైట్రోజన్ లభించడంలేదని అర్థం. వెంటనే మట్టిలో ఆవుపేడ, కాఫీ గింజలు, సేంద్రీయ ఎరువులు కలిపితే ప్రయోజనం ఉంటుంది. ఒక్కోసారి ఆకులు తెల్లగా మారుతుంటాయి. అలాంటప్పుడు కుండీలను ఎండలో పెడితే సమస్య తీరుతుంది.
- నీరు సరిపోకపోతే ఆకులు ఎండిపోయి పెళుసుగా మారతాయి. మొక్కల స్వభావాన్ని బట్టి రోజూ కుండీల్లో నీళ్లు పోస్తూ ఉండాలి.
- ఆకుల మధ్యలో ఉండే ఈనెలు పసుపు రంగులోకి మారితే మొక్కలకు మెగ్నీషియం, ఇతర పోషకాలు అందడంలేదని తెలుసుకోవాలి. అలాంటప్పుడు కుండీలో ఎప్సమ్ సాల్ట్ లేదా ఆలుగడ్డ పొట్టు, తేలికపాటి ఎరువులు కలిపితే సరిపోతుంది.
- కొమ్మలు ఎండిపోతూ ఆకుల అంచులు గోధుమ రంగులోకి మారుతుంటే మొక్కలకు పోటాషియం కావాలని గుర్తించాలి. మొక్కల మొదట్లో అరటి పండు తొక్కలు, కోడి గుడ్డు పెంకులు వేసి మట్టిని కదుపుతూ ఉండాలి.
- ఆకులు ఊదా రంగులోకి మారుతుంటే వేర్లు బలహీనమవుతున్నాయని తెలుసుకోవాలి. కోడిగుడ్డు పెంకులు, కూరగాయ తొక్కలను మట్టిలో కలుపుతూ ఉంటే మొక్కలు బలంగా పెరుగుతాయి.



పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి నాయకత్వ లక్షణాలు ఉపకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే వీటిపై అవగాహన కల్పించడం మంచిదంటున్నారు. ఇందులో భాగంగా పిల్లలకు తల్లిదండ్రులు ఎలాంటి శిక్షణ అందించాలో తెలుసుకుందాం...

నాయకత్వ లక్షణాలతో ఆత్మవిశ్వాసం

- చేసే ప్రతి పనిలో పిల్లలను భాగస్వాములుగా చేయాలి. బజారు నుంచి సరుకులు తేవడం, డబ్బులు ఇచ్చి పుచ్చుకోవడం, కరెంట్ తదితర బిల్లులను ఆన్‌లైన్లో కట్టడం, హోటల్‌కి వెళ్లినప్పుడు ఆహారాన్ని ఆర్డర్ చేయడం, గ్యాస్ బుక్ చేయడం లాంటి పనులను పిల్లలకు అప్పజెప్పాలి. వివిధ సందర్భాల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో చేసి చూపించాలి. దీంతో బాధ్యత, క్రమశిక్షణ, పనులను పూర్తిచేసే నేర్పరితనం అలవడతాయి.
- వారికంటే చిన్నవారైన తమ్ముళ్లు, చెల్లెళ్లను జాగ్రత్తగా చూసుకోవడం, దగ్గరుండి హోంవర్క్ చేయించడం, పెద్దవారైన అక్కలు, అన్నలకు సహాయం చేయడం లాంటివి చెప్పి చేయించాలి. దీనివల్ల పిల్లలు తెలియకుండానే నాయకులుగా ఎదుగుతారు.
- ఇంటిని శుభ్రం చేయడం, తోటపని, కూరగాయలు కోయడం, బడికి వెళ్లేముందు బాక్సులు సర్దడం, వాటర్ బాటిల్స్ నింపడం లాంటి పనులు నేర్పించాలి. వీటివల్ల పిల్లలకు బాధ్యతగా ప్రవర్తించడం అలవాటవుతుంది.
- మీవల్ల ఏదైన పొరబాటు జరిగినప్పుడు దాన్ని ఒప్పుకోవాలి. అప్పుడే తప్పులు, పొరబాట్లు జరగడం కూడా సహజమే అన్న అంశం పిల్లలకు అర్థమవుతుంది. నేర్చుకుంటూనే ఎదగాలని తెలుసుకుంటారు.
- సంగీతం, నృత్యం, ఆటలు, రచనా వ్యాసాంగం... ఇలా దేనిలో ఆసక్తి ఉందో సూటిగా తెలిపేలా ప్రోత్సహించాలి. దీనివల్ల నేరుగా అభిప్రాయాన్ని తెలపడం, మాట్లాడే నైపుణ్యం, మానసిక ధైర్యం లాంటివి పిల్లలకు అలవడతాయి.



సంప్రదాయం





మేలిముసుగుతో మనోహారంగా

మేలిముసుగు అనేది రాణితనానికి చిహ్నం. సంప్రదాయానికి ప్రతీక. అందుకే మేలిముసుగు లేకుండా పెళ్లికూతురి అలంకరణ పూర్తికాదు. యువరాణిలా పెంచుకున్న తమ కూతురిని మేలిముసుగులో చూసి మురిసిపోతుంటారు తల్లిదండ్రులు. ఇలా వివాహం, సీమంతం, బిడ్డను ఉయ్యాలలో వేయడం లాంటి సంప్రదాయ వేడుకల్లో మేలిముసుగుకు ప్రత్యేక స్థానం ఉంది. పూర్వకాలం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ సంప్రదాయం.... ఎప్పటికప్పుడు సరికొత్త మార్పులు సంతరించుకుంటూ యువతులను, మహిళలను ఆకర్షిస్తోంది.

మేలిముసుగు ఎందుకు?

వివాహ వేడుకలో వధువుకు మేలిముసుగు ధారణ తప్పనిసరి. పలుచగా తేలికగా ఉండే అందమైన చున్నీ లేదా ఓణీని వధువు తలపై నుంచి భుజాల మీదుగా జాలువారేలా అమరుస్తారు. ఇది ఆమె గౌరవానికి, దర్పానికి, వినయానికి, సౌశీల్యానికి గుర్తుగా నిలుస్తుంది. వివాహ సమయంలో కలిగే భయం, బెరుకు, దుఃఖం లాంటి భావోద్వేగాలను దాచిపెడుతుంది. పెద్ద వారి పట్ల పూజనీయత, వారినుంచి ఆశీస్సులు కోరే వినమ్రతను సూచిస్తుంది.

ట్రెండీగా ఇలా...

- మేలిముసుగు కోసం పారదర్శకంగా మెరిసే వస్త్రాన్ని ఎంచుకోవాలి. టిష్యూ, ఆర్గంజా వస్త్రాలతో తయారుచేసినవాటిని యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పెళ్లి చీర, బ్లౌజ్‌లకు మ్యాచ్ అయ్యేలా ఎంపిక చేసుకుంటున్నారు. చీరకు వెడల్పాటి పెద్ద అంచు ఉంటే దానికి సరిపోలేలా చూసుకుంటున్నారు. మేలిముసుగు ఎంత పలుచగా ఉంటే అంత అహ్లాదకరంగా కనిపిస్తుంది. రంగుల కలయికలా కాకుండా ఒకే రంగులో ఉంటే మరింత శోభనిస్తుంది. పొడవుగా నేలను తాకే మేలిముసుగు మీద వధూవరుల పేర్లు, చిన్న చిన్న పూలు, నక్షత్రాలు, చుక్కలు ఎంబ్రాయిడరీ చేసి అందుబాటులోకి తెస్తున్నారు. తళతళ మెరిసే తెల్లని రాళ్లను అతికించి సరికొత్త మేలిముసుగులను రూపొందిస్తున్నారు. రాత్రి సమయంలో వివాహం ముహూర్తం ఉన్న యువతులు వీటిని ఎంపిక చేసుకుంటున్నారు. అచ్చం బంగారంలా మెరిసే మేలిముసుగు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది.

ఎలా ఎంచుకోవాలంటే...

- మేలిముసుగు తయారుచేసే వస్త్రం మందంగా ఉండకూడదు. వెడల్పాటి లేసులు, భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లు, జర్దోసి వర్క్‌లు ఉండకూడదు. వీటి వల్ల మేలిముసుగు బరువు పెరుగుతుంది. ధరించినప్పుడు భారంగా అనిపిస్తుంది. పలుచగా, మెత్తగా, జాలువారేలా ఉండే మేలిముసుగులను మాత్రమే ఎంచుకోవాలి.
- ఛాయ తక్కువగా ఉన్నవారు నెట్టెడ్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన మేలిముసుగును ధరిస్తే బాగుంటుంది. చీరకు భిన్నంగా ఉన్న రంగును ఎంచుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తారు.
- మంచి ఛాయతో ఉన్నవారు చీర రంగుతో మ్యాచ్ అయ్యే వాటిని ధరించవచ్చు.
- నేలను తాకుతూ ఆకర్షణీయమైన రంగులో మెరిసే మేలిముసుగు అందరికీ చక్కగా నప్పుతుంది.



• ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749

బిన్నీకి 70 ఏళ్లు దాటినా..

పదవిలో కొనసాగేనా?

- బీసీసీఐ చీఫ్ మార్పుపై ఉత్కంఠ!
- పార్లమెంట్‌లో చర్చకు రానున్న కొత్త క్రీడాబిల్లు
- బిల్లు ఆమోదం పొందితే మళ్లీ రోజర్‌కు చాన్స్?



న్యూఢిల్లీ: బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి శనివారంతో 70 ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ఠ వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడవుతాడు. ఈ నేపథ్యంలో.. సెప్టెంబరులో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం (ఏజీఎం) వరకు అతడు కొనసాగుతాడా? లేదా ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి తప్పుకొంటాడా? అనే విషయమ్మై ఉత్కంఠ కొనసాగుతోంది. అంతేకాకుండా జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే అవకాశం కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందితే.. జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లకు అన్నింటికీ ఈ నిబంధన వర్తించనుంది. బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో.. ఆ చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల్లో కూడా ఎక్కడా వయో పరిమితులు విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో ఐదేళ్లు కొనసాగవచ్చు. ఇదే విషయమ్మై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్టు తెలుస్తోంది. మరోవైపు, బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో మూడేళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చే వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలంటున్నారట.

క్వార్టర్స్‌కు యువ భారత్

ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్

సొలో (ఇండోనేసియా): ఆసియా బ్యాడ్మింటన్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-డిలో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 110-83తో యూఏఈ జట్టును ఓడించింది. దీంతో వరుసగా రెండు విజయాలతో భారత్ క్వార్టర్స్ బెర్త్ ఖరారు చేసుకుంది.

అర్జున్ పరాజయం

లాస్ వెగాస్: ఫ్రీ స్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్‌లో సెమీఫైనల్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి కథ ముగిసింది. శనివారం జరిగిన సెమీస్‌లో అర్జున్ 0-2తో అమెరికా గ్రాండ్‌మాస్టర్ లెవోన్ అరోనియన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో సెమీస్‌లో హన్స్ మోక్ నీమన్ చేతిలో ఫాబియానో కరువాన ఓడాడు. ఫైనల్లో అరోనియన్‌తో నీమన్ తలపడనున్నాడు. కాగా, 3 నుంచి 8 స్థానాల కోసం జరిగిన పోరులో విన్సెంట్ కీమర్‌పై ప్రజ్ఞానంద 1.5-0.5తో గెలిచాడు.



తొలి గేమ్‌లో హంపి గెలుపు

మహిళల చెస్ వరల్డ్‌కప్ క్వార్టర్స్

బటూమి జార్జియా): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల వరల్డ్‌కప్ సెమీఫైనల్‌కు అర పాయింట్ దూరంలో నిలిచింది. శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ తొలి గేమ్‌లో చైనా క్రీడాకారిణి యుక్సిన్ సాంగ్‌పై హంపి విజయం సాధించింది. తెల్లపావులతో ఆడిన హంపి 53 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆట కట్టించింది. ఆదివారం జరిగే రెండో గేమ్‌ను డ్రా చేసుకొన్నా చాలు.. హంపికి సెమీస్ బెర్త్ ఖరారవుతుంది. కాగా, భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ మొదటి గేమ్ డ్రాగా ముగిసింది. ఇక, మరో క్వార్టర్స్ తొలి గేమ్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ జోంగి టాన్ (చైనా)తో వైశాలి పాయింట్ పంచుకొంది. ఇక, క్వార్టర్స్‌లో హారిక, దివ్య తలపడుతుండడంతో భారత్ తరఫున ఒకరు సెమీస్ చేరడం ఖాయమైంది.

మూడో నెంబర్

మ్యూజికల్ చైర్!







(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ఓటమి నేపథ్యంలో భారత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో మూడో నెంబర్ స్థానంపై మరోసారి చర్చ మొదలైంది. గతంలో దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్, అనంతరం చటేశ్వర్ పుజార నెం.3 స్థానాన్ని సమర్థవంతంగా భర్తీ చేశారు. అయితే పుజార జట్టులో స్థానం కోల్పోవడంతో కొంతకాలంగా కీలకమైన మూడో నెంబర్‌లో పలువురు ఆటగాళ్లను పరీక్షిస్తున్నారు. ఒకవిధంగా ఈ స్థానం 'మ్యూజికల్ చైర్'గా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇంగ్లండ్‌తో ఇప్పటివరకు జరిగిన మూడు టెస్టుల్లో ఇద్దరు బ్యాటర్లను ఆ స్థానంలో పరిశీలించారు. మొదటి టెస్టులో సాయి సుదర్శన్‌ను బరిలో దింపారు. తన అరంగేట్ర టెస్టు (లీడ్స్) అయిన ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సుదర్శన్ డకౌట్ కాగా, అతను రెండో ఇన్నింగ్స్‌లో (30 పరుగులు)నూ ఆకట్టుకోలేకపోయాడు. భారత జట్టు ఘన విజయం సాధించిన బర్మింగ్‌హామ్ రెండో టెస్టులో సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్‌ను మూడో నెంబర్‌లో పంపారు. 31, 26 స్కోర్లతో నాయర్ తన పునరాగమనానికి న్యాయం చేయలేకపోయాడు. ఇక ప్రతిష్ఠాత్మక లార్డ్స్ టెస్టులోనూ నాయర్ (40, 14) విఫలమయ్యాడు. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్న భారత్..రేస్‌లో నిలవాలంటే ఈనెల 23 నుంచి జరిగే నాలుగో టెస్టులో గెలిచి తీరాల్సిందే. ఈక్రమంలో మూడో నెంబర్ బ్యాటర్ భారీగా పరుగులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవంగా..కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ స్థానంలో ఆడాలని భావించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు జరగడంతో కేఎల్ రాహుల్ మూడో నెంబర్‌లో దిగాడు. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఆడాలని గిల్ నిర్ణయించుకోవడంతో..మూడో నెంబర్ బ్యాటర్‌కోసం సెలెక్టర్లు మరోసారి వెతుకులాట ప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీమిండియాకు సుదీర్ఘ కాలం పాటు ఈ స్థానంలో ప్రాతినిధ్యం వహించాల్సిన ఆటగాడిని కనుగొనడం ఆషామాషీ కాదు. గతంలో మూడో నెంబర్‌లో ఆడిన బ్యాటర్లు నాటి కెప్టెన్లకు ఎంతో ఊరట నిచ్చారు. సచిన్‌కు ద్రవిడ్, కోహ్లీకి పుజార అండగా నిలిచారు. ఇప్పుడు గిల్‌కు కూడా అలాంటి భరోసా ఇవ్వాల్సిన బ్యాటర్ అవసరం. ఈ క్రమంలో సుదర్శన్, నాయర్‌లను పరీక్షించారు. వారు రాణించకపోవడంతో ఇంగ్లండ్‌తో మిగిలిన టెస్టులకు ఇప్పుడు మళ్లీ వెతుకులాట మొదలైంది. మూడో నెంబర్ బ్యాటర్ 30, 40 రన్స్ చేయడం కాదని, శతకాలు సాధించాల్సిందేనని అలనాటి ఆటగాడు ఫరూక్ ఇంజనీర్ అంటారు. ఈ స్థానంలో ఆడిన దిలీప్ వెంగ్‌సర్కార్ లార్డ్స్‌లో ఏకంగా 3 సెంచరీలు కొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మరి కీలకమైన నాలుగో టెస్టులో మూడో నెంబర్ బ్యాటర్ విషయంలో జట్టు యాజమాన్యం తీసుకొనే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది.

ఇంగ్లండ్ నిలిచింది

రెండో వన్డేలో భారత్ ఓటమి

లండన్: భారత మహిళలతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు తమ ఆశలను సజీవంగా నిలుపుకొంది. కచ్చితంగా గెలిచి తీరాల్సిన రెండో వన్డేలో నాట్ సివర్ సేన ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 8 వికెట్ల తేడాతో గెలిచింది. ప్రస్తుతం సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో నిలవగా.. ఆఖరి మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. వర్షం కారణంగా నాలుగు గంటలు ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌ను 29 ఓవర్లకు కుదించగా.. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. మంధాన (42), దీప్తి శర్మ (30 నాటౌట్) మాత్రమే రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు 3.. ఎర్లాట్, లిన్సే స్మిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో మరోసారి వర్షం ఆటంకం కలిగించింది. దీంతో లక్ష్యాన్ని 24 ఓవర్లలో 115 రన్స్‌గా నిర్ణయించారు. ఓపెనర్లు అమీ జోన్స్ (46 నాటౌట్), బ్యూమంట్ (34)ల ధాటికి ఇంగ్లండ్ 21 ఓవర్లలో 116/2 స్కోరుతో మ్యాచ్‌ను ముగించింది.



ప్రియకు రజతం

బుడాపెస్ట్ రెజ్లింగ్‌లో మనీషాకు కాంస్యం

న్యూఢిల్లీ: భారత మహిళా రెజ్లర్లు ప్రియ, మనీషా.. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరుగుతున్న ర్యాంకింగ్ సిరీస్‌లో పతకాలు కొల్లగొట్టారు. శనివారం జరిగిన 76 కిలోల విభాగంలో ప్రియ రజతం సాధించగా.. 62 కిలోల కేటగిరిలో మనీషా కాంస్య పతకం దక్కించుకొంది. ఫైనల్లో ప్రియ 3-4తో బ్రెజిల్ రెజ్లర్ తమిరెస్ మార్టిన్స్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఇక, కాంస్యం పోరులో క్రిస్టీనాను మనీషా చిత్తుచేసి పతకం అందుకుంది.



'స్విస్' ఆట కట్టు స్పెయిన్ సెమీస్‌కు

మహిళల యూరో కప్

గోల్ కొట్టిన ఆనందంలో బొన్మాటి

బెర్న్ (స్విట్జర్లాండ్): మహిళల ఫుట్‌బాల్ యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో స్విట్జర్లాండ్ జోరుకు బ్రేక్ పడింది. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ చాంపియన్ స్పెయిన్ 2-0తో ఆతిథ్య స్విట్జర్లాండ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. తొలి అర్ధభాగం ఇరుజట్లూ హోరాహోరీగా పోరాడడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. ఇక, ద్వితీయార్ధంలో ప్రత్యర్థిపై పట్టు సాధించిన స్పెయిన్.. ఆట ఆఖర్లో ఐదు నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను పూర్తిగా తనవైపు తిప్పుకొంది. 66వ నిమిషంలో అయిటానా బొన్మాటి, 71వ నిమిషంలో క్లాడియా పినా గోల్స్ చేసి స్పెయిన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఫ్రాన్స్, జర్మనీ జట్ల మధ్య విజేతతో స్పెయిన్ సెమీస్ ఆడనుంది.

ఆసియా వాలీబాల్‌లో కుర్రాళ్ల కంచుమోత

న్యూఢిల్లీ: ఆసియా పురుషుల అండర్-16 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు కంచు మోత మోగించారు. టోర్నీలో తలపడ్డ తొలిసారే కాంస్య పతకంతో సత్తా చాటారు. థాయ్‌లాండ్‌లో శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత్ 3-2తో జపాన్ జట్టును ఓడించి మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేసింది. అంతకు ముందు భారత్ సెమీఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓటమి పాలైంది. ఇక, ఈ టోర్నీలో సెమీస్ చేరిన భారత్, పాకిస్థాన్, జపాన్, ఇరాన్ జట్లు వచ్చే ఏడాది కతార్‌లో జరిగే అండర్-17 ప్రపంచ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాయి.



భేటీ వేదిక మార్చకుంటే బాయ్‌కాట్!

ఆసియాకప్‌పై బీసీసీఐ ఆలోచన

న్యూఢిల్లీ: భారత ఉపఖండంలో ప్రతిష్ఠాత్మక టోర్నీగా పిలుచుకునే ఆసియాకప్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈనెల 24న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశం ఢాకాలో జరగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌తో భారత్‌కు సత్సంబంధాలు లేని కారణంగా ఆ సమావేశం కోసం అక్కడికి వెళ్లేందుకు బీసీసీఐ ఇష్టపడడం లేదు. అందుకే ఏసీసీ అధ్యక్షుడు మొహిసిన్ నఖ్వీ ఆధ్వర్యంలో జరిగే ఆ సమావేశం వేదికను బంగ్లా నుంచి వేరే చోటుకు మార్చాలని బీసీసీఐ పట్టుబడుతోంది. ఒకవేళ భేటీ వేదికను మార్చపోతే ఈ ఏడాది సెప్టెంబరులో జరగాల్సిన ఆసియాకప్‌ను బాయ్‌కాట్ చేస్తామని బీసీసీఐ హెచ్చరిస్తోంది. ఇప్పటికే లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని ఏసీసీకి కూడా తెలిపింది. కానీ అక్కడి నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. 'ఢాకా నుంచి సమావేశం వేదికను మార్చితేనే ఆసియాకప్ జరుగుతుంది. నఖ్వీ భారత్‌పై అనవసర ఒత్తిడి తేవాలనుకుంటున్నాడు. వేదికను మార్చమని చెప్పినా ఇంత వరకు స్పందించలేదు. అయితే ఢాకాలోనే భేటీ జరిగితే అందులో తీసుకునే ఎలాంటి నిర్ణయాలనైనా మేం పట్టించుకోం' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

బోనస్ బొనాంజా

- ఒక్కో షేరుకు ఉచితంగా ఒక షేరు జారీ
- బ్యాంక్ చరిత్రలో తొలి బోనస్ షేర్ల ఇష్యూ

దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. అంటే, బ్యాంక్ వాటాదారులు కలిగి ఉన్న ప్రతి ఒక్క షేరుకు గాను ఒక షేరు బోనస్‌గా లభించనుంది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్ల వివరాలను ఆగస్టు 27న రికార్డు చేయనున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చరిత్రలో ఇదే తొలి బోనస్ షేర్ల జారీ. దీంతో బ్యాంక్‌లో రూ.2 లక్షల లోపు ఈక్విటీ వాటా కలిగిన 36 లక్షలకు పైగా చిన్న మదుపరులకు లబ్ధి చేకూరనుంది. వీరు బ్యాంక్‌లో మొత్తం 10.32 శాతం వాటా కలిగి ఉన్నారు. కాగా, బ్యాంక్ 2011లో రూ.10 ముఖ విలువ కలిగిన షేరును రూ.2 ముఖ విలువతో కూడిన 5 షేర్లుగా విభజించింది. ఆ తర్వాత 2019లో రూ.2 ముఖ విలువ కలిగిన షేరును రూ.1 ముఖ విలువతో కూడిన 2 షేర్లుగా విభజించింది.

ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 25ను రికార్డు తేదీగా నిర్ణయించింది. వచ్చే నెల 11న డివిడెండ్ చెల్లింపులు చేపట్టనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

క్యూ1లో రూ.16,258 కోట్ల లాభం: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 1.31 శాతం తగ్గి రూ.16,258 కోట్లకు పరిమితమైంది. స్టాండ్‌ఎలోన్ లాభం మాత్రం రూ.18,155 కోట్లుగా నమోదైంది. క్యూ1లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.99,200 కోట్లకు ఎగబాకగా.. మొత్తం వ్యయాలూ రూ.63,467 కోట్లకు పెరిగాయి. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 5.4 శాతం వృద్ధితో రూ.31,440 కోట్లకు పెరిగినప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 3.35 శాతానికి తగ్గింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	107
వరంగల్	104	గుంటూరు	112
కరీంనగర్	104	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	106
కర్నూలు	104	నెల్లూరు	111
విశాఖపట్నం	92	అనంతపురం	111
గోదావరి	107		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,040 ▲	91,700 ▲	1,26,000 ▲
విజయవాడ	1,01,350 ▲	97,200 ▲	1,11,600 ▼
విశాఖపట్నం	1,00,040 ▼	91,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,040 ▲	91,700 ▲	1,15,000 ▲
ప్రొద్దుటూరు	98,250 ▲	90,390 ▲	1,14,500 ▼
ముంబై	98,243 ▲	89,991 ▲	1,12,700 ▲

ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ సమయం దగ్గర పడుతోంది. అందరికీ ఒకే రిటర్న్ ఫారం వర్తించదు. ఆయా వ్యక్తుల ఆదాయాల్ని బట్టి ఇది మారుతుంది. దీనికి సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. అయినా చాలా మందికి ఇప్పటికీ తమ ఆదాయానికి తగ్గట్టు తమ రిటర్న్‌ను ఏ ఫారమ్‌లో దాఖలు చేయాలనే దానిపై స్పష్టత లేదు.



ఐటీ రిటర్న్‌లు.. ఎవరికి ఏ ఫారం?

ఆదాయాన్ని బట్టి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ఫైల్ చేయాల్సిన ఐటీ రిటర్న్ ఫారాలు మారిపోతుంటాయి. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)కి సంబంధించి (2025-26 అసెస్‌మెంట్ ఇయర్) ఎవరు ఏ ఐటీఆర్ దాఖలు చేయాలనే దానిపై ఐటీ శాఖ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఇందుకోసం వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల కోసం ఐటీఆర్-1, ఐటీఆర్-2, ఐటీఆర్-3, ఐటీఆర్-4 పేరుతో నాలుగు ఫారాలు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన మార్పులకు అనుగుణంగా ఈ ఐటీఆర్ ఫారాల్లో అనేక మార్పులూ చోటు చేసుకున్నాయి. ఇప్పుడు ఎవరు ఏ ఐటీఆర్ ఫారం ఫైల్ చేయాలో తెలుసుకుందాం.

వీరికి తప్పనిసరి

ఆదాయం ఆదాయ పన్ను పరిమితి కంటే తక్కువగా ఉన్నా ఈ కింది వ్యక్తులు తప్పనిసరిగా రిటర్న్‌లు దాఖలు చేయాలి.

- విదేశీ పర్యటనల్లో ఖర్చులు రూ.2 లక్షలకు మించి ఖర్చు చేసే వ్యక్తులు
- వార్షిక కరెంటు బిల్లు రూ.లక్ష మించిన వ్యక్తులు
- కరెంట్ ఖాతాలో రూ.కోటికి మించి డిపాజిట్ ఉన్న వ్యక్తులు
- విదేశాల్లో ఆస్తులు ఉన్న వ్యక్తులు
- తన పేరు మీద విదేశీ బ్యాంకు ఖాతాలు ఉన్న వ్యక్తులు లేదా లేదా ఎవరి విదేశీ బ్యాంకు ఖాతాకైనా లబ్ధిదారుగా ఉన్న వ్యక్తులు
- సెక్షన్ 54, 54బీ, 54ఈసీ, 54ఎఫ్ కింద మూలధన లాభాలకు పన్ను మినహాయింపులు కోరే వ్యక్తులు
- ఆదాయ పన్ను మినహాయింపు కోరే వ్యక్తులు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో టీడీఎస్/టీసీఎస్‌ల మొత్తం రూ.25,000 మించిన వ్యక్తులు. సీనియర్ సిటిజన్లయితే రూ.50,000 వరకు

ఐటీఆర్-1

గతంలో మూలధన లాభాలు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-1లో తమ రిటర్న్‌లు దాఖలు చేసేందుకు అవకాశం ఉండేది కాదు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) నుంచి వీరు కూడా ఐటీఆర్-1 ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయవచ్చు. కాకపోతే ఇందుకు కొన్ని షరతులు వర్తిస్తాయి. అవేంటంటే...

- మూలధన లాభాలు దీర్ఘకాలిక లాభాలై ఉండాలి
- ఆ లాభాలు లిస్టెడ్ కంపెనీలు షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల యూనిట్ల అమ్మకాలపై వచ్చినవై ఉండాలి
- ఇలా వచ్చిన దీర్ఘకాలిక మూలధన లాభాలు ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించకూడదు
- దేశంలోనే నివసిస్తున్న సాధారణ పౌరుడై ఉండాలి
- పన్ను పరిధిలోకి వచ్చే వార్షిక ఆదాయం రూ.50 లక్షలు మించకూడదు
- వడ్డీ, డివిడెండ్లు, పెన్షన్ వంటి ఆదాయాలతో పాటు జీతం, ఒక ఇంటిపై వచ్చే ఆదాయాలై ఉండాలి
- రూ.5,000 మించని వార్షిక వ్యవసాయ ఆదాయం

ఐటీఆర్-2

పన్నుల పరిధిలోకి వచ్చే వార్షిక ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్న వ్యక్తులు ఈ ఫారం ద్వారా తమ ఐటీఆర్ రిటర్న్ ఫైల్ చేయాలి. ఈ ఫారంలో వారు తమ ఆస్తులు, అప్పులు వెల్లడించడం ద్వారా పన్ను ప్రయోజనాలు కూడా పొందవచ్చు. గత ఏడాది జూలై 23కు ముందు లేదా ఆ తర్వాత దీర్ఘకాలిక మూలధన లాభాలు ఆర్జించిన వ్యక్తులు, గత ఏడాది అక్టోబరు తర్వాత షేర్ల బైబ్యాక్‌పై నష్టపోయిన వ్యక్తులు కూడా ఐటీఆర్-2ను ఎంచుకోవచ్చు. ఈ కింది అంశాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలు పూర్తి చేసిన వ్యక్తులందరూ ఐటీఆర్-2 పరిధిలోకి వస్తారు. అవేమిటంటే?

- అవిభాజ్య హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్)
- వార్షిక మూలధన లాభాలు రూ.1.25 లక్షలకు మించిన వ్యక్తులు
- ఏదైనా కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్న వ్యక్తులు
- స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కాని కంపెనీలలో షేర్లు ఉన్న వ్యక్తులు
- విదేశీ ఆదాయం ఉన్న వ్యక్తులు
- క్రిప్టో కరెన్సీలు, ఇతర డిజిటల్ ఆస్తుల అమ్మకం, బదిలీల ద్వారా వచ్చిన ఆదాయం ఉన్న వ్యక్తులు

ఐటీఆర్-3

వ్యాపార, వృత్తిపరమైన ఆదాయాలు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-3 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఈ సంవత్సరం క్రూయిజ్ నౌకల ద్వారా ఆదాయం వచ్చే వారిని కూడా ఈ ఐటీఆర్ పరిధిలో చేర్చారు. ఇందుకోసం ఐటీ చట్టంలో ప్రత్యేకంగా సెక్షన్ 44బీబీసీని ప్రత్యేకంగా చేర్చారు. ఈ కింది వ్యక్తులు ఐటీఆర్-3 ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

- వ్యాపార, వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు
- భాగస్వామ్య సంస్థలు
- ఎఫ్ అండ్ ఓ లేదా ఇంట్రాడే ట్రేడింగ్‌లో లాభనష్టాలు నమోదు చేసిన వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు

ఐటీఆర్-4

ప్రిజెంప్టివ్ ట్యాక్స్ స్కీమ్ కోసం ఐటీ చట్టంలోని సెక్షన్ 44ఏడీ, సెక్షన్ 44ఏడీఏలను ఎంచుకున్న వ్యాపార, వృత్తి నిపుణులు ఐటీఆర్-4 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు

- సెక్షన్ 44ఏడీ, 44 ఏడీఏ లేదా 44 ఏఈ కింద రూ.50 లక్షల లోపు ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఎల్ఎల్‌పీలు కాని సంస్థలు
- ఈక్విటీ షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల అమ్మకంపై రూ.1.25 లక్షల వరకు మూలధన లాభాలు ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు
- వృత్తి నిపుణులకు వచ్చే ఆదాయంలో 95 శాతానికిపైగా గుర్తింపు పొందిన బ్యాంకింగ్ చానల్స్ ద్వారా వస్తే వార్షిక ఆదాయం రూ.75 లక్షల వరకు ఉన్నా ఐటీఆర్-4 ద్వారా రిటర్న్ ఫైల్ చేయవచ్చు
- డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఇతర వృత్తి నిపుణులు సెక్షన్ 44ఏడీఏ పరిధిలోకి వస్తారు
- సెక్షన్ 44ఏడీ కింద ప్రిజెంప్టివ్ ట్యాక్స్ స్కీమ్‌ను ఎంచుకుని రూ.2 కోట్ల వరకు ఆదాయం ఉన్న వ్యాపారులు
- ఈ వ్యాపార ఆదాయంలో 95 శాతం లేదా అంతకు మించి బ్యాంకింగ్ చానల్స్ ద్వారా వస్తే, వార్షిక ఆదాయం రూ.3 కోట్ల వరకు ఉన్నా ఐటీఆర్-4 ఫైల్ చేయవచ్చు.

ఐటీఆర్-5

వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, హెచ్‌యూఎఫ్‌లకు ఈ రిటర్న్ ఫారం వర్తించదు. సంస్థలు, ఎల్ఎల్‌పీలు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్, బిజినెస్ ట్రస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ఐటీఆర్-5 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

ఐటీఆర్-6

ప్రత్యేక కంపెనీల నిర్వచనం పరిధిలోకి రాని కంపెనీలు మాత్రమే ఈ ఫారం ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్-7

చారిటబుల్, మతపరమైన ట్రస్టులు, రాజకీయ పార్టీలు, పరిశోధనా సంస్థలు, వార్తా సంస్థలు లేదా ఐటీ చట్టంలో పేర్కొన్న ప్రత్యేక సంస్థలు ఐటీఆర్-7 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

ఎవరు ఎప్పటిలోగా దాఖలు చేయాలంటే..

జీతం మాత్రమే ఆదాయంగా ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఆడిట్ చేయాల్సిన అవసరం లేని ఆదాయం ఉన్న వ్యక్తులు ఈ ఏడాది సెప్టెంబరు 15లోగా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఆడిటింగ్ పరిధిలోకి వచ్చే ఆదాయం ఉన్న వ్యక్తులు అక్టోబరు నెలాఖరులోగా ఫైల్ చేయాలి. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు కూడా ఉన్న వ్యక్తులు, సంస్థలైతే నవంబరు నెలాఖరులోగా ఐటీ రిటర్న్‌లు సమర్పించాల్సి ఉంటుంది.

బిజినెస్ ప్లస్

అలియాంజ్‌తో జియో ఫైనాన్స్ జట్టు

రీఇన్సూరెన్స్ కోసం జేవీ ఏర్పాటు

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జెఎఫ్ఎస్ఎల్).. జర్మనీకి చెందిన గ్లోబల్ ఇన్సూరెన్స్ దిగ్గజం అలియాంజ్ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా అలియాంజ్ గ్రూప్ అనుబంధ సంస్థ యూరప్ బీవీతో కలిసి దేశంలో రీఇన్సూరెన్స్ సేవలందించేందుకు జియో ఫైనాన్షియల్ జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేయనుంది. చెరి సగం భాగస్వామ్యంలో రీఇన్సూరెన్స్ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఇరు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. కాగా దేశంలో జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాల్లో కూడా సేవలందించేందుకు మరో రెండు జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు నాన్-బైండింగ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభంలో 16% వృద్ధి

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 15.9 శాతం వృద్ధితో రూ.13,558 కోట్లకు చేరుకోగా.. స్టాండ్‌ఎలోన్ లాభం 15.5 శాతం పెరిగి రూ.12,768 కోట్లుగా నమోదైంది. క్యూ1లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు ఎగబాకగా.. ఇతర ఆదాయం 13.7 శాతం వృద్ధితో రూ.7,264 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.34 శాతానికి తగ్గింది.

లాభాల్లోకి ఆర్‌పవర్

రిలయన్స్ పవర్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.44.68 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.97.85 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. నిర్వహణాపరంగా పనితీరు మెరుగుపడటం, వ్యయాలు గణనీయంగా తగ్గటం కలిసివచ్చిందని పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.2,069.18 కోట్ల నుంచి రూ.2,025.31 కోట్లకు తగ్గింది. మరోవైపు వ్యయాలు రూ.2,142.52 కోట్ల నుంచి రూ.1,953.01 కోట్లకు తగ్గినట్లు ఆర్‌పవర్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	503
చిత్తూరు	563	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

పెట్టుబడుల కోసం పోటీపడతాం..

రాజకీయ ఘర్షణ మా అభిమతం కాదు

- ఆర్థికాభివృద్ధిలో సీఏలూ భాగం కావాలి
- జనవరిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభం
- ఐసీఏఐ స్ఫూర్తి మెగా కాన్ఫరెన్స్‌లో లోకేశ్ వెల్లడి

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో భాగంగా 2047నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్నది ప్రధాని మోదీ ఆకాంక్ష అయితే, అందులో 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించాలన్నది ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇది కఠినమైనప్పటికీ అసాధ్యం కాదని పేర్కొన్నారు. శనివారం ఐసీఏఐ (ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో 'స్ఫూర్తి' పేరుతో నిర్వహించిన మెగా సీఏ విద్యార్థుల సమావేశంలో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ ప్రస్తుత వాటా 4.85 శాతం కాగా, 2047 నాటికి 6.67 శాతానికి ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో 10 నుంచి 12 శాతం వరకు వృద్ధి రేటు సాధించిన మనం, నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవడానికి భవిష్యత్‌లో 15 శాతం వరకు వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందని వివరించారు. ఈ లక్ష్యసాధనలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలకపాత్ర వహించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ప్రతి బ్యాలెన్స్ షీట్ వెనుక ఒక ప్రతిభ కలిగిన మేధస్సు ఉంటుందని, దాని పేరే చార్టర్డ్ అకౌంటెంట్ అని వ్యాఖ్యానించారు. ఐసీఏఐ ద్వారా 10 లక్షల మందికి పైగా సీఏ విద్యను అభ్యసిస్తుండగా, ఏటా 2 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. తాను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్‌ఫర్డ్‌లో ఎంబీఏ గ్రాడ్యుయేట్‌గా సీఏ ప్రాధాన్యం గురించి తనకు తెలుసునని ఆయన అన్నారు. కాగా, దక్షిణ ఆసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీ జనవరిలో అమరావతిలో ప్రారంభం కాబోతున్నదని తెలిపారు. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఈ-గవర్నెన్స్, ఐటీ హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపీ రూపురేఖలు మార్చబోతున్నారన్నారు. చంద్రబాబు నుంచి తాను స్ఫూర్తిని పొందుతానని, 75 ఏళ్ల వయసులోను పాతికేళ్ల యువకుడిలా ఆయన పని చేస్తున్నారన్నారు. "నేటి ప్రపంచంలో ఐక్యూ(ఇంటెలిజెంట్ కోషెంట్), ఈక్యూ(ఎమోషనల్ కోషెంట్) మంచివి. ఇదే సమయంలో టిక్యూ(టెక్ కోషెంట్) కూడా తప్పనిసరి. పదునుగా, నైతికంగా, తాజాగా ఉండండి. సీఏలు పాలనా వ్యవస్థలోకి వస్తే అవినీతిని రూపుమాపడం సులభతరమవుతుంది." అని లోకేశ్ అన్నారు. ఈ సమావేశంలో ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డీ ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సీ) వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి చైర్మన్ ఎన్ రాజశేఖర్ తదితర అధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

> "కర్ణాటకకు బెంగళూరు ఉంది, తెలంగాణకు హైదరాబాద్, తమిళనాడుకు చెన్నై ఉంది. మరి ఆంధ్రప్రదేశ్‌కు ఏముందని అడుగుతున్నారు. అలాంటివారికి నా సమాధానం ఒకటే.. మాకు చంద్రబాబు బ్రాండ్ ఉంది. రాష్ట్రానికి అనేక కంపెనీలు వస్తున్నాయంటే ఈ బ్రాండే కారణం అని చెబుతాను." - మంత్రి లోకేశ్

బాబు బ్రాండ్ వల్లే ఏపీకి పెట్టుబడులు

- ప్రతి సిటీ డిజిటల్ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి: లోకేశ్

విజయవాడ (గన్నవరం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ (ఈసీఎల్ఏటీ) గన్నవరం సమీపంలోని కేసరపల్లి మేధా టవర్‌లో ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని శనివారం లోకేశ్ ప్రారంభించారు. "జీడి నెల్లూరులో యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు బడ్డీకొట్టు నడుపుకునే ఓ మహిళను కలిశాను. తన భర్త మద్యానికి బానిసై చనిపోయాడని, ఇద్దరు పిల్లలను కష్టపడి చదివిస్తున్నారని ఆమె చెప్పారు. ప్రభుత్వం ఏం చేయాలని కోరుకుంటున్నారని అడగ్గా, చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని ఆమె కోరారు. ఆమె మాటల స్ఫూర్తితోనే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం." అని లోకేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో కార్తీక్ పొల్సాని, సీవోవో స్నేహ పొల్సాని, ఇండియా వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గుర్రం, మోహిత్ శ్రీవాస్తవ, విజయవాడ బ్రాంచ్ డీజీఎం సురేశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రోజంతా చంద్రబాబు బిజీబిజీ

విజయవాడ నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబు... అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రేణిగుంట మండలం తూకివాకం వద్ద తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం తిరుపతి కపిలతీర్థం చేరుకుని కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర భాగస్వాములతో కలసి మాట్లాడారు. అనంతరం ప్రజా వేదికలో పాల్గొన్నారు. చివరగా తిరుపతిలోని కంచి మఠంలో బస చేసిన కంచి పీఠాధిపతులను కలిశారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ తిరుగు ప్రయాణమయ్యారు.





స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రజావేదిక సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నేరచరిత నేతలను ఊడ్చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలని, ప్రజలకు భద్రత కల్పించాలని మాత్రమే చూశానని అన్నారు. రాయలసీమలో ముఠాకక్షలు రూపుమాపానని, మతకలహాలు అడ్డుకున్నానని చెప్పారు. 'రాష్ట్రంలో తీవ్రవాదం ఉండకూడదని పోరాడాను. ప్రతిగా నా ప్రాణం తీయాలని చూశారు' అని అలిపిరి సంఘటనను గుర్తు చేసుకున్నారు. రాష్ట్రానికి తన ద్వారా ఏదో చేయాలన్న ఉద్దేశంతోనే శ్రీవారు తనను కాపాడారన్నారు.

చేసేవి వెధవ పనులు.. పేరేమో సాక్షి

"2019లో సీఎంగా ఉండగా ఒక రోజు నిద్ర లేవగానే వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతిచెందారని సాక్షి టీవీలో వార్త వచ్చింది. అయ్యో పాపం అనుకున్నాను. అయితే పోస్టుమార్టంలో గొడ్డలిపోటుతో జరిగిన హత్య అని తేలింది. గుండెపోటు అని ప్రచారం చేసినవారే సాయంత్రానికల్లా ప్లేటు ఫిరాయించి చంపేశారంటూ వార్త వేశారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి ఉన్నట్టు ఫొటో పెట్టి నారాసుర రక్తచరిత్ర అని వార్త పెట్టారు. చేసేవన్నీ వెధవ పనులు.. సాక్షి అని పేరెలా పెట్టారో. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ధరల పతనంతో దెబ్బతిన్న మామిడి రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ ప్రకటించాను. రైతుల నుంచి మామిడి కొనుగోలు చేస్తుంటే జగన్ వచ్చి ఆరు ట్రాక్టర్ లోడ్ల మామిడి కాయలను రోడ్డుపై పడేసిపోయాడు. దీంతో రైతులు లబోదిబోమని ఏడ్చారు. నేను సంక్షేమం, అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తూ ఆ ఫలాలు ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తుంటే, దాన్ని భగ్నం చేయాలని చూస్తున్నారు. చేసేవన్నీ తప్పులు, దాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. దీనిపై ప్రజలంతా ఆలోచించాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

వైసీపీ వారసత్వ చెత్త 86 లక్షల టన్నులు

"రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల ద్వారా 9 వేల టన్నుల చెత్త పోగు పడుతోంది. అందులో తడి చెత్త 5,500 టన్నులు, పొడి చెత్త 3,400 టన్నులు ఉంటోంది. గత వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ పారిశుధ్యం గురించి పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వం 86 లక్షల టన్నుల చెత్తను రోడ్లపై వదిలేసి వెళ్లిపోయింది. దాన్ని తొలగించే బాధ్యత మా ప్రభుత్వంపై పడింది. అక్టోబరు 2 కల్లా వైసీపీ వారసత్వ చెత్తను తొలగించాలని ఆదేశించా. డిసెంబరుకల్లా రాష్ట్రంలో ఎక్కడా చెత్త ఉండకుండా చూస్తాం. రాష్ట్రంలో ఇంటింటి నుంచి చెత్తసేకరణను ఇప్పుడున్న 35 శాతం నుంచి 60 శాతానికి, వేస్ట్ ప్రాసెసింగ్ 30 శాతం నుంచి 60 శాతానికి పెంచుతాం. మలేరియా నిర్మూలనకు డ్రోన్లు వినియోగిస్తాం. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో మున్సిపాలిటీలకు 2 వేల విద్యుత్ వాహనాలు అందజేస్తున్నాం. దానికోసం రూ.30 కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలకు సోలార్ పవర్ ప్యానెళ్లు మంజూరు చేశాం. ఇళ్లే కాకుండా కార్యాలయాలు, పొలాల్లో కూడా సోలార్ పవర్ వాడేలా ప్రోత్సహిస్తున్నాం" అని వివరించారు.

స్వచ్ఛ భారత్‌లో ఏపీ టాప్

"కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్‌లో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 5 అవార్డులు సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచింది. సూపర్ సిటీస్ విభాగంలో తిరుపతి, గుంటూరు, విశాఖలకు అవార్డులు దక్కాయి. అలాగే వివిధ కేటగిరిల్లో విశాఖ, రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. పర్యావరణంలో విజయవాడకు ఏడో ర్యాంకు, తిరుపతికి ఐదో ర్యాంకు వచ్చాయి. ఈ అవార్డులకు పారిశుధ్య కార్మికులే కారణం, ఈ నెలలో ప్లాస్టిక్ కాలుష్యంపై దృష్టి పెడుతున్నాను. ప్లాస్టిక్‌ను నిషేధించాల్సి ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేయాలి. 120 మిల్లీ మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, కప్‌లు వాడకూడదు. స్వర్ణాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీకి శ్రీకారం చుట్టాలి" అని చంద్రబాబు అన్నారు.

'సూపర్ సిక్స్' నిలబెట్టుకుంటున్నాం

"గత ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నిలబెట్టుకుంటున్నాం. అమ్మఒడి కింద గత ప్రభుత్వం కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే నగదు ఇవ్వగా, మా ప్రభుత్వం తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఇస్తోంది. గత ప్రభుత్వానికి పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పట్టగా, మేము వచ్చీ రాగానే పెంచిన మొత్తం ఇస్తున్నాం. ఏడాదికి 3సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. 207 అన్న క్యాంటీన్లు పెట్టాం. ఆగస్టు 20కల్లా డీఎస్సీ పూర్తి చేస్తాం. నిరుద్యోగ భృతి చెల్లిస్తాం. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం ఎప్పుడు నిధులిస్తే అప్పుడు ఏపీ వాటా నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. ఏడాదిలోనే రూ.10 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాం. వాటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. పీ4 కింద 15-20 లక్షల కుటుంబాలను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చే సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఈ విషయంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. 2029 కల్లా పేదరికం లేని రాష్ట్రంగా చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవలే పలువురు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి చర్చించాం. ఒక్కొక్కరు 4-5 వేల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారు. పేదలను ఆదుకునేందుకు మార్గదర్శులు ముందుకు రావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కంచి పీఠాధిపతులతో సీఎం భేటీ

కంచికామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వాములతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. తిరుపతిలో దాదాపు గంట పాటు భేటీ అయ్యారు. అలిపిరిలో ఇస్కాన్ సమీపంలో ఉన్న కంచికామకోటి మఠానికి శనివారం సాయంత్రం చంద్రబాబు చేరుకున్నారు. చాతుర్మాసదీక్షలో ఉన్న పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వాములను కలిశారు. స్వామిజీలతో సీఎం సుమారు గంట పాటు ఏకాంతంగా భేటీ అయ్యారు. పీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న సంప్రదాయ పాఠశాల, కుంభకర పాఠశాల, మహిళల నాదస్వర పాఠశాల గురించి సీఎంకు మఠం నిర్వాహకులు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన పొడులు, పచ్చళ్లు, హెర్బల్ పౌడర్లు, మట్టి పత్రాలు, ఆయుర్వేద మందులు సీఎం స్వయంగా పరిశీలించి అభినందించారు. అనంతరం వారితో కలిసి ఫొటో దిగారు.

'రెంటపాళ్ల' కేసులో మాజీ మంత్రి రజినీకి నోటీసులు

చిలకలూరిపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): రెంటపాళ్ల ఘటనలకు సంబంధించి.. వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజినీకి సత్తెనపల్లి పోలీసులు శనివారం నోటీసులు ఇచ్చారు. ఆదివారం విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలోని రెంటపాళ్ల గ్రామంలో గత నెలలో జగన్ పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పోలీసుల ఆంక్షలను తోసిపుచ్చి భారీ ఎత్తున కార్యకర్తలను సమీకరించారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్త సింగయ్య.. మాజీ సీఎం కారు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. పలువురు కార్యకర్తలు రెచ్చిపోయి.. వివాదాలకు దిగారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి.. విచారణ రావాలంటూ విడదల రజినీకి చిలకలూరిపేటలోని నివాసంలో సత్తెనపల్లి పీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఈ నోటీసులు అందించారు.

తురకా కిశోర్‌కు రిమాండ్

మాచర్ల టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు, మున్సిపల్ మాజీచైర్మన్ తురకా కిశోర్‌కు మాచర్ల కోర్టు రిమాండ్ విధించింది. 2022, అక్టోబరు 7న పార్టీ మారడం లేదన్న కారణంతో టీడీపీ నేత దారపనేని శ్రీనివాసరావుపై కిశోర్, బోదలవీడుకు చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబు మరికొందరు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో కేసు నమోదు చేయలేదు. తాజాగా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ శ్రీనివాసరావు మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో తురకా కిశోర్, ఇతర నిందితులపై హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కిశోర్ సహా నిందితులను అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. అయితే.. కిశోర్‌ను శనివారం ఒకరోజు కస్టడీకి తీసుకున్న పోలీసులు సాయంత్రం వరకు విచారించారు. అనంతరం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచగా న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ ఈ నెల 29 వరకూ రిమాండ్ విధించారు.

చార్జిషీట్‌లో జగన్!

(మొదటి పేజీ తరువాయి)

సహ 22మంది పాత్రని చార్జిషీట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. అతి త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేయబోతున్నామని, అందులో మరికొందరి నిందితుల పాత్రని ఆధారాలతో సహా చూపుతామని సిట్ వర్గాలు చెబుతున్నాయి.

ముడుపుల సొమ్ము రూటింగ్ ఇలా..

ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన మొదటి అభియోగపత్రం 305 పేజీలు ఉన్నట్లు తెలిసింది. చార్జిషీట్‌తో పాటు 70వరకూ వాల్యూమ్స్ కోర్టుకు అందజేసిన సిట్ అధికారులు అందులో పేర్కొన్న అంశాల ఆధారంగా 28కి పైగా ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాల విశ్లేషణలు, ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన జీవోలు, గత వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీపై ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లు పొందుపరిచినట్లు సమాచారం. ప్రధానంగా మద్యం విధానం రూపకల్పనలో ఎవరెవరి పాత్ర ఏమిటి.? కుట్రదారులెవరు.? పాత్రధారులెవరు.? ప్రభుత్వ పెద్దలు ఏమి చేశారు.? ముడుపులు నిర్ణయించింది ఎవరెవరు.? వాటిని వసూలు చేసే బాధ్యత రాజ్ కసిరెడ్డికి అప్పగించడం వెనుక కారణాలు, అందుకున్న మొత్తం ఎంత.? నగదు కలెక్షన్లలో తీసుకున్న జాగ్రత్తలు, ఆ సొమ్ము నిల్వ చేసిన డెన్‌లు, అక్కడి నుంచి బినామీ ఆస్తుల కొనుగోలుకు వెళ్లింది ఎంత.? హవాలా మార్గంలో దేశం దాటింది ఎంత.? ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు చేరింది ఎంత.? గత ఎన్నికల సమయంలో 'సిద్ధం' సభలకు పంపించిన సొమ్ము వివరాలతోపాటు మాజీ సీఎం పేరు పలుమార్లు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పాలసీ రూపకల్పన నుంచి వసూళ్ల నెట్‌వర్క్ ఏర్పాటు, అదాన్ డిస్టిలరీని స్వాధీనం చేసుకుని పాలసీకి భిన్నంగా రూ.1200కోట్ల మద్యం ఆర్డర్లు పొందిన వైనం, వసూలు చేసిన మొత్తాన్ని రూటింగ్ చేసిన తీరుపై వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులతో పాటు సాక్షులు ఇచ్చిన 268 స్టేట్‌మెంట్లు చార్జిషీట్‌తో పాటు కోర్టుకు అందజేసిన సిట్ అధికారులు, లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన రూ.62.85 కోట్లు జప్తు చేసినట్లు తెలిపింది.

బంగారు షాపుల్లోకి మద్యం ముడుపులు

కీలక డేటాను చార్జిషీట్‌లో సిట్ ప్రస్తావించింది. నిందితులు ధ్వంసం చేసిన సెల్‌ఫోన్లను ఐటీ నిపుణులతో డేటా రికవరీ చేసింది. దుబాయ్‌తో పాటు హైదరాబాద్, తాడేపల్లి డెన్‌ల ఫొటోలు సేకరించింది. సమగ్ర వివరాలను అభియోగపత్రంలో పొందుపరిచింది. మద్యం పాలసీ తయారీ నుంచి లోకల్ బ్రాండ్ తయారీవరకు సాక్ష్యాధారాలను సేకరించింది. ముడుపుల సొమ్మును చలామణిలోకి తేవడంలో భాగంగా బ్లాక్‌ను వైట్‌గా మార్చినట్టు సిట్ గుర్తించింది. మద్యం ముడుపులను బంగారు షాపులలో పెట్టుబడులు పెట్టినట్టు కనుగొంది. 'అంతిమ లబ్ధిదారు'కు చేరడంపై 20 రోజులలో మరో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు సిట్ వర్గాలు తెలిపాయి.

ఆ ఎనిమిది మంది పరారీలోనే..

సైమన్ ప్రసన్, కొమ్మారెడ్డి అవినాశ్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, సుజల్ బెహ్రాన్, మోహన్, రాజీవ్ ప్రతాప్, బొల్లారం శివకుమార్, ముప్పిడి అవినాశ్‌రెడ్డి పేర్లు కొత్తగా నిందితుల జాబితాలో చేర్చారు. వీరంతా పరారీలో ఉన్నారని సిట్ గుర్తించింది. ఇందులో ముప్పిడి అనిరుధ్ రెడ్డి....రాజ్ కసిరెడ్డి తోడల్లుడైన అవినాశ్ రెడ్డికి తమ్ముడు. అదాన్‌లో అనిరుధ్‌ను డైరెక్టర్‌గా పెట్టి రూ.800 కోట్లకు పైగా లిక్కర్ ఆర్డర్లను రాజ్ కసిరెడ్డి ఇప్పించారు. బొల్లారం శివకుమార్‌ను అనిరుధ్ రెడ్డి స్థానంలోకి ఆ తర్వాత తెచ్చారు. ఇప్పటికీ ఆయనే కొనసాగుతున్నారు. సైమన్ ప్రసన్ ముడుపులు వసూళ్లుచేసి రాజ్ కసిరెడ్డి చెప్పినట్లు సిద్ధం సభలకు, వైసీపీ వాళ్లకు చేర్చేవారు. రాజీవ్ ప్రతాప్ దుబాయ్ డెన్‌లో లెక్కలు చూసే ఐబీటీ పట్టభద్రుడు. మోహన్ కుమార్ హైదరాబాద్‌లో చికెన్ ఎంప్లాయ్ పేరుతో లిక్కర్ డెన్‌లను పర్యవేక్షించారు. సైమన్ ప్రసన్‌కు బావమరిది. సుజల్ బెహ్రాన్ మరో నిందితుడు తుతేకుల కిరణ్ కుమార్‌రెడ్డికి స్నేహితుడు. ముడుపుల వసూళ్లలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కొమ్మారెడ్డి అవినాష్ రెడ్డి తాడేపల్లి డెన్‌ను ప్రణయ్ ప్రకాశ్‌తో కలిసి పర్యవేక్షించారు. అనిల్ కుమార్ రెడ్డి డబ్బులు రూటింగ్ చేసేవారు. అనిరుధ్ రెడ్డికి బామ్మర్ది. కాగా, గత ఏడాది సెప్టెంబరులో సీఐడీ కేసు నమోదు చేసినప్పుడు ఐదుగురి పేర్లు ఉండగా, కేసు సిట్ చేతికి చేరిన తర్వాత ఆ సంఖ్య 29కి చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాలుగో వారంలో రాజ్ కసిరెడ్డి(ఏ-1)ని అరెస్టు చేసినపుడు ఈ పేర్లు సిట్ బయటపెట్టింది. అందులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి (ఏ-4), విజయ సాయిరెడ్డి(ఏ-5) సహా పలువురు వ్యక్తులు, డిస్టిలరీలు ఉన్నాయి. ఆ తర్వాత దర్యాప్తులో లభించిన ఆధారాలతో మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి పేర్లు చేర్చింది. కాఫీ షాపు ఉద్యోగిగా ఉంటూ 459కోట్లు లిక్కర్ టర్నోవర్ చేసిన లీలా డిస్టిలరీస్ డైరెక్టర్ వరుణ్ పురుషోత్తం(ఏ-40) పేరు చివర్లో ఉంది. తాజాగా 8 మందిని చేర్చడంతో నిందితుల సంఖ్య 48కి చేరినట్లయింది.

మిథున్‌రెడ్డి అరెస్టు



శనివారం గన్నవరం విమానాశ్రయంలో వైసీపీ ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

సిట్ అధికారులు దాదాపు ఐదుగంటల పాటు ప్రశ్నించారు. ముడుపులు మూటగట్టేందుకు అనుకూలంగా మద్యం విధానాన్ని రూపొందించడం మొదలుకుని... అందుకు అనుగుణంగా ఎక్సైజ్ అధికారుల నియామకం, ముడుపుల వసూళ్లు, అప్పట్లో గరిష్ఠ లబ్ధిపొందిన అదాన్ డిస్టిలరీలో అనధికార భాగస్వామ్యం, నిబంధనలకు విరుద్ధంగా ఆర్డర్లు ఇప్పించడం, ముడుపులివ్వని వారికి ఆర్డర్లు ఆపేయడం, డిస్టిలరీల నుంచి ఎంత వసూలు చేయాలో నిర్ణయించడం, ఆ సొమ్ము ఎన్నికల ఖర్చు కోసం భద్రపరచడం, పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు తదితర అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. మద్యం తరలించే బాక్సుల కాంట్రాక్టు ఢిల్లీకి చెందిన వారికి ఇప్పించడం వెనుక జరిగిన తతంగంపైనా మిథున్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

> మిథున్‌రెడ్డి సిట్ విచారణకు హాజరవుతున్న సందర్భంగా విజయవాడలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ కార్యాలయం ముందు ఉన్న రహదారిని మొత్తం మూసివేశారు. బారికేడ్లను, రోప్‌పార్టీలను ఏర్పాటు చేశారు.
>
> భారీ బందోబస్తు

అదే సమాధానం...

మద్యం కేసులో మిథున్ రెడ్డిని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒకసారి 'సిట్' అధికారులు ప్రశ్నించారు. అప్పట్లో ఆయన విచారణకు ఏమాత్రం సహకరించలేదు. 'రాష్ట్రంలో జరిగే వ్యవహారాలతో ఎంపీగా ఉన్న నాకేం సంబంధం' అంటూ సమాధానాలు దాటవేశారు. శనివారం విచారణలో కూడా ఆయన ఇదే తరహాలో సహాయ నిరాకరణ చేసినట్లు తెలిసింది. 'అంతిమ లబ్ధిదారు'కు సంబంధించి అడిగిన ప్రశ్నలకు స్పందించలేదని సమాచారం. దీంతో... మిథున్‌ను అరెస్టు చేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు. నిబంధనల ప్రకారం... ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శనివారం రాత్రి 8 గంటలకు మిథున్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆయనను ఆదివారం ఉదయం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టనున్నారు.

ఇదీ మిథున్ పాత్ర...

'సిట్' విచారణలో గుర్తించిన ప్రకారం... జగన్ సర్కారు తెచ్చిన మద్యం పాలసీ రూపకల్పనలో మిథున్ రెడ్డి అత్యంత కీలకంగా వ్యవహరించారు. వినియోగదారులు అలవాటు పడ్డ, పాపులర్ మద్యం బ్రాండ్లను కాకుండా ముడుపులిచ్చిన అనామక కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చేలా చూశారు. లిక్కర్ లాబీని గుప్పిట్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. ముడుపులు చెల్లించిన వారికే తర్వాతి వారంలో ఆర్డర్లు ఇవ్వాలని, లేదంటే ఆపేయాలని మిథున్ రెడ్డి ఎక్సైజ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తేలింది. ఐదు రూపాయల టీ తాగినా ఆన్‌లైన్ చెల్లింపులు జరుగుతుండగా... మద్యం వ్యాపారం మాత్రం పూర్తిగా 'క్యాష్'లో జరగడానికి కారణం ఆయనే అని సిట్ గుర్తించింది. అప్పటి ఎక్సైజ్ అధికారులు తమ వాంగ్మూలాల్లో ఈ విషయం స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రతి రోజూ రెండు కోట్లకు తగ్గకుండా మద్యం కమీషన్లు వసూలు చేసిన లిక్కర్ గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరించిన మిథున్ రెడ్డి అదాన్ డిస్టిలరీస్ పేరుతో వందల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు సమాచారం. లిక్కర్ వ్యాపారంలో తాము చెప్పినట్లు చేస్తే ఐఏఎస్ అధికారి హోదా ఇప్పిస్తామంటూ అప్పటి ఎక్సైజ్ అధికారి సత్య ప్రసాద్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇతర నిందితులతో తరచూ సమావేశమయ్యారు. ఈ విషయాలను మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్టులో దర్యాప్తు అధికారి పొందుపరిచే అవకాశం ఉంది.

ఆయనకు అన్నీ తెలుసు!

కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలి
అందుకే మిథున్ అరెస్టు: సిట్

మిథున్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేస్తున్నామో 'సిట్' కారణాలను వివరించింది. విచారణ సందర్భంగా ఆయన సహాయ నిరాకరణ చేశారని... కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాల్సిన అవసరముందనీ వెల్లడించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మిథున్ అరెస్టుకు 'సిట్' చెప్పిన కారణాలివి...

- మద్యం స్కామ్‌లో లోతైన నేరపూరిత కుట్ర ఉంది. ఇందులో... ప్రైవేటు వ్యక్తులతోపాటు ఉన్నతస్థాయి అధికారులు, నాటి ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఉంది. దీనికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించాం. ముడుపుల డబ్బులు ఎక్కడి నుంచి ఎలా చేరాయో, సహ కుట్రదారులెవరో మిథున్ ద్వారా తెలుసుకోవాలి. సాక్ష్యాధారాలను 'ట్యాంపర్' చేయకుండా చూడాలి.
- మద్యం పాలసీ రూపకల్పన, అమలు, ముడుపులు సేకరించడంలో సహ నిందితులతో సమన్వయంలో మిథున్‌దే కీలక పాత్ర.
- ఐఏఎస్ హోదా కల్పిస్తామంటూ ఏ3 సత్యప్రసాద్‌కు హామీ ఇచ్చి... ఈ కుట్రలోకి లాగింది మిథున్ రెడ్డే. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులతో (ఏ3, ఏ4) పలుమార్లు మిథున్ రెడ్డి సమావేశమయ్యారు.
- ఎస్పీవై ఆగ్రో, సాన్‌హాక్ ల్యాబ్స్, డెర్ట్ లాజిస్టిక్స్, పీఎల్ఆర్ ప్రాజెక్ట్ ద్వారా లావాదేవీలు జరిగాయి. పీఎల్ఆర్ మిథున్ రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థ.
- స్కామ్‌లో మిథున్ ప్రత్యక్ష ప్రమేయం గురించి ముగ్గురు సాక్షులు స్పష్టమైన వాంగ్మూలం ఇచ్చారు.
- మద్యం ముడుపుల్లో సేకరించిన డబ్బులను 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకోసం ఉపయోగించారు.
- ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ములను ఎక్కడెక్కడ దాచారు, ఎలా తరలించారనే పూర్తి సమాచారం మిథున్‌కు తెలుసు. ఆ వివరాలన్నీ రాబట్టాల్సి ఉంది. డబ్బు తరలించేందుకు సృష్టించిన షెల్ కంపెనీల గుట్టు తెలుసుకోవాల్సి ఉంది.

40 కార్లతో బయలుదేరి... చివరికి ఒక్క కారుతో సరి!

విజయవాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో 'సిట్' ముందు హాజరైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి 'భారీ బలప్రదర్శన'కు దిగారు. శనివారం ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో వచ్చిన ఆయన... గన్నవరం విమానాశ్రయం నుంచి మొత్తం 40 కార్లలో ర్యాలీగా సిట్ కార్యాలయానికి బయలుదేరారు. అయితే... పోలీసులు దశలవారీగా వాహనాలను అడ్డుకున్నారు. గూడవల్లి జంక్షన్‌కు వచ్చేసరికి 11 కార్లకు కుదిరించారు. రామవరప్పాడు సర్కిల్‌కు రాగానే మరో 9 కార్లను అడ్డుకున్నారు. చివరికి... మిథున్ రెడ్డి ఉన్న కారుతోపాటు మరో వాహనాన్ని మాత్రమే అనుమతించారు. అందులోనూ... మిథున్ రెడ్డి ఉన్న కారును మాత్రమే సీపీ కార్యాలయంలోనికి అనుమతించారు. దీనిని వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం నడుపుకొంటూ వచ్చారు.

ఇది నిలబడే కేసు కాదు: మిథున్ రెడ్డి

గన్నవరం విమానాశ్రయం వద్ద, సీపీ కార్యాలయంలోకి వెళ్లే ముందు స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మద్యం కేసు కోర్టులో నిలబడదని జోస్యం చెప్పారు. "చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ నా కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు తప్పుడు కేసులు బనాయించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్షలతో పెట్టింది. ప్రస్తుతానికి అరెస్టు చేసి ఆనందపడవచ్చేమో కానీ, ఇది నిలబడే కేసు కాదు" అని అన్నారు.



గోదాంలో దగ్ధమవుతున్న సరుకులు

ఐటీసీ గోదాం ఆహుతి

- విశాఖలో భారీ అగ్నిప్రమాదం.. నిత్యావసర సరుకులన్నీ దగ్ధం
- కూలిన పైకప్పు.. కోట్లలో ఆస్తి నష్టం



కూలిపోయిన గోదాం పైకప్పు

ఆనందపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఐటీసీ కంపెనీకి చెందిన గోదాంలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అక్కడ నిల్వ చేసిన నిత్యావసర సరుకులన్నీ దగ్ధం అయ్యాయి. ఆస్తి నష్టం రూ. కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం మండలం గండిగుండం-రామవరం రహదారిలో ఉన్న గోదాంలో రాత్రి సుమారు 12 గంటలకు మంటలు మొదలయ్యాయి. కొద్ది సేపటికే మొత్తం వ్యాపించాయి. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి నుంచి ఎనిమిది అగ్నిమాపక శకటాలు వచ్చాయి. శనివారం ఉదయానికి మంటలను పూర్తిగా అదుపు చేయగలిగారు. అయితే సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో గల ఈ గోదాంలో సరుకులన్నీ దాదాపు అగ్నికి పూర్తిగా ఆహుతయ్యాయి. పైకప్పు కూడా కూలిపోయింది. ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కోల్‌కతాకు చెందిన బాబీ ఘోష్, మరికొంతమంది ఈ గోదాంను లీజుకు తీసుకున్నారు. ఇక్కడి నుంచి ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఐటీసీ ఉత్పత్తులు సరఫరా చేస్తుంటారు. ఈ గోదాం కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు వికృతి శ్రీనివాసరావుదిగా స్థానికులు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

చురుగ్గా 'నైరుతి'

- నేడు, రేపు పలుచోట్ల భారీ వర్షాలు.. 24న అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా మీదుగా తూర్పు, పడమరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇంకా బిహార్ నుంచి జార్ఖండ్ మీదుగా ఒడిశా వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో కొనసాగిన ఎండ తీవ్రతతో వాతావరణంలో అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో శనివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతుండటంతో బంగాళాఖాతం నుంచి భారీగా వచ్చే తేమగాలులతో ఈ నెల 23 వరకూ రాష్ట్రంలో వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా 24న ఉత్తర ఒడిశాకు ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో ఉత్తర కోస్తాలో వర్షాలు కురిసే వాతావరణం కొనసాగుతుందని వివరించింది. కాగా, రాష్ట్రంలో రానున్న 48 గంటల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆదివారం అల్లూరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగతా జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ప్రేమకథ @1800

(మొదటి పేజీ తరువాయి)

'బందరు తాజ్‌మహల్'గా భాసిల్లుతోంది. బ్రిటీష హయాంలో మాసులీపట్నంగా పిలిచే నేటి బందరులో ఈ ఆంగ్లేయ జంట విషాద ప్రేమ గాథకు సాక్షిగా ఈ మహల్ నిలిచింది. అరబెల్లా భౌతిక కాయం రసాయనాలతో నిక్షిప్తమై ఒక గాజు పెట్టెలో ఇప్పటికీ భూగర్భంలో ఉంది. పీటర్, అరబెల్లా ఇద్దరూ ఆంగ్లేయులే అయినా వీరి ప్రేమ పెళ్లి దాకా వెళ్లలేదు. పెళ్లి చేసుకోవటానికి వీరు చేసిన పోరాటం ఫలించలేదు. చివరకు ఇద్దరూ సహజీవనం చేసినా ఎక్కువకాలం సాగలేదు. తమ ప్రేమ పెళ్లిగా సాకారం కానందుకు మనోవ్యథతో అరబెల్లా.. ప్రియురాలి మరణంతో కోలుకోలేకపోయిన పీటర్ అనారోగ్యంతో మరణించారు. ఇలా ఈ జంట ప్రేమ విషాదంగా ముగిసింది.



అరబెల్లా సమాధి వద్ద పీటర్ ఏర్పాటు చేసిన శిలాఫలకం

నెరవేరని అరబెల్లా కోరిక

అరబెల్లాను వివాహం చేసుకోవాలన్న పీటర్ ఆశ నెరవేరకపోవడంతో ఆమెను తన ఇంటికి ఆహ్వానించి భార్యాభర్తలుగా మెలిగారు. సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోకపోవడంతో వీరి ప్రేమను, సహజీవనాన్ని అక్కడివారు ఆమోదించలేదు. సంప్రదాయ పద్ధతిలో తెల్లటి వస్త్రాలు, విలువైన ఆభరణాలు ధరించి అందరి ముందు పీటర్ భార్యగా నిలవాలన్నది అరబెల్లా కోరిక. పెద్దల సమక్షంలో పీటర్‌ను వివాహం చేసుకోవాలని ఉందని అరబెల్లా ఎన్నోసార్లు తన తల్లిదండ్రులను కోరినా వారు అంగీకరించలేదు. దీంతో పీటర్, రాబన్‌సన్ మధ్య కలతలు ఏర్పడ్డాయి. వివాహం జరగకపోవడం, ప్రియుడు, తండ్రి మధ్య వివాదంతో అరబెల్లా మానసికంగా కుంగిపోయారు. చివరకు అనారోగ్యంతో 1809 నవంబరు 6వ తేదీన తన ప్రేమికుడు పీటర్ చేతిలో ఆమె కన్నుమూశారు.

ఆ బంధం అపురూపం

రెండు శతాబ్దాల క్రితమే పీటర్ టెక్నాలజీని వాడారు. మహల్‌లో అరబెల్లా శిలాఫలకం పక్కనే ఒక మీటను ఏర్పాటు చేశారు. ఆ మీటను నొక్కగానే అండర్ గ్రౌండ్‌లో అరబెల్లా భౌతికకాయం ఉంచిన గాజు పెట్టె పైకి వచ్చేది. అలా అరబెల్లాను చూస్తూ ఆమెతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ పీటర్ కన్నీరుమున్నీరయ్యేవారు. కొన్నేళ్లకు పీటర్ మద్రాసుకు బదిలీ అయ్యారు. మద్రాసుకు వెళ్లేటపుడు 1819లో తన ప్రేయసి మహల్‌కు సెయింట్ మేరీస్ చర్చిగా పీటర్ పేరు పెట్టారు. మద్రాసుకు వెళ్లాక పీటర్ తన ప్రేయసి జ్ఞాపకాలతో కుంగిపోయారు. తీవ్ర అనారోగ్యంతో 1819లో కన్నుమూశారు. ఆయన పేరిట మద్రాసులో బ్రిటీష్ అధికారులు ఒక పార్కును ఏర్పాటు చేశారు. ఒక రోడ్డుకు పీటర్ పేరు పెట్టారు. అరబెల్లా, పీటర్‌ల ప్రేమగాథ చరిత్రగా మిగిలిపోయింది. ఇప్పటికీ బందరు సెయింట్ మేరీస్ చర్చిలో ప్రతి ఆదివారం సాయంత్రం ప్రార్థనలు జరుగుతాయి. బందరు తాజ్‌మహల్‌గా పేరుపొందిన సెయింట్ మేరీస్ చర్చిని పర్యాటకులు సందర్శిస్తుంటారు.

అరబెల్లా మరణించినా...

బందరుకోట దగ్గర సెయింట్ జాన్స్ స్మశానంలో అరబెల్లా భౌతిక కాయాన్ని సమాధి చేసేందుకు మతపెద్దలు అంగీకరించలేదు. దీంతో అప్పటి కప్పుడు పీటర్ ఆనందపేటలో రూ.18 వేలతో 15 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అరబెల్లా భౌతికకాయం పాడవకుండా ఉండటానికి ఈజిప్ట్ దేశం నుంచి కొన్ని రసాయనాలు, సుగంధ ద్రవ్యాలను తెప్పించారు. ఒక గాజు పెట్టెలో రసాయనాలు, సుగంధ ద్రవ్యాలను పోసి అందులో ఆమె భౌతికకాయాన్ని ఉంచారు. అరబెల్లా మృతిచెందినా ఆమె భౌతికకాయాన్ని చూసుకుంటూ పీటర్ తన ప్రేమను బతికించుకుందామనుకున్నారు. అరబెల్లాను చూడాలనుకున్నప్పుడల్లా ఆమె పార్థివదేహాన్ని చూస్తూ ఆమె తనతో మాట్లాడుతున్నట్టుగా పీటర్ భావించేవారు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. అరబెల్లా సమాధి ఉండే ప్రాంగణాన్ని ఒక అద్భుతమైన సుందర భవనంగా తీర్చిదిద్దారు. ఈ మహల్‌లో అరబెల్లా ఉపయోగించిన బంగారపు చెవిదిద్దులు, నెక్లెస్‌లు, కాళ్లకు ధరించే ఆభరణాలు, తెల్లటి వస్త్రాలు తదితరాలను ఉంచారు. అరబెల్లాతో తనకున్న అనుబంధాన్ని తెలిపేలా పీటర్ ఒక శిలాఫలకాన్ని ఏర్పాటు చేయించారు. ఈ శిలాఫలకానికి ఎదురుగా భూమి అడుగు భాగంలో అరబెల్లా భౌతికకాయం ఉంచిన గాజు పెట్టెను పెట్టారు. ఈ మహల్‌ను బందరు తాజ్‌మహల్‌గా తర్వాత క్రమంలో పిలిచేవారు.

1998లో సమాధి మూసివేత

రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి కృష్ణా జిల్లాలో సెయింట్ మేరీస్ చర్చిలో పనిచేస్తున్న ఒక పనిమనిషి గోడకు అమర్చిన మీటను తాకాడు. దీంతో అరబెల్లా శవం పైకి వచ్చింది. దాన్ని ఒక్కసారిగా చూసి గుండె ఆగి మృతి చెందాడు. ఈ సంఘటన జరిగిన అనంతరం 1998లో అప్పటి కలెక్టర్ బీఆర్ మీనా గ్రానైట్ వేయించి అరబెల్లా సమాధిని శాశ్వతంగా మూసివేయించారు. ఇప్పటికీ సెయింట్ మేరీస్ చర్చిలో అరబెల్లా సమాధి కనబడుతుంది.

- విజయవాడ/మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి

బందరు తాజ్‌మహల్ 'ప్రత్యేకత'

ఆగ్రా తాజ్‌మహల్ ప్రపంచ వింతల్లో ఒకటి అయితే.. బందరు తాజ్‌మహల్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఆగ్రాలో షాజహాన్ భార్య ముంతాజ్ సమాధి ఉండగా.. బందరులో పీటర్ ప్రియురాలు అరబెల్లా సమాధి ఉంది. అప్పట్లో రసాయనాలతో నిక్షిప్తం చేసి ఒక గాజు పెట్టెలో అరబెల్లా భౌతికకాయం ఉంచారు. పీటర్ బతికున్నప్పుడు ఆమె భౌతికకాయాన్ని చూసేవారు. 1998లో ఈ సమాధిని శాశ్వతంగా మూసివేశారు.

అరబెల్లా ప్రేమలో పీటర్

1800ల్లో మచిలీపట్నం (అప్పట్లో మాసులీపట్నం)లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో బందరుకోట కెప్టెన్ రాబిన్‌సన్ ఆధిపత్యంలో ఉండేది. రాబిన్‌సన్ కుమార్తె అరబెల్లా అందగత్తె. కెప్టెన్ రాబిన్‌సన్ దగ్గర మేజర్ జనరల్‌గా పీటర్ పనిచేసేవారు. సౌందర్యవతి అయిన అరబెల్లాను చూసి ముగ్ధుడైన పీటర్ ఆమెను ప్రేమించారు. తన ప్రేమ ప్రతిపాదనను ఆమెకు పంపారు. అప్పటికే బ్రిటీష్ సైన్యంలో మేజర్ జనరల్ పీటర్ శక్తిసామర్థ్యాల గురించి తెలుసుకున్న అరబెల్లా అతడి ప్రేమ సందేశాన్ని కాదనలేదు. అరబెల్లాను వివాహం చేసుకుందామని పీటర్ ప్రయత్నించారు. కానీ అరబెల్లా తండ్రి కెప్టెన్ రాబిన్‌సన్ ఇందుకు అంగీకరించలేదు. మతాధిపతులు కూడా ఈ వివాహానికి అడ్డు తగిలారు.

ఒక చిన్న మాత్ర.. శృంగార యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

లేదేమోనన్న అనుమానాలు భార్యకు, తానేమీ చేయలేకపోతున్నాన్న కుంగుబాటు భర్తకు కలుగుతున్నాయి. ఇది ఇద్దరి మధ్య దూరం పెరిగి విడాకుల వరకు వెళ్తోంది. ఇలా సమస్యలు ఎదుర్కొంటున్నవారిలో చాలామంది 25, 30 ఏళ్ల యువకులేనని.. ఒకసారి నాటుకుపోయిన భయం వారిని శృంగార జీవితానికి దూరం చేస్తోందని సెక్సాలజిస్టులు, ఆండ్రాలజిస్టులు చెబుతున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు స్వల్ప మోతాదులో వయాగ్రాను కొంతకాలం పాటు వాడాలని సూచిస్తున్నామని, ఇది వారి లైంగిక సామర్థ్యంపై నమ్మకం రావడానికి తోడ్పడుతోందని వివరిస్తున్నారు.

20శాతానికిపైగా యువతే..

శృంగార సామర్థ్య సమస్యలతో తమ వద్దకు వస్తున్నవారిలో 20 శాతం మందికిపైగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసువారే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. 40 నుంచి 60 ఏళ్ల మధ్యవారు 60శాతం.. 60 ఏళ్లు దాటినవారు మిగతా 20 శాతం మంది ఉంటున్నారని వివరిస్తున్నారు. వీరిలో 80శాతం మంది ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలతో శీఘ్రస్ఖలనం, అంగ స్థంభన ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారని.. చాలామందిలో కౌన్సెలింగ్, స్వల్ప మోతాదులో వయాగ్రాతో పరిస్థితి చక్కబడుతోందని వివరిస్తున్నారు.

అతిగా వాడితే సమస్యలు తప్పవు!

"వయాగ్రా ఎక్కువ డోసు వేసుకుంటే ఎక్కువ సమయం, ఎక్కువ సార్లు శృంగారం చేయవచ్చనే భావనతో కొందరు ఎక్కువ డోసుల్లో, తరచూ వేసుకుంటారు. వైద్యుల సలహా లేకుండా విపరీతంగా వాడటం ఇబ్బందులకు దారితీస్తుంది. అధిక మోతాదులతో పురుషాంగం దెబ్బతినే ప్రమాదమూ ఉంటుంది. వెన్నెముక సమస్య, నడుము నొప్పి, బీపీ, మధుమేహం, థైరాయిడ్ వంటి ఇబ్బందులు ఉన్నవారూ.. సమస్యలు నియంత్రణలోకి వచ్చేవరకు వయాగ్రా వాడితే చాలు. కొందరు 6 నెలల నుంచి ఏడాది వాడాల్సి వస్తుంది. అప్పటికీ సమస్య తీరకుంటే పినైల్ ఇంప్లాంట్, ఇతర చికిత్సలు అవసరం పడతాయి"

- డాక్టర్ శ్రీకాంత్ మున్నా, ఆండ్రాలజిస్టు, కిమ్స్ ఆస్పత్రి

తాత్కాలికంగా సూచిస్తున్నాం

"శీఘ్ర స్ఖలనం, అంగ స్థంభన సమస్యలతో నెలకు 80 నుంచి 90 మంది వస్తున్నారు. అందులో 20 మందికిపైగా 25, 30 ఏళ్ల యువకులే ఉంటున్నారు. భార్యను సంతృప్తిపర్చలేకపోతున్నామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వారికి పరీక్షలు చేసి, అవసరం మేరకు వయాగ్రా సూచిస్తున్నాం. స్వల్పంగా 2.5 ఎంజీ (మిల్లీగ్రాములు) నుంచి 20ఎంజీ వరకు వాడాలని చెబుతున్నాం. తక్కువ మోతాదులో నెలా రెండు నెలలు ఇచ్చి, వారిలో శృంగార సామర్థ్యంపై విశ్వాసం పెరిగేలా చూస్తున్నాం"

- డాక్టర్ ప్రియాంక్ సలేచా, ఆండ్రాలజిస్టు, అపోలో ఫెర్టిలిటీ ఆస్పత్రి

విచ్చలవిడిగా పెరిగిపోయిన వినియోగం

శృంగార పటుత్వ సమస్యలతో బాధపడుతున్నవారు, మరింతగా ఆనందం పొందవచ్చనే భావనతో ఉండేవారు కొందరు విచ్చలవిడిగా వయాగ్రాను వినియోగిస్తున్నారు. వైద్యులను సంప్రదించకుండానే, తగిన ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల దుకాణాల్లో, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో వయాగ్రా మాత్రలను కొని వినియోగిస్తున్నారు. దీనితో చాలామంది సరైన అవగాహన లేక అధిక మోతాదులో వాడుతున్నారు. అవసరం లేకున్నా ఇలా వయాగ్రాను వాడటం సమస్యాత్మకంగా పరిణమిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం

- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి
- విశాఖ బీచ్ రోడ్డులో తలసేమియా రన్ నిర్వహణ



విశాఖ బీచ్ రోడ్డులో జెండా ఊపి తలసేమియా రన్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి, కరణం మల్లీశ్వరి, తమన్

విశాఖపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): తలసేమియా సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు అండగా ఉండేందుకే తలసేమియా రన్ నిర్వహించామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మాజీ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌తో కలిసి విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డులో ఆమె జెండా ఊపి 10కే, 5కే, 3కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకుకు చిన్నారులతో వచ్చిన కొందరు తల్లులు.. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయించగలరా? అని అడగడంతో.. వారి కోసం ఏదైనా చేయాలనే నిర్ణయంతో తలసేమియా రన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయించడంతోపాటు ఫిల్టర్స్, ఆరు వేల రూపాయల విలువజేసే మందులు అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకూ ఎనిమిది లక్షల మందికి రక్తాన్ని అందించామని, 15 వేల ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని చెప్పారు. కరణం మల్లీశ్వరి మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాల్ పార్టీ ఎంతో... వైసీపీ అంతే..!: అచ్చెన్న

టెక్కలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఏదో ఒక రూపంలో అలజడి సృష్టించడానికి జగన్ పూనుకున్నారు. దీన్ని అడ్డుకుని తీరుతాం. ఆయన ఆటలు సాగనివ్వం' అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'జగన్ మాట్లాడితే తాను ప్రతిపక్ష నాయకుడ్ని అని చెబుతున్నారు. రాష్ట్ర ప్రజలు ఆ ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. రాష్ట్రంలో పాల్ పార్టీ ఎంతో వైసీపీ కూడా అంతే. వైసీపీ నాయకులు అమరావతిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ, బీసీలను ఊచకోత కోశారు. దళితుల్ని చంపి డోర్ డెలివరీ చేశారు. ఈ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. ఇందులో రూ.6 లక్షల కోట్లకు ఎంవోయూలు జరిగాయి' అని అచ్చెన్న పేర్కొన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.*